Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 1 సంచిక : 298 మేడ్చల్ మల్కాజ్‌గిరి 16 నవంబర్ 2023 గురువారం పేజీలు : 4

## ఖర్గే, రాహుల్‌తో శరద్ పవార్ భేటీ

న్యూఢిల్లీ : కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీని నేషన లిస్ట్ కాంగ్రెస్ పార్టీ చీఫ్ శరద్ పవార్ కలిశారు. ఢిల్లీలోని ఖర్గే నివాసంలో దాదాపు 40 నిమిషాల పాటు వారు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా, ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, రాబోయే అసెంబ్లీ ఎన్నికలు, సార్వత్రిక ఎన్నికల్లో ఎన్డీయే కూటమిని ఎదుర్కొనేందుకు 'ఇండియా' భవిష్యత్తు ప్రణాళికలపై వారు చర్చించినట్లు తెలిసింది. అలాగే 'ఇండియా' కూటమి తదుపరి సమావేశానికి సంబంధించిన ప్రణాళికలు రూపొందించినట్లు తెలిసింది.



# ఇక ప్రాంతీయ పార్టీలదే హవా

## 2024 తర్వాత దేశంలో సంకీర్ణ ప్రభుత్వమే : సీఎం కేసీఆర్

### నిజామాబాద్ బీఆర్ఎస్ ప్రజా ఆశీర్వాద సభలో కేసీఆర్

నిజామాబాద్ : రాబోయే రోజుల్లో ప్రాంతీయ పార్టీలదే హవా ఉంటుంది.. ఈ జాతీయ పార్టీల హవా ఉండదు అని ముఖ్యమంత్రి కేసీఆర్ స్పష్టం చేశారు. 2024 తర్వాత దేశంలో వచ్చేది సంకీర్ణ ప్రభుత్వమే.. ఏక పార్టీ ప్రభుత్వం రాదు. అన్ని ఎంపీలు మనం గెలుచుకుంటే బీఆర్ఎస్ తడాఖా అప్పుడు ఢిల్లీలో చూపెడుదాం అని కేసీఆర్ చెప్పారు. నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ ప్రజా ఆశీర్వాద సభలో కేసీఆర్ పాల్గొని ప్రసంగించారు. తెలంగాణలో అన్ని వర్గాల ప్రజలను ఆదుకుంటున్నాం. హిందూ, ముస్లిం, క్రైస్తవుల అనే తేడా లేకుండా అన్ని మతాల ప్రజలను కలుపుకొని పోతున్నాం. అందర్నీ సమానంగా ఆదరిస్తున్నాం. ప్రతి స్కీంలో అందరూ భాగస్వామ్యం అవుతున్నాం. అన్ని మతాల వారిని సమానంగా చూస్తున్నాం. తెలంగాణ కల్చర్ గంగా జమునా తెహజీబ్. హిందూ, ముస్లింలు అందరూ సోదరుల్లా కలిసి ఉండి మొత్తం ప్రపంచానికి ఉదాహరణగా ఉంటున్నాం.

న పదేండ్లలో ఒక్కసారంటే ఒక్కసారి కూడా కర్ఫ్యూ లేదు, కల్లోలం లేదు. బ్రహ్మాండంగా శాంతియుతంగా ముందుకు పోతున్నాం. లా అండ్ ఆర్డర్ పటిష్టంగా మెయింటెన్ చేస్తున్నాం. రాష్ట్రాన్ని అద్భుతంగా ముందుకు తీసుకుపోతున్నాం.. బీఆర్ఎస్ ముమ్మాటికి సెక్యులర్ పార్టీ అని కేసీఆర్ స్పష్టం చేశారు.

**బీజేపీ మతపిచ్చితోని మంటలు పెట్టే పార్టీ..** బీజేపీ మతపిచ్చితోని మంటలు పెట్టే పార్టీ. మాటమాటకు మతం పిచ్చి మాటలు. ప్రజలను డివైడ్ చేయడం వంటి పనులు చేస్తోంది. బీజేపీ మనకు ఎంత మోసం చేసిందంటే.. దేశ వ్యాప్తంగా 157 మెడికల్ కాలేజీలు మంజూరు చేసి తెలంగాణకు ఒక్క మెడికల్ కాలేజీ ఇవ్వలేదు. 100 ఉత్తరాలు రాశాను కానీ ఒక్కటంటే ఒక్క మెడికల్ కాలేజీ ఇవ్వలేదు. నవోదయ పాఠశాలలు ఇవ్వలేదు. జిల్లాకో నవోదయ పాఠశాల ఉండాలన్న చట్టాన్ని ఉల్లంఘించారు మోదీ. వంద సార్లు అడిగాను. ఒక్క నవోదయ పాఠశాల ఇవ్వలేదు. బావుల కాడ మోటర్లకు మీటర్లు పెట్టాలని చెప్పరు.. నేను పెట్టలేదు. ఇందుకు ఐదేండ్లకు రూ. 25 వేల కోట్లు కట్ చేశారు. బడ్జెట్ కట్ చేసి, నవోదయ, మెడికల్ కాలేజీ ఇవ్వని బీజేపీకి ఎందుకు ఓటు వేయాలి. ఇవన్నీ ఆలోచించాలి.

ఆలోచించి ఓటు వేయాలి. ఒక్క మెడికల్ కాలేజీ ఇవ్వని బీజేపీకి ఒక్క ఓటు కూడా వేయొద్దు. ఈ విషయాలపై బీజేపీ నాయకులను నిలదీసి అడగండి. కాంగ్రెస్, బీజేపీ తెలంగాణకు లాభం చేయలేదు.. నష్టం చేశాయి. తెలంగాణను కాంగ్రెస్ ముంచితే, బీజేపీ పదేండ్ల నుంచి కృష్ణాలో మన వాటా తేల్చదు. డబ్బులు రానివ్వదు. ప్రాజెక్టులకు అనుమతి ఇవ్వదు.. ఇలా చాలా ఇబ్బంది పెడుతుంది అని కేసీఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

# అమ్మకు అన్నం పెట్టనోడు చిన్నమ్మకు బంగారు గాజులు చేయిస్తడా..

## కాంగ్రెస్‌ను నమ్మితే అంతే: మంత్రి కేటీఆర్



వేములవాడ: కాంగ్రెస్ పార్టీ 60 ఏండ్లు దేశంలో, రాష్ట్రంలో అధికారంలో ఉండి ఏమీ చేయలేదని.. ఇప్పుడు గెలిపిస్తే అది చేస్తం, ఇది చేస్తం అని పార్టీ నేతలు కోతలు కోస్తున్నరని మంత్రి కేటీఆర్ విమర్శించారు. వేములవాడ నియోజకవర్గంలోని కథలాపూర్‌లో ఏర్పాటు చేసిన ఎన్నికల ప్రచార సభలో మంత్రి కేటీఆర్ ప్రసంగించారు. కాంగ్రెస్ మాటలు నమ్మవద్దని అన్నారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో అభివృద్ధి లేదని, అమ్మకు అన్నం పెట్టనోడు చిన్నమ్మకు బంగారు గాజులు చేయిస్తడా..? అని మంత్రి ప్రశ్నించారు.'2014కు ముందు తెలంగాణల కరెంటు గోస ఎట్లుండె. ఎవరన్న చచ్చిపోతే స్నానాల కోసం ఒక్క అరగంట కరెంటు ఇయ్యమని బతిమాలేటోళ్లు. రాత్రిపూట కరెంటు వచ్చేది. పొలాలకు నీళ్లు పెడుతందుకు రైతులు అర్ధరాత్రి బావుల కాడికివొయి పాములు కరిచి, తేళు కరిచి చచ్చిపోయింద్రు. దినమంత పనిచేసి కాసేపు పండుకుందామంటే కరెంటు లేక ఇంట్లె పంక తిరగకపోయేది. కరెంటు లేక ఇంత అస్తవ్యస్తమైన జీవితం ఉండేది. ఇప్పుడు ఆ అవస్తలు అన్నీ తీరిపోయినయ్. కాంగ్రెసోడు 60 ఏండ్లు చేయని పని, మేం ఆరున్నర ఏండ్లల్ల చేసినం. దయచేసి మీరంతా బాగా ఆలోచించండి. ఆలోచింది ఓటేయండి' అని మంత్రి ఓటర్లను కోరారు. 'ఎండకాలం వస్తే ఊర్లల్ల తాగునీళ్లకు అవస్తలు ఉండె. ప్రజాప్రతినిధులు ఊర్లల్లకు పోతందుకు బయపడేటోళ్లు. ఊర్లెకు పోతే మహిళలు బిందెలు పట్టుకుని ఏడ అడ్డం తిరుగుతరో అని గుబులు పడేటోళ్లు. ఇప్పుడా పరిస్థితి ఉందా..? కేసీఆర్ సీఎం అయినంక ఇంటింటికి మిషన్ భగీరథ నీళ్లు వస్తున్నయ్. ఇవన్నీ మీరు ఆలోచన చేయాలె. ఇంత అభివృద్ధి చేసినా కాంగ్రెసోడు, బీజేపోడు తప్పుడు కూతలు కూస్తుంద్రు. వాళ్ల మాటలు నమ్మి మోసపోకండి. బీఆర్ఎస్ రెండు సార్లు అధికారంలో ఉందిగా.. ఈసారి కాంగ్రెస్‌కు ఇద్దాం అని ఆడొగడు, ఈడొగడు అంటున్నరట. నిన్న అన్నం తిన్నమని, ఇయ్యాల తినమా..? మంచి చేసెటోళ్లను మళ్లమళ్ల గెలిపిస్తే తప్పేంది..? అయినా గతంలో 11 సార్లు అధికారంల ఉండి ఏం చేయని కాంగ్రెసోడు ఇప్పుడు చేస్త అంటే ఎట్ల నమ్ముతరు..?' అని మంత్రి కేటీఆర్ ప్రశ్నించారు. 'కాంగ్రెసోళ్లు ఏం చెప్తున్నరు..? మూడు గంటల కరెంటు చాలు రైతులకు అని కుళ్లా మాట్లాడుతున్నరు. ఏకంగా పీసీసీ అధ్యక్షుడే ఈ మాట అంటున్నడు. 10 హెచ్‌పీ మోటార్లు పెడితే పొలాలు అయ్యే పారుతయ్ అని చెప్తున్నడు. ఇట్లాంటి కాంగ్రెసోళ్లను మళ్లా గెలిపిస్తరా..? మళ్లా ఎనకటి రోజులు తెచ్చుకుంటరా..? 60 ఏండ్లు అధికారంల ఉండి ఏం జేయని సన్నాసోడు ఇప్పుడు చేస్తడా..? చేస్త అంటే నమ్ముదామా..? అమ్మకు అన్నం పెట్టనోడు చిన్నమ్మకు బంగారు గాజులు చేయిస్తడా..?' అని మంత్రి ఓటర్లను ఆలోచింపజేశారు.

## అమిత్ షా తెలంగాణ పర్యటనలో మార్పులు.. ప్రచారంలో స్పీడ్ పెంచిన బీజేపీ



హైదరాబాద్: తెలంగాణలో అధికారమే లక్ష్యంగా బీజేపీ ఎన్నికల ప్రచారంలో జోరు పెంచింది. అగ్రనేతలను ప్రచార బరిలోకి దింపుతోంది. దీపావళి పండుగ తర్వాత ప్రచారాన్ని ఉధృతం చేస్తామని బీజేపీ ఇప్పటికే చెప్పింది. అందులో భాగంగానే బీజేపీ అగ్రనేత, కేంద్రహోం మంత్రి అమిత్ షా ఈనెల 18 తెలంగాణలో ఎన్నికల ప్రచారంలో పాల్గొననున్నారు. నిజానికి 17న అమిత్ షా తెలంగాణకు రావాల్సి ఉండగా ఒకరోజు ఆలస్యంగా షెడ్యూల్‌లో మార్పులు చోటు చేసుకున్నాయి. ఒకేరోజు నాలుగు ప్రాంతాల్లో సభలు, రోడ్‌షోలలో కేంద్ర హోంమంత్రి పాల్గొననున్నారు. 18న ఉదయం 9 గంటల ప్రాంతంలో హైదరాబాద్‌కు చేరుకోనున్న అమిత్ షా అక్కడి నుంచి 10 గంటలకు గద్వాలలో, మధ్యాహ్నం 12 గంటలకు నల్గొండ సభల్లో పాల్గొననున్నారు. మధ్యహ్నం 2 గంటలకు వరంగల్ తూర్పు నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థి తరపున ప్రచారం చేయనున్నారు. అదే రోజు సాయంత్ర 4 గంటలకు హైదరాబాద్‌కు చేరుకుని జీహెచ్ఎంసీ పరిధిలోని రాజేంద్రనగర్ నియోజకవర్గంలో అమిత్ షా రోడ్ షో నిర్వహించనున్నారు. సాయంత్రం 6 గంటలకు ఢిల్లీకి తిరుగు ప్రయాణం కానున్నారు. ఎన్నికల ప్రచార సభలు, రోడ్ షోలతో బీజేపీ స్పీడ్ పెంచింది.

## ముగిసిన నామినేషన్ల ఉపసంహరణ గడువు



హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా 119 నియోజకవర్గల్లో నామినేషన్ల ఉపసంహరణకు గడువు ముగిసింది. అన్ని నియోజకవర్గాల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ పార్టీలతోపాటు స్వతంత్ర అభ్యర్థులు భారీ సంఖ్యలో నామినేషన్లు దాఖలు చేశారు. ఓటర్లను తమ వైపు తిప్పుకునేందుకు అన్ని పార్టీల నేతలు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. అయితే ప్రజలు ప్రస్తుత సర్కారును మళ్లీ అధికారంలో తెస్తారా.. లేక కొత్త ప్రభుత్వానికి పట్టం కడతార అన్నది తెలియాల్సి ఉంది. ఈ నెల 30న తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. డిసెంబర్ 3వ తేదీన ఎన్నికల ఫలితాలు వెల్లడికానున్నాయి.

# ఔర్ ఏక్ దక్కా.. కాంగ్రెస్ పక్కా

## సోనియమ్మ ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేసి తీరుతాం

### నిర్మల్ ఎన్నికల ప్రచారంలో టిపిసిసి అధ్యక్షులు రేవంత్‌రెడ్డి



నిర్మల్: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే నిర్మల్ మాస్టర్ ప్లాన్ రద్దు చేసే బాధ్యత తనదని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి అన్నారు. బుధవారం నాడు నిర్మల్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచారంలో రేవంత్‌రెడ్డి పాల్గొని మాట్లాడుతూ... "ఇంద్రకరణ్‌రెడ్డిని ఈ ఎన్నికల్లో ఓడించి బొందపెట్టడానికి వేలాదిగా తరలి వచ్చిన మీకు అభినందనలు. తెలంగాణలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడింది. అందుకే జెండాలు ఎజెండాలు, గ్రూపులు గుంపులు పక్కనబెట్టి కాంగ్రెస్ పార్టీని గెలిపించాలి. ఆనాడు చెప్పిన.. ఈనాడు చెబుతున్నా.. కొడంగల్ లాగే నిర్మల్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తాం. ప్రాజెక్టుల రీడిజైన్ పేరుతో కేసీఆర్ లక్ష కోట్లు దోచుకుండు. మామా అల్లుళ్ల చేతిలో చిక్కి ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టు అన్యాయానికి గురైంది. బీఆర్ఎస్ పాలనలో ఆదిలాబాద్ ఎడారిగా మారింది. నిర్మల్ మాస్టర్ ప్లాన్ మీ మెడ మీద కత్తిలా వేలాడుతుంది. ఎన్నికల కోసం మాస్టర్ ప్లాన్‌ను తాత్కాలికంగా వాయిదా వేశారు. మళ్లీ బీఆర్ఎస్ గెలిస్తే మాస్టర్ ప్లాన్ పేరుతో మీ భూములు గుంజుకుంటారు. మంత్రిగా ఉండి కూడా ఇంద్రకరణ్‌రెడ్డి ఇక్కడి ప్రజలకు డబుల్ బెడ్రూం ఇళ్లు ఇవ్వలేదు. అలాంటి ఇంద్రకరణ్‌రెడ్డికి ఎందుకు ఓటు వేయాలి. కాంగ్రెస్ అభ్యర్థి శ్రీహరి రావుకు ఈ ఎన్నికల్లో ఒక్క అవకాశం ఇవ్వండి. శ్రీహరిరావుకు ఓటు వేస్తే.. రేవంతన్నకు వేసినట్లే.. సోనియమ్మకు వేసినట్లే. సోనియమ్మ ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేసి తీరుతాం. ఔర్ ఏక్ దక్కా.. కాంగ్రెస్ పక్కా" అని రేవంత్‌రెడ్డి అన్నారు.

**కాంగ్రెస్ ఆరు గ్యారంటీలతో కేసీఆర్ వెన్నులో వణుకు :** కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీలతో సీఎం కేసీఆర్ వెన్నులో వణుకు పుట్టిందని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఎద్దేవ చేశారు. బుధవారం నాడు బోథ్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ..."ఆదివాసీలు , లాంబాడాలు కాంగ్రెస్ పార్టీకు రెండు కళ్లలాంటివారు. తెలంగాణలో 12 అసెంబ్లీ స్థానాల్లో 6 లాంబాడాలకు, 6 ఆదివాసీలకు ఇవ్వాలని కాంగ్రెస్ నిర్ణయించింది. బలరాం నాయక్ పెద్దమనసుతో ఆదివాసీ బిడ్డకోసం ఇల్లందు సీటు వదులుకున్నారు. పదవి కంటే ప్రజలకు మేలు జరగడం ముఖ్యమని ఆయన తన ఎమ్మెల్యే టికెట్ త్యాగం చేశారు. ఓటు చీలిపోకుండా కూడాల్సిన బాధ్యత మీపై ఉంది. తెలంగాణ వచ్చి పదేళ్లయినా బోథ్‌కు నీళ్లెందుకు రాలేదు? ఇక్కడి ప్రజలకు పోడు భూములకు పట్టాలు ఎందుకివ్వలేదు? తండాలను పంచాయతీలుగా చేశామని చెప్పుకునే కేసీఆర్ ఎన్ని పంచాయతీలకు భవనాలు కట్టించారు? గ్రామసర్పంచులకు వేల కోట్ల బకాయిలు ఇవ్వక ప్రభుత్వం వారిని ఆత్మహత్యలకు ఉసిగొల్పింది. కేసీఆర్ తన మేథస్సును రంగరించి కాళేశ్వరం కట్టానని చెబుతున్నాడు. కట్టిన మేడిగడ్డ మూడేళ్లలో కుంగిపోయింది... అన్నారం పగిలిపోయింది. బోథ్‌కు నీళ్లు రాకపోవడానికి ఈ దద్దమ్మ సీఎం కేసీఆరే కారణం. ఇక్కడి కుప్టీ ప్రాజెక్టు పూర్తి కావాలంటే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలి. బోథ్‌కు డిగ్రీ కాలేజీ రావాలంటే ఈ గడ్డపై కాంగ్రెస్ గెలవాలి. ఒక్కసారి ఈ బోథ్ గడ్డపై కాంగ్రెస్ పార్టీను గెలిపించండి. డిసెంబర్ 31లోపు బోథ్‌ను రెవెన్యూ డివిజన్ చేసే జిమ్మేదారి నాది.

కుప్టీ ప్రాజెక్టుకు నిధులు మంజూరు చేసి ప్రారంభోత్సవానికి వచ్చే బాధ్యత నాది. ఆదిలాబాద్ నుంచి అచ్చంపేట అడవుల వరకు కాంగ్రెస్ పార్టీను గెలిపించండి. ఆదిలాబాద్‌ను దత్తత తీసుకుని అభివృద్ధి చేస్తాం. తెలంగాణలో దొరలపాలన పోవాలి.. ఇందిరమ్మ రాజ్యం రావాలి. అప్పుడే పేద ప్రజలకు న్యాయం జరుగుతుంది. మాట తప్పని మడమ తిప్పని నాయకురాలు సోనియమ్మ. సోనియమ్మ ప్రకటించిన ఆరు గ్యారెంటీలను తెలంగాణలో అమలు చేసి తీరుతాం" అని రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు.

# సంపాదకీయం

## ఎన్నికల కమీషన్ సీరియస్ గా ఉందా ?

ఎన్నికల ప్రక్రియ జరుగుతున్న విధానంపై కేంద్ర ఎన్నికల కమీషన్ చాలా సీరియస్ గా ఉన్నట్లు సమాచారం. కారణం ఏమిటంటే అన్ని పార్టీలు యధేచ్ఛగా ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించటమే. ఎన్నికల నిబంధనలపై పోలీసులు ఇప్పటికి 450 ఎఫ్ఐఆర్ లు నమోదు చేశారంటేనే ఉల్లంఘనలు ఎంత ఎక్కువగా జరిగాయో అర్థమైపోతోంది. ఒకవైపు నిబంధలను ఉల్లంఘిస్తున్నారు మరోవైపు తాయిలాల పంపకాలు కూడా జరిగిపోతున్నాయి. దీంతోనే పోలీసింగ్ ఎంత వీకుగా జరుగుతోందో అర్థమైపోతోంది. శుక్రవారం నాటికే అన్నీ పార్టీల నుండి పంపిణీలో ఉన్న సుమారు రు. 550 కోట్ల విలువైన తాయిలాలను పట్టుకున్నారు. ఇందులో డబ్బే సుమారు రు. 200 కోట్లుంటుంది. ఇక బంగారం, వజ్రాలు, ఖరీదైన వస్తువులు, టీవీలు, కుక్కర్లు, లిక్కర్ బాటిళ్ళే కాకుండా కొత్తగా మాదకద్రవ్యాలు కూడా రవాణా అవుతున్నాయి. గతంలో బంగారం, వజ్రాలు, లిక్కర్ బాటిళ్ళు, మాదక ద్రవ్యాలు రవాణా అయ్యేవి కావు. ఎక్కడో గుట్టుచప్పుకాకుండా అందాల్సిన వాళ్ళకు అందేదంతే. కానీ ఇపుడు ప్రత్యేకంగా రవాణా కూడా చేసేస్తున్నారు. తాయిలాలు పంపిణీ జరుగుతున్నాయన్నా, 450 ఎఫ్ ఐ ఆర్లు నమోదయ్యాయన్నా నిబంధనలను అన్నీ పార్టీలు ఎంతగా ఉల్లంఘిస్తున్నాయో అర్థమైపోతోంది. ఎన్నికల్లో గెలుపు మాత్రమే అన్ని పార్టీలు టార్గెట్ పెట్టుకోవటంతో ఎన్నికల నిబంధనలను ఏ పార్టీ కూడా పట్టించుకోవటంలేదు. ఏ రెండుపార్టీలకూ ర్యాలీల కోసమని ఒకే రూటులో ఒకేసమయంలో అనుమతులు ఇవ్వద్దని కేంద్ర ఎన్నికల కమీషన్ చాలా స్పష్టంగా ఆదేశాలిచ్చింది. అయితే ఈ ఆదేశాలు కూడా అమలవ్వటంలేదు. నామినేషన్ల సమయంలో కొన్ని పార్టీల మధ్య గొడవలవ్వటానికి ర్యాలీలు కూడా కారణమే. అలాగే ఎన్నికల్లో ప్రచారం చేసుకునేటపుడు ఏ రెండుపార్టీలకు ఒకే సమయంలో ఒకే ఏరియాలో అనుమతులు ఇవ్వకూడదని కూడా ఆదేశాలున్నాయి. వీటిని పోలీసు అధికారులకు కూడా ఎన్నికల కమీషన్ అందించింది. ఇలాంటి నిబంధనలన్నింటినీ కలెక్టర్లు, ఎస్పీలు, అడిషినల్ ఎస్పీ, డీఎస్పీ, ఆర్డీవోలు, ఎంఆర్వోలతో కమీషన్ ప్రత్యేకంగా సమావేశాలు పెట్టి మరీ చెప్పింది. అయినా కొన్నిచోట్ల గొడవల్లయ్యాయంటేనే లా అండ్ ఆర్డర్ ఎంత బలహీనంగా పనిచేస్తోందో తెలిసిపోతోంది. ఇందుకనే కమీషన్ చాలా సీరియస్ గా ఉంది.

# జిల్లావ్యాప్తంగా ఎన్నికల బరిలో 126 మంది అభ్యర్థులు

### మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్



గరుడ వార్త మేడ్చల్ జిల్లా బ్యూరో: రాష్ట్ర శాసనసభ ఎన్నికల్లో భాగంగా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ ప్రశాంతంగా పూర్తయ్యిందని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ తెలిపారు. బుధవారం నామినేషన్ల ఉపసంహరణ తుది గడువు కాగా జిల్లాలోని ఐదు శాసనసభ నియోజక వర్గాలకు సంబంధించి ఆయా నియోజకవర్గాల్లో నామినేషన్లలో 64 మంది అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకోగా... 126 మంది ఎన్నికల బరిలో ఉన్నారని పేర్కొన్నారు. ఈ మేరకు జిల్లాలోని ఐదు శాసనసభ నియోజకవర్గాలకు సంబంధించి వివరాలను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ వివరించారు. మేడ్చల్(43) నియోజకవర్గానికి సంబంధించి మొత్తం 105 నామినేషన్లను స్వీకరించగా... స్క్రూటినీలో 38 మంది నామినేషన్లు తిరస్కరణకు గురికాగా అందులో 67 మిగిలాయి... అనంతరం 67 అభ్యర్థులలో 45 మంది నామినేషన్లను ఉపసంహరించుకోగా 22 మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో ఉన్నారు. మల్కాజిగిరి (44) అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి మొత్తం 49 నామినేషన్లను స్వీకరించగా... స్క్రూటినీలో 8 మంది నామినేషన్లు తిరస్కరణకు గురికాగా అందులో 41 మిగిలాయి... అనంతరం 41 మంది అభ్యర్థులలో 8 మంది నామినేషన్లను ఉపసంహరించుకోగా33 మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో ఉన్నారు. కుత్బుల్లాపూర్(45) అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి 32 నామినేషన్లను స్వీకరించగా... స్క్రూటినీలో 10 మంది నామినేషన్లు తిరస్కరణకు గురికాగా 22 మంది మిగిలారు... అనంతరం 22 మంది అభ్యర్థులలో 7 గురు తమ నామినేషన్లను ఉపసంహరించుకోగా 15 మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో ఉన్నారు. కూకట్పల్లి (46) అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి 38 నామినేషన్లను స్వీకరించగా... స్క్రూటినీలో 12 మంది నామినేషన్లు తిరస్కరణకు గురికాగా... 26 మంది మిగిలారు.. . అనంతరం 26 మంది అభ్యర్థులలో ఇద్దరు నామినేషన్లను ఉపసంహరించుకోగా... 24 మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో ఉన్నారు. ఉప్పల్ (47) అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి 37 మంది నామినేషన్లు స్వీకరించగా... స్క్రూటినీలో ముగ్గురు అభ్యర్థుల నామినేషన్లు తిరస్కరణకు గురికాగా... 34 మంది మిగిలారు... అనంతరం 34 మంది అభ్యర్థులలో ఇద్దరు అభ్యర్థులు నామినేషన్లను ఉపసంహరించుకోగా... 32 మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో నిలిచారు.

# జనసేవే లక్ష్యంగా రాజకీయాల్లో అడుగుపెట్టాను

### అందులో భాగంగానే సొంత నిధులు వెచ్చించి ఎన్నో గ్రామాల్లో మండలాల్లో రోడ్లు వేయించాను..మంత్రి మల్లారెడ్డి





శామీర్పేట (గరుడ వార్త) : గత పదేళ్లుగా నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ ముందుకు సాగుతున్నాను అందుకే ప్రజలు నన్ను గెలిపిస్తున్నారని మంత్రి మల్లారెడ్డి అన్నారు. బుధవారం షామీర్పేట మండల కేంద్రంలోని పెద్దమ్మ కాలనీలో మంత్రి మల్లారెడ్డి భారీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మల్లారెడ్డి మాట్లాడుతూ... బిఆర్ఎస్ ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి కట్టుబడి ఉందని మంత్రి మల్లారెడ్డి అన్నారు. అందులో భాగంగానే తమ ప్రభుత్వం గత తొమ్మిది సంవత్సరాల్లో ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి విజయవంతంగా అమలు చేస్తుందని గుర్తు చేశారు. ఇటు వ్యవసాయం అటు పారిశ్రామిక రంగాలను అభివృద్ధి చెందేందుకు ఎంతో కృషి చేసింది అన్నారు. అదేవిధంగా గణనీయమైన అభివృద్ధి సాధించగలిగామని అన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని ఆరోగ్య తెలంగాణ మార్చేందుకు తమ టిఆర్ఎస్ ప్రభుత్వం ఎనలేని కృషి చేసిందని, గాంధీ ,ఉస్మానియా ఆసుపత్రులతో పాటుగా మరో నాలుగు ఆసుపత్రులకు పనులు సైతం ప్రారంభించిందని మంత్రి మల్లారెడ్డి అన్నారు. కాంగ్రెస్ కల్లబొల్లి మాటలు నమ్మితే కంగారుపడి ఇబ్బంది పడాల్సింది తెలంగాణ ప్రజలమేనని మంత్రి మల్లారెడ్డి అన్నారు. వివిధ పార్టీలకు చెందిన ఎంతో మంది నాయకులు మంత్రి మల్లారెడ్డి సమక్షంలో బి ఆర్ ఎస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో షామీర్పేట్ మండల టిఆర్ఎస్ ప్రెసిడెంట్ సుదర్శన్ తో పాటుగా జిల్లా మండల గ్రామస్థాయి నాయకులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీకి బ్రహ్మరథం పట్టిన మూడు చింతలపల్లి, కొల్తూర్

### తెలంగాణ రాచరికపు పాలనలో కూడికపోయింది : మేడ్చల్ కాంగ్రెస్ అభ్యర్థి తోటకూర వజ్రేష్ యాదవ్



శామీర్ పేట (గరుడ వార్త) : 1200 మంది ఆత్మ బలిదానాలతో సాధించుకున్న తెలంగాణ రాచరికపు పాలనలో కూడుకు పోయిందంటూ తీవ్రంగా బిఆర్ఎస్ పార్టీపై మేడ్చల్ నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థి తోటకూర వజ్రేష్ యాదవ్ ధ్వజమెత్తారు. బుధవారం మూడు చింతలపల్లి మండల పరిధిలోని కొల్తూరు, మూడు చింతలపల్లి తదితర గ్రామాల్లో వజ్రేష్ యాదవ్ భారీ రోడ్ షో నిర్వహిస్తూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తెలంగాణలో బిఆర్ఎస్ అవినీతి పాలనకు చర్మ గీతం పాడాల్సిన సమయం ఆసన్నమైందని అన్నారు. ప్రజలు బిఆర్ఎస్ పాలనపై విసిగి వేసారి ఉన్నారని అన్నారు. ఈసారి కాంగ్రెస్ పార్టీ గెలవడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ప్రజలను దోచుకుంటున్న మంత్రి మల్లారెడ్డి పాలనపై మేడ్చల్ ప్రజలు సరైన బుద్ధి తప్పక చెబుతారని, ఈ సారి మేడ్చల్లో కాంగ్రెస్ జండా ఎగరటం కాయమని ధీమా వ్యక్తం చేసారు సీనియర్ నాయకలు నక్క ప్రభాకర్ గౌడ్ అన్నారు. ఈ కార్యక్రమంలో మూడు చింతలపల్లి మండల అధ్యక్షులు బొమ్మలపల్లి నరసింహులు,



వైస్ ఎంపీపీ శ్రీనివాస్ రెడ్డి, సీనియర్ నాయకులు మూడ్చింతలపల్లి మాజీ సర్పంచ్ లక్ష్మారెడ్డి తో పాటుగా గ్రామ, మండలస్థాయి నాయకులు కార్యకర్తలు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాలకు కొత్త ట్యాబ్‌లు

హుజూరాబాద్ : ఉమ్మడి జిల్లాలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలకు కొత్త ట్యాబ్‌లు సమకూర్చారు. ఇంతకుముందున్న ట్యాబ్‌ల సామర్థ్యం తక్కువగా ఉండటం, నిబంధనలు మార్చడంతో వివరాల నమోదులో సమస్యల కారణంగా ధాన్యం కొనుగోళ్లు ఆలస్యమవుతున్నాయి. దీంతో కొనుగోళ్లను మరింత ముమ్మరం చేసేలా ఆన్‌లైన్‌లో కచ్చితమైన వివరాల నమోదుకు ఆధునిక హంగులున్న ట్యాబ్‌లు సమకూర్చుకోవాలని ప్రభుత్వం ఆదేశించింది. యాసంగిలో ఐకేపీ, పీఏసీఎస్, డీసీఎంఎస్ ఆధ్వర్యంలో కరీంనగర్ జిల్లాలో 353, జగిత్యాలలో 419, పెద్దపల్లిలో 300, రాజన్న సిరిసిల్లలో 255 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. మొత్తంగా 1,327 కేంద్రాలకు గానూ 50శాతం ట్యాబ్‌లు 2018-19 కంటే ముందు కొనుగోలు చేసినవే కావడంతో కొత్తగా రూపొందించిన నిబంధనలు, సాఫ్ట్‌వేర్‌కు అనుగుణంగా అవి పనిచేయడం లేదు. సామర్థ్యం తక్కువగా ఉండటంతో వివరాలు నమోదు కావడం లేదు.

తాజా నిబంధనల ప్రకారం..

కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తరలించే ప్రతీ వాహనాన్ని రిజిస్ట్రేషన్ చేయాలి. ఇందుకు వాహనం నాలుగు దిక్కులా ఫొటోలు ట్యాబుల్లో నిక్షిప్తం చేయాలి. దీంతో పాటు వాహనం రిజిస్ట్రేషన్ చేసే సమయంలో ఖాళీ వాహనం కనిష్ఠ, గరిష్ఠ బరువు, ఛాసిస్ నంబరు తప్పులు లేకుండా నమోదు చేయాల్సి ఉంటుంది. 500 మెట్రిక్ టన్నుల వాహనం రవాణా శాఖ రిజిస్ట్రేషన్ అయి ఉండి కూడా ట్యాబ్‌లో వివరాలు చూపించకపోతే అలాంటి వాహనాలను రిజిస్టర్ చేసుకోవాలి. ఈ వివరాలన్నీ కచ్చితంగా ట్యాబ్‌లో నమోదై ఆమోదం పొందిన వాహనాల్లోనే ధాన్యం లోడింగ్



చేసి మిల్లులకు తరలించాలి. అప్పుడే ధాన్యం సేకరణ ప్రక్రియ పూర్తవుతుందని ప్రభుత్వం నిర్దేశించింది. కాగా ఈ వివరాల నమోదు, వాహనాల ఫొటోలు తీసుకునేందుకు సాఫ్ట్‌వేర్ సమస్య వల్ల పాత ట్యాబ్‌లలో నిక్షిప్తం కావటం లేదు. దీంతో కొత్త ట్యాబ్‌లను సమకూర్చుకోవాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. దీంతో కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు ఇప్పటికే కొత్తవి కొనుగోలు చేశారు. ఇందులో ప్రభుత్వం సూచించిన అన్ని అంశాలను నిక్షిప్తం చేసే అవకాశం ఉంది. కొనుగోళ్లకు సంబంధించిన యాప్‌ను నిక్షిప్తం చేసి కేంద్రాల నిర్వాహకులకు అంజేశారు. 2020 తర్వాత కొనుగోలు చేసిన ఆండ్రాయిడ్ ట్యాబ్‌లలో కొత్త సాఫ్ట్‌వేర్ వేసుకునే వెసులుబాటు ఉందని, కొత్తవి కొనుగోలు చేయాల్సిన అవసరం లేదని అధికారులు చెబుతున్నారు. తాత్కాలిక రిజిస్ట్రేషన్(ఆర్టీఏ), ఎఫ్-ఆర్ నంబర్ ఉన్న వాహనాలు ట్యాబ్‌లో నమోదు కావని, ఇలాంటి వాహనాల్లో ధాన్యం లోడింగ్ చేయవద్దని అధికారులు స్పష్టం చేస్తున్నారు. కాగా గతంలో కొనుగోలు చేసిన ధాన్యాన్ని ట్రాక్టర్లలో రైతులే కేటాయించిన మిల్లులకు తరలించేవారు. ఈసారి గుత్తేదారులు సమకూర్చిన వాహనాల్లోనే ధాన్యాన్ని తరలించాలనే నిబంధన విధించడంతో ఆ వాహనాలు వచ్చే వరకు వేచిచూడాల్సి వస్తోంది. కేంద్రాల నుంచి వాహనాల్లో ధాన్యం తరలించినా మిల్లుల్లో అన్‌లోడ్ చేయడంలో జాప్యం జరుగుతోంది. దీంతో ధాన్యం తరలింపునకు రెండు, మూడు రోజులు పడుతోందని నిర్వాహకులు అంటున్నారు. ఈ సమస్యతో ఎక్కువ శాతం ధాన్యాన్ని ట్రాక్టర్లలో మిల్లులకు తరలించేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

# దగ్గరి దారి మూత.. దూరాభారంతో వెత

గోదావరిఖని : నగరానికి ఆరు కిలోమీటర్ల దూరంలో గని.. దానిని చేరుకోవాలంటే 12 కిలోమీటర్లు తిరిగి వెళ్లాలి. కార్మిక కాలనీలు దాటగానే కనిపించే గనికి ప్రస్తుతం మంథని రహదారి మీదుగా ప్రయాణం చేయాలి. ఇక్కడికి చేరుకోవాలంటే గోదావరిఖనిలో నివసించే ఉద్యోగులకు కనీసం 20 నిమిషాల సమయం పడుతుంది. అంతకు ముందు కేవలం ఆరు నిమిషాల్లో గనికి చేరుకునే ఉద్యోగులకు ప్రస్తుతం దూరాభారం పెరిగింది. జీడీకే-5 ఉపరితల గని ఏర్పాటు కావడంతో 11వ గని కార్మికులకు కష్టాలు మొదలయ్యాయి. 1800 మంది ఉద్యోగులు పనిచేసే జీడీకే-11 గనిలో మూడు షిఫ్టులతో పాటు ప్రీషిఫ్టు, జనరల్ షిఫ్టు, ఉదయం 9 గంటల సమయానికి మరో షిఫ్టుల్లో కార్మికులు విధులు నిర్వహిస్తున్నారు. జీడీకే-11 గనికి గతంలో ఫైవింక్లైన్ మీదుగా నర్సరీ ముందు నుంచి వెళ్లే వారు. కేవలం ఆరు కిలోమీటర్ల దూరంలో ఉన్న గనికి ఆరు నిమిషాల్లో చేరుకునే వారు. ప్రస్తుతం కొత్తగా ఏర్పాటు చేసిన రహదారి మీదుగా జీడీకే-11 గని కార్మికులు వెళ్లాల్సి వస్తుంది. జీడీకే-5 ఉపరితల గని, ఓసీపీ-3 ఉపరితల గనులకు చెందిన మట్టి కుప్పలు పాత రహదారికి ఇరువైపులా డంప్ చేశారు. వాటి మధ్యలోంచి ఉన్న రోడ్డును మూసివేశారు. మట్టికుప్పలు పోసి కార్మికుల రాకపోకలను నిలిపివేశారు. భద్రతా కారణాల దృష్ట్యా రహదారిని మూసివేసినట్లు అధికారులు చెబుతున్నారు. కేవలం ద్విచక్ర వాహనాలకు మాత్రమే అనుమతించి ఉద్యోగులకు దూరాభారం తగ్గించాలని గని కార్మికులు గతంలో ఆందోళన చేసి అధికారులకు వినతి పత్రం అందజేశారు.

కొత్త రహదారిపై విధులకుసింగరేణి యాజమాన్యం కొత్తగా నిర్మించిన రహదారిపై జీడీకే-11 వద్దకు 12 కిలోమీటర్లు ప్రయాణిస్తేనే కార్మికులు అక్కడికి చేరుకుంటున్నారు. ఓసీపీ-5 ఏర్పాటుతో కొత్తగా గంగానగర్ నుంచి నిర్మించిన రహదారి జీడీకే-1, 2, 2-ఎ గనుల సమీపం నుంచి సుందిళ్ల, గడ్డంపల్లి మీదుగా పెద్దంపేట అడ్డరోడ్డు వరకు వెళ్లి అక్కడి నుంచి తిరిగి వెనక్కి వస్తే గనికి చేరుకుంటారు. దీనికోసం 12 కిలోమీటర్లు చుట్టూ తిరగాల్సి వస్తుంది. కేవలం ఓసీపీ-5, ఓసీపీ-3 ఓబీ కుప్పల మధ్య నుంచి ఉన్న రహదారి మీదుగా ద్విచక్ర వాహనలకు అనుమతిస్తే ఉద్యోగులు సులువుగా గనికి చేరుకునే అవకాశం ఉంటుంది. దూరాభారం తగ్గడంతో పాటు విధులు ముగిసిన తర్వాత వెంటనే ఇళ్లకు చేరుకుంటారు. గనిలోకి దిగి విధులు నిర్వహించిన తర్వాత అలసిపోయి ఉండే కార్మికులు దూరం నుంచి తిరిగి కొత్త రహదారి వెంట ప్రయాణించాలంటే ఇబ్బంది పడుతున్నారు.

తప్పని ప్రమాదాలుప్రస్తుతం కొత్తగా నిర్మించిన రహదారి ప్రమాదాలకు కేంద్రంగా మారింది. సుందిళ్ల, ముస్త్యాల, గడ్డంపల్లి గ్రామాలను కలుపుతూ నిర్మించిన రహదారి మంథని ప్రధాన రహదారి కావడంతో వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటోంది. రెండో షిఫ్టు ముగిసిన తర్వాత రాత్రి ఇంటికి చేరుకునే కార్మికులు, రాత్రి షిఫ్టుకు వెళ్లే కార్మికులు ఇదే రోడ్డుపై ప్రయాణించాల్సి ఉంటుంది.

# శెభాష్.. సాహసి

పెనుబల్లి :ఒకవైపు మైనస్ 40 డిగ్రీల ఉష్ణోగ్రత.. మరోవైపు ఆక్సిజన్ స్థాయిలు తగ్గిపోతున్నాయి. అయినా పట్టుదలే ప్రాణవాయువుగా చేసుకుని యూరప్ ఖండంలోనే అత్యంత ఎత్తైన మౌంట్ ఎల్‌బ్రస్ పర్వతాన్ని అధిరోహించి ఔరా అనిపించాడు జిల్లా యువకుడు బర్మావతు మోతీకుమార్. మొదటి అడుగు కిలిమాంజరో పర్వతాన్ని ఎక్కి తొమ్మిది రోజుల పాటు సాహసయాత్ర చేసి శనివారం రెండో విజయం సొంతం చేసుకుని శెబాష్ అనిపించుకుంటున్నాడు.

పేదకుటుంబంలో పుట్టి

పెనుబల్లి మండలం వీఎం బంజర్‌లో నిరుపేద దంపతులు అలివేలు, రాంజాల కుమారుడు మోతీకుమార్. వీఎం బంజర్ సెంటర్లో తోపుడు బండిపై జామకాయలు అమ్మి కుటుంబాన్ని పోషిస్తున్నారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నా మోతీకుమార్ మాత్రం చదువు, క్రీడల్లో ముందుంటున్నాడు. రష్యాలో సముద్రమట్టానికి 5,642 మీటర్ల ఎత్తులో ఉన్న మౌంట్ ఎల్‌బ్రస్ పర్వతాన్ని చలిలోనే అధిరోహించి రికార్డు సృష్టించాడు. పర్వతం ఎక్కగానే తొలుత జాతీయజెండాను ఏర్పాటు చేసి జాతీయగీతాన్ని ఆలపించాడు. అక్కడే కలెక్టర్ గౌతమ్, ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, ఎంపీఐ సంగం వెంకటపుల్లయ్య, మంత్రి కేటీఆర్, ఎంపీ వద్దిరాజు రవిచంద్రతో పాటు కొత్తగూడెం లయన్స్‌క్లబ్,




సినీనటులు పవనకల్యాణ్, రాంచరణ్, బీఎస్పీ అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ప్రదర్శించి తన అభిమానం చాటుకున్నాడు.

ఆ ఏడు పర్వతాలు ఎక్కడమే లక్ష్యం: మోతీకుమార్

ఈ నెల 9న మౌంట్ ఎల్‌బ్రస్ పర్వతం ఎక్కడం ప్రారంభించాను. మధ్యలో ఆక్సిజన్ లెవల్స్ తగ్గిపోయాయి. కొంత ఇబ్బందికర పరిస్థితి వచ్చింది. కానీ నాపై నమ్మకంతో ఎంతోమంది దాతలు సాహసయాత్రకు సహాయం చేశారు. వారి నమ్మకాన్ని వమ్ముచేయకూడదని, ఆహారం లేకపోయినా పట్టుదలతో పర్వతం అధిరోహించి కల నెరవేర్చుకున్నాను. ప్రపంచంలో ఏడు ఎత్తైన పర్వతాలను అధిరోహించడం నా లక్ష్యం. వాటిలో మొదటిది కిలిమంజారో పర్వతాన్ని అధిరోహించాను. ప్రస్తుతం రష్యాలోని మౌంట్ ఎల్‌బ్రస్ పర్వతాన్ని ఎక్కాను. తరువాత ఎవరెస్ట్ పర్వతం అధిరోహిస్తాను. ఏడు పర్వతాలు ఎక్కి భారతదేశ కీర్తిని ప్రపంచ దేశాలకు చాటి చెప్పాలనేది లక్ష్యమనికు ఫోన్ ద్వారా వివరించారు.

# యాదృచ్ఛికీకరణ పూర్తి

కామారెడ్డి : ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో భాగంగా సాధారణ పరిశీలకుల సమక్షంలో సూక్ష్మపరిశీలనకు యాదృచ్ఛికీకరణ (ర్యాండమైజేషన్) పూర్తి చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి జితేశ్ వి పాటిల్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో సాధారణ పరిశీలకులు చిఫంగ్ ఆర్థర్ వర్చ్బాయియో, జగదీష్ పర్యవేక్షణలో ఈ ప్రక్రియ పూర్తి చేసినట్లు చెప్పారు. జిల్లాలోని మూడు నియోజకవర్గాలతో పాటు బాన్సువాడ నియోజకవర్గంలోని కొన్ని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలకు 126 మంది సూక్ష్మపరిశీలకులు అవసరం కాగా 164 మందిని నియమించినట్లు పేర్కొన్నారు. వారికి 25వ తేదీన కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. 285 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల ప్రక్రియ సజావుగా నిర్వహించడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. నోడల్ అధికారులు రాజారాం, రఘునాథ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

చురుకుగా పనిచేయాలి

ఎన్నికల విధుల్లో ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ, వీఎస్‌టీ, సీ-విజిల్ బృందాలు మరింత చురుకుగా పనిచేయాలని జిల్లా ఎన్నికల అధికారి జితేశ్ వి పాటిల్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సహాయ కేంద్రాన్ని సందర్శించి తగు సూచనలు చేశారు. నామినేషన్ల ఘట్టం ముగిసినందున ఫిర్యాదుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని.. ఎన్నికల బృందాలు



మరింత అప్రమత్తం కావాలన్నారు. సీ-విజిల్ యాప్‌తో పాటు 1950 కాల్‌సెంటర్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఫిర్యాదు చేయొచ్చు

ఎన్నికల అంశాలకు సంబంధించిన ఫిర్యాదులను సాధారణ పరిశీలకులుగా వచ్చిన చిఫంగ్ ఆర్థర్ వర్చ్బాయియోకు ఫిర్యాదు చేయొచ్చని జిల్లా ఎన్నికల అధికారి జితేశ్ వి పాటిల్ తెలిపారు. సాధారణ పరిశీలకులు అన్ని పనిదినాల్లో ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు కలెక్టరేట్‌లోని రూం నంబరు 102లో అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. ప్రజలు, ప్రజాప్రతినిధులు, పార్టీల అభ్యర్థులు ఆయనను నేరుగా కలవచ్చని సూచించారు. కలిసే అవకాశం లేకుంటే 63041 08748 నంబరుకు సంప్రదించాలన్నారు. %generalobserverkmrac@gmail.com% కు మెయిల్ ద్వారా కూడా ఫిర్యాదు చేయొచ్చని వెల్లడించారు.

# ఇంటింటి ప్రచారాలు.. అంతర్గత సమావేశాలు



కామారెడ్డి : ఉమ్మడి జిల్లాలో రాజకీయం వేడెక్కింది. నామినేషన్ల పర్వం ముగియడంతో సందడి నెలకొంది. పార్టీలు గెలుపునకు నువ్వా.. నేనా అన్నట్లు పోటాపోటీగా ఇంటింటి ప్రచారం చేస్తున్నాయి. ఎన్నికల మ్యానిఫెస్టోలను వివరిస్తున్నాయి. ప్రధాన రాజకీయ పార్టీల అగ్రనేతలు ప్రచార వ్యూహాలను సిద్ధం చేస్తూ.. తమ అభ్యర్థులు విజయం సాధించేందుకు సర్వశక్తులు ఒడ్డుతున్నారు. నియోజకవర్గాల్లో ప్రచారసరళిని సమీక్షిస్తూ అసంతృప్తులతో సమావేశమై బుజ్జగిస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలోని తొమ్మిది నియోజకవర్గాల్లో కామారెడ్డి నుంచి పోటీచేసేందుకు అత్యధికంగా 64 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. అత్యల్పంగా బాల్కొండ నుంచి 11 మంది అభ్యర్థులు నామపత్రాలు సమర్పించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ కామారెడ్డి నియోజకవర్గం నుంచి పోటీచేస్తున్న నేపథ్యంలో స్థానికులతో పాటు ఇతర ప్రాంతాలకు చెందిన వ్యక్తులు ఇక్కడి నుంచి పోటీచేసేందుకు ముందుకొచ్చారు. నామినేషన్ల స్క్రూటినీ, ఉపసంహరణల అనంతరం ఎందరు బరిలో నిలుస్తారనేది నిర్ధారణ కానుంది.

అసంతృప్తుల బుజ్జగింపులు

ద్వితీయ శ్రేణి నేతల అలకలు, అసంతృప్తులు ప్రధాన పార్టీల అభ్యర్థులకు తలనొప్పిగా మారాయి. బుజ్జగించేందుకు నానా తంటాలు పడుతున్నారు. నియోజకవర్గ స్థాయి నేతలను రాష్ట్ర పెద్దలు పిలిపించి మాట్లాడుతున్నారు. జిల్లాలోని ఓ నియోజకవర్గంలోని అసంతృప్త నేతలతో మాట్లాడేందుకు ఓ పార్టీ నలుగురు నాయకులతో ప్రత్యేకంగా ఓ కమిటీని నియమించింది. ఉమ్మడి జిల్లాలో ముఖ్యంగా అధికార భారాస, కాంగ్రెస్ పార్టీల్లో అసంతృప్తుల సంఖ్య ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది. స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, నాయకులతో అభ్యర్థులు నేరుగా మాట్లాడుతున్నారు. ఎమ్మెల్యేగా గెలిస్తే భవిష్యత్తులో మంచి అవకాశం కల్పిస్తామని భరోసానిస్తున్నారు.

ఎత్తుకు పైఎత్తులు ప్రధాన పార్టీల అభ్యర్థులు ఓటర్లను ప్రసన్నం చేసుకోవడానికి ఉదయం నుంచి రాత్రి వరకు ప్రచారంలో బిజీగా ఉంటున్నారు. రాత్రి పూట ముఖ్యనేతలతో అంతర్గత మంతనాలు జరుపుతున్నారు. ఆ రోజు జరిగిన పరిణామాలు తెలుసుకుంటున్నారు. ప్రతిపక్షాలు చేపడుతున్న ప్రచారాల గురించి ఆరా తీస్తూ ఎత్తులకు పై ఎత్తులు వేస్తున్నారు. తమ పార్టీ నుంచి ఇతర పార్టీలోకి వెళ్తున్న వారిని గమనిస్తూ.. ప్రతిగా ప్రత్యర్థి పార్టీల నుంచి చేరికలను ప్రోత్సహిస్తున్నారు.

సామాజికవర్గాలతో మంతనాలు

మూకుమ్మడిగా ఓట్లు రాబట్టేందుకు అభ్యర్థులు దృష్టిసారించారు. సామాజిక వర్గాలు, యువజన, మహిళా సంఘాలపై గురిపెట్టారు. పోలింగ్ కేంద్రం, గ్రామ స్థాయిల్లో సామాజిక వర్గాల ఓట్ల వివరాలను సేకరిస్తున్నారు. పెద్దలతో మంతనాలు జరుపుతున్నారు. వారి అవసరాలను తెలుసుకుని పరిష్కరిస్తామని హామీ ఇస్తున్నారు. స్వయం సహాయక సంఘాల సభ్యులను కలుస్తూ.. వారి ఓట్లను పొందేందుకు పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్తున్నారు.

# అతివ చేతిలో అస్త్రం



నిజామాబాద్ : శాసన సభ ఎన్నికలకు సంబంధించి అధికారులు తుది ఓటరు జాబితా ప్రకటించారు. ఉమ్మడి జిల్లాలో తొమ్మిది అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 20,67,939 మంది ఓటర్లు ఉన్నట్లు లెక్క తేల్చారు. నిజామాబ్మా జిల్లాలో ఆరు నియోజకవర్గాల్లో 13,94,986 మంది, కామారెడ్డిలో మూడు నియోజకవర్గాల పరిధిలో 6,72,953 మంది ఓటర్లు ఉన్నట్లు ప్రకటించారు. ఈ జాబితా ప్రకారమే ఎన్నికలు జరగనున్నాయి. అన్నిచోట్లా మహిళా ఓటర్లే అధికంగా ఉండటంతో వారే నిర్ణయాత్మక శక్తిగా మారారు.

28 రోజుల్లో 17,485 మంది కొత్తగా..ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించాలనే సంకల్పంతో ఎన్నికల సంఘం పలుమార్లు కొత్తగా ఓటు నమోదుతో పాటు మార్పులు చేర్పులకు అవకాశం కల్పించింది. ఆ తర్వాత అక్టోబరు 4వ తేదీన తుది ఓటరు జాబితా ప్రకటించింది. ఈ ప్రకారం నిజామాబాద్ జిల్లాలో 13,89,291 మంది, కామారెడ్డి జిల్లాలో 6,61,163 మంది ఓటర్లు ఉన్నట్లు పేర్కొన్నారు. అక్టోబరు 4 నుంచి 31 వరకు మరోసారి కొత్త ఓటర్ల కోసం అవకాశం ఇచ్చారు. ఈ 28 రోజుల్లో నిజామాబాద్ జిల్లాలో 5,695 మంది, కామారెడ్డి జిల్లాలో 11,790 మంది ఓటర్లు పెరగడం గమనార్హం. నిజామాబాద్ అర్బన్, కామారెడ్డి, ఆర్మూర్, బోధన్ పట్టణాల్లో స్వల్పంగా పెరిగారు.

మహిళలే అధికం

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో మహిళా ఓటర్లు అధికంగా ఉన్నారు. ఈ సారి నిర్ణయాత్మక శక్తిగా వారే ఉండనున్నారు. నిజామాబాద్ జిల్లాలో పురుషుల కంటే 72,008 మంది, కామారెడ్డి జిల్లాలో 18,914 మంది మహిళా ఓటర్లు ఎక్కువగా ఉండటం గమనార్హం. వీరిని ప్రసన్నం చేసుకోవడానికి పోటీలో ఉన్న అభ్యర్థులు ప్రత్యేక దృష్టి సారించారు.

ఒక కేంద్రంలో 1,400

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 2,340 పోలింగ్ కేంద్రాలున్నాయి. ఇది వరకు ఒక కేంద్రంలో 900, 1000, 1,200 ఇలా ఇష్టారీతిన ఓటర్లు ఉండే వారు. ఈ సారి అలా కాకుండా ప్రతి పోలింగ్ కేంద్రంలో 1,400 మంది ఓటర్లు ఉండేలా చూశారు. పైగా సమీప పోలింగ్ కేంద్రాల్లోనే ఓటర్లు ఉండేలా జాగ్రత్త పడ్డారు.

అన్ని నియోజకవర్గాల్లోనూ..

ఉమ్మడి జిల్లాలో అన్ని నియోజకవర్గాల్లోనూ ఓటర్లు పెరిగారు. నిజామాబాద్ అర్బన్‌లో 734, ఆర్మూర్‌లో 669, బోధన్‌లో 794, బాన్సువాడలో 733, నిజామాబాద్ గ్రామీణంలో 950, బాల్కొండలో 1,365, జుక్కల్‌లో 2,065, కామారెడ్డిలో 6,638, ఎల్లారెడ్డిలో 3,087 మంది కొత్తగా జాబితాలో చేరారు.

# ఆ గ్రామాలకు ఇవే చివరి ఎన్నికలు..!

మహబూబ్‌నగర్: గద్వాల నియోజకవర్గంలో చిన్నోనిపల్లి, ర్యాలంపాడు, నాగర్‌దొడ్డి గ్రామాలున్నాయి. ఈ మూడు గ్రామాల పరిధిలో 2,994 మంది ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్‌లో గతంలో నిర్మించిన ప్రాజెక్టులు, ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టుల పరిధిలోని ముంపు గ్రామాల్లో 2023 ఎన్నికలే చివరి సారి కానున్నాయి. ఎమ్మెల్యే ఎన్నికలకు ఓటేయడం ఇదే ఆఖరు అవుతుందని ఓటర్లు ఆయా గ్రామాల్లో చర్చించుకుంటున్నారు. ఇప్పటికే ఈ గ్రామాలకు ప్రభుత్వం ఆర్అండ్ఆర్ ప్యాకేజీ ప్రకటించింది. కొన్ని చోట్ల పునరావాసం, పరిహారం వంటి సమస్యలు ఉండటంతో ప్రస్తుతం ఆ ముంపు గ్రామాల్లోనే ప్రజలు నివాసం ఉంటున్నారు. జలాశయాలకు నీళ్లు వచ్చే నాటికి ఈ ముంపు గ్రామాల ప్రజలు ఇక్కడి నుంచి ఖాళీ చేసి ఆర్అండ్ఆర్ ప్యాకేజీలో భాగంగా ఏర్పాటు చేసిన పునరావాస గ్రామాలకు వెళ్లాల్సి ఉంటుంది. వచ్చే ఐదేళ్లల్లో పునరావాస గ్రామాల్లో పూర్తిస్థాయిలో మౌలిక వసతుల కల్పన పూర్తి అయ్యే అవకాశాలున్నాయి. చాలా వరకు ముంపు గ్రామాల ప్రజలకు ప్రభుత్వం పరిహారం అందించింది. పాలమూరులోని మక్తల్, జడ్చర్ల, వనపర్తి, దేవరకద్ర, గద్వాల నియోజకవర్గాల పరిధిలో ఈ ముంపు గ్రామాలున్నాయి. ఉమ్మడి జిల్లాలో మొత్తం 12 ముంపు గ్రామాలు ఉన్నాయి. ప్రస్తుతం ఆయా నియోజకవర్గాల్లో పోటీ చేస్తున్న ప్రధాన పార్టీ అభ్యర్థులు ముంపు గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. పరిహారం, ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీలో భాగంగా పునారావస కేంద్రంలో మౌలిక వసతులు వంటి వాటిపై ప్రజలు ఇప్పటికే పలు డిమాండ్లు చేస్తున్నారు. ఇదే అదనుగా తమకు పరిహారం పెంచడంతోపాటు పునరావాస కేంద్రాల్లో అదనపు సౌకర్యాలు కల్పించాలని అభ్యర్థుల్ని ప్రజలు కోరుతున్నారు.

మక్తల్ నియోజకవర్గంలో అంకెన్‌పల్లి, అనుగొండ, దాదాన్‌పల్లి,



భూత్పూర్ గ్రామాలు ఉన్నాయి. ఈ గ్రామాల పరిధిలో మొత్తం 4,037 మంది ఓటర్లు ఉన్నారు.

జడ్చర్ల నియోజకవర్గంలో ఉదండాపూర్, వల్లూరు ముంపు గ్రామాలు ఉన్నాయి. వీటి పరిధిలో మరో ఐదు తండాలు కూడా కలిసి ఉన్నాయి. ఇక్కడ మొత్తం 3,744 మంది ఓటర్లుగా నమోదయ్యారు.

దేవరకద్ర నియోజకవర్గంలో కానాయిపల్లి ముంపు గ్రామం కాగా ఇక్కడ 2,697 మంది ఓటర్లు ఉన్నారు.

వనపర్తి నియోజకవర్గంలో కొంకలపల్లి, బండరావిపాకుల ముంపు గ్రామాలుండగా ఇక్కడ 2,003 ఓట్లు ఉన్నాయి.

# జూరాలకు పెరిగిన ప్రవాహం

ధరూరు : జూరాల జలాశయంలోకి కొన్ని రోజులు కేవలం 1,500 క్యూసెక్కులలోపే ప్రవాహం చేరుతున్న క్రమంలో రబీలో ఆయకట్టు కింద సాగు రైతుల్లో ఆందోళన నెలకొంది. కొంత నీటి సమస్య ఉన్నా ఖరీఫ్ గటెక్కింది. రబీలో మాత్రం నీటి కష్టాలు తప్పేలా లేవని రైతులు అనుకుంటున్న తరుణంలో కర్ణాటక ప్రాజెక్టుల నుంచి దిగువకు నీటి విడుదలతో ప్రవాహం పెరిగి ఆశలు చిగురిస్తున్నాయి. ఆయకట్టులోని రైతులకు ఇది ఊరటనిచ్చే అంశం. జూరాల ప్రాజెక్టు కింద ఖరీఫ్‌లో లక్ష ఎకరాల వరకు పంటలు సాగు చేశారు. రబీకి వచ్చే సరికి ఏటా అందులో సగం కూడా సాగయ్యే పరిస్థితి లేకుండా పోతోంది. ఈ క్రమంలో ఈ సారి పైనుంచి పూర్తిగా ప్రవాహం లేని కారణంగా రబీ పంటకు క్రాప్‌హాలిడే ప్రకటిస్తారా అన్న ఆందోళన రైతుల్లో ఉండేది. ప్రస్తుతం వస్తున్న ప్రవాహం కారణంగా జూరాల జలాశయంలోకి రోజుకు అర టీఎంసీ చొప్పున నీరు చేరుతోంది. గరిష్ఠ స్థాయికి నిల్వ చేరితే రబీలో సాగుకు కొంత వరకు ఢోకా ఉండదని రైతులంటున్నారు.

రోజుకు 6,500 క్యూసెక్కులు: కర్ణాటకలోని ఆలమట్టి జలాశయంలోకి



11,500 క్యూసెక్కుల ప్రవాహం చేరుతోంది. దిగువకు 15,500 క్యూసెక్కులు వదులుతున్నారు. దిగువన ఉన్న నారాయణ్‌పూర్ జలాశయంలోకి ఆలమట్టి నుంచి విడుదలైన ప్రవాహం వచ్చి చేరుతుండటంతో దిగువకు 11,500 క్యూసెక్కులు వదులుతున్నారు. ఈక్రమంలో రెండు రోజులుగా జూరాల ప్రాజెక్టుకు రోజుకు 6,500 క్యూసెక్కుల ప్రవాహం చేరుతోంది. జూరాలకు అనుసంధానంగా ఉన్న ఎత్తిపోతల పథకాల కింద వరి పంట చివరి దశకు చేరటంతో నీటి తోడిపోతను పూర్తిగా నిలిపేశారు. దీంతో జలాశయంలో నీటినిల్వ క్రమంగా పెరుగుతోంది. ప్రవాహం పెరిగిన కారణంగా జూరాల జలాశయంలో నీటినిల్వ నాటికి 7 టీఎంసీలకు చేరువైంది. మరో 2.5 టీఎంసీల నీరు వస్తే జలాశయం గరిష్ఠ స్థాయికి చేరుతుంది. గరిష్ఠ స్థాయిలో నీటినిల్వ ఉంటే రబీ పంటకు వచ్చే జనవరి మొదటి వారం నుంచి మార్చి వరకు నీటి విడుదలకు అవకాశం ఉంటుందని జూరాల అధికారులంటున్నారు.

# పత్తికి దక్కని మద్దతు

ఆదిలాబాద్ : పత్తి ధర రోజురోజుకూ తగ్గుతోంది. క్రయవిక్రయాలు ప్రారంభిం చిన రోజున క్వింటాలు పత్తి ధర రూ.7,100 ఉండగా.. క్రమంగా తగ్గుతూ వస్తోంది. పత్తి పంట ఇప్పుడిప్పుడే చేతికి వస్తుండటం, మరో వైపు ధర తగ్గుతుండటం రైతుల్లో ఆందోళన కలిగిస్తోంది. ప్రారంభంలో ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర క్వింటాలు రూ.7,020 కంటే ఎక్కువే ఉంది. రెండు రోజుల్లోనే ఆ ధర తగ్గుతూ వస్తోంది. 8 నుంచి 12 శాతం లోపు తేమ ఉన్న పత్తిని మాత్రమే సీసీఐ కొనుగోలు చేస్తోంది. చలికాలం కావడంతో తేమ ఎక్కువగా ఉండటం, పైగా సీసీఐ నిబంధనలు ఎక్కువ పెడుతుండటంతో రైతులు తక్కువ ధరతో వ్యాపారులకే విక్రయించాల్సిన పరిస్థితి నెలకొంది. పూత, కాయ దశల్లో వర్షాలు లేకపోవడం, పంట చేతికొచ్చే సమయానికి వర్షం ప్రభావం చూపడంతో దిగుబడి సగానికి తగ్గిపోయిందని కర్షకులు వాపోతున్నారు.

తగ్గుతున్న ధర..తేమ ఎక్కువగా ఉండటంతో మార్కెట్లో నిర్ణయించిన ధర రైతన్నలకు రావడం లేదు. 8 శాతం కంటే ఎక్కువ ఉన్న తేమకు ఒక్కో శాతం చొప్పున ధరలో కోత పెడుతున్నారు. మార్కెట్ ప్రారంభం నుంచే పత్తి విక్రయాలు నత్తనడకన సాగుతున్నాయి. పత్తి మార్కెట్లకు రాకపోవడంతో వ్యాపారులు పూర్తిగా కొనుగోళ్లు చేయడం లేదని, కొన్ని జిన్నింగ్‌లు ఇంకా ప్రారంభించక పోవడంతో ధర తక్కువగా ఉందని అంటున్నారు. రైతులు ఎక్కువ సంఖ్యలో పత్తిని తీసుకొస్తే ధర పెరిగే అవకాశం ఉందని మార్కెట్ వర్గాలు భావిస్తున్నాయి. పత్తి విక్రయాలతో మార్కెట్లు సందడిగా ఉండాల్సింది, అధిక వర్షాలతో పంట దెబ్బతిని దిగుబడి తగ్గిపోగా, వచ్చిన అరకొర దిగుబడిని ధర పెరుగుతుందనే ఆశతో కొంత మంది రైతులు పత్తిని ఇళ్లల్లోనే నిల్వ చేసుకుంటున్నారు. కొంత మంది రైతులకు ఇంకా పంట చేతికి రాలేదు. జిల్లా మొత్తంలో 30,674 క్వింటాళ్ల పత్తి విక్రయాలు జరగ్గా, సీసీఐ కేవలం 51 మంది రైతుల నుంచి 1,013 క్వింటాళ్ల పత్తిని మాత్రమే కొనుగోలు చేసింది.

# ఈఎస్ఐ సేవలు అందనంత దూరం!

కాగజ్‌నగర్ :ఈఎస్ఐ కార్పొరేషన్(ఢిల్లీ) బృందం జె.శ్రీధర్ (డిప్యూటీ డైరెక్టర్), రవి కుమార్(ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్), కె.సాయి (అసిస్టెంట్ మెడికల్ ఆఫీసర్), రాష్ట్ర ప్రతినిధులు డా.కల్యాణ్, బాలాజీ రావు, హరీశ్‌రావు, శ్రీనివాసులు బృందం సభ్యులు కాగజ్‌నగర్ ఈఎస్ఐ ఆసుపత్రిని సందర్శించారు. ముందుగా ఈఎస్ఐ సూపరింటెండెంట్ డా.రవికిరణ్ చైతన్య, ఆసుపత్రి వైద్యులు, సిబ్బందితో ఆసుపత్రి భవనం, క్వార్టర్ల పరిస్థితులపై చర్చించారు. ఆసుపత్రి భవనం, క్వార్టర్లు నిర్వహణ లేక శిథిలమైనట్లు బృందం సభ్యులకు వివరించారు. శిథిలమైన ఆసుపత్రిలోని గదులు, క్వార్టర్లను పరిశీలించారు. ఆ భవనాలు ఏమాత్రం అనుకూలంగా లేవని, సత్వరమే ఖాళీ చేసి ఆసుపత్రిలోని సేవలకు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. స్థానికంగా అద్దె భవనాలు లభించని పక్షంలో రామగుండంలోని 100 పడకల ఈఎస్ఐ ఆసుపత్రిలోకి మార్పు చేయనున్నట్లు నిర్ణయం తీసుకున్నారు. ఈ నివేదికను దిల్లీ, రాష్ట్ర కార్పొరేషన్ ప్రతినిధులకు సమర్పిస్తామన్నారు.ఎస్పీఎంపైనే ఆశలు..స్థానిక ఆసుపత్రి ప్రతినిధులు నేడో, రేపో ఎస్పీఎంను సందర్శించి, ప్రస్తుతం మిల్లు పరిధిలో ఖాళీగా ఉన్న క్వార్టర్లు, ఇతర భవనాలను ఈఎస్ఐ ఆసుపత్రి నిర్వహణకు అనుమతి కల్పించాల్సిందిగా కోరనున్నారు. యాజమాన్యం అనుకూలిస్తే కార్మికులకు కూడా మెరుగైన వైద్య సేవలందించే అవకాశం ఉంది. ఒకవేళ యాజమాన్యం సహకరించకుంటే ఆసుపత్రి రామగుండానికి తరలిపోనుంది.ఏడాదిలోపు నిర్మాణంవెంటనే ఖాళీ చేస్తే కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఏడాదిలోపు నూతన భవనం, క్వార్టర్ల నిర్మాణ పనులు పూర్తి చేసి మళ్లీ ఆసుపత్రి నిర్వహించే అవకాశం ఉందని బృందం సభ్యులు తెలిపారు.

# ఫిర్యాదా.. తర్వాత చూద్దాంలే

హైదరాబాద్: న్యాయం కోసం పోలీస్‌స్టేషన్ మెట్లెక్కుతున్న బాధితులకు కన్నీరే మిగులుతోంది. ఎన్నికల విధులు, బందోబస్తులో తలమునకలైన పోలీసులు, ఫిర్యాదుల్ని పట్టించుకోవడం లేదంటూ బాధితులు వాపోతున్నారు. ప్రశ్నిస్తే తీరికలేకుండా ఉన్నామని.. రెండ్రోజుల తర్వాత రావాలంటున్నారు. నగరంలోని అన్ని ఠాణాల్లోనూ ఇదే పరిస్థితి. తీవ్ర నేరమైతేనే సిబ్బంది అప్రమత్తమై ప్రత్యేక దృష్టి పెడుతున్నారు. సాధారణ నేరాలకు సంబంధించి ఫిర్యాదిదారులు, బాధితులు మాత్రం రోజుల తరబడి ఠాణాలకు వెళ్లాల్సి వస్తోంది.

ఠాణాల వెలవెల..!ఎన్నికల సందర్భంగా లోటుపాట్లు తలెత్తినా.. వివిధ పార్టీల నుంచి ఫిర్యాదులు అందినా ఎన్నికల సంఘం తీవ్రంగా పరిగణిస్తోంది. దీంతో పోలీసులు పూర్తిగా ఎన్నికల బందోబస్తు మీదే దృష్టి పెట్టారు. దీనికితోడు ప్రచారానికి ప్రముఖుల రాకపోకలు..



ప్రధాన పార్టీల అభ్యర్థులకు బందోబస్తు ఏర్పాట్లు పర్యవేక్షించాల్సి వస్తోంది. ఈ పరిణామాలతో ఠాణాల్లో సిబ్బంది అరకొరగా మాత్రమే కనిపిస్తున్నారు. అందుబాటులో ఉన్నవారు ఫిర్యాదులు స్వీకరించి.. ఎస్సై.. ఇన్‌స్పెక్టర్ వచ్చాక ఫోన్ చేస్తామంటూ బదులిస్తున్నారు.

పలు బాధ్యతలు..!ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన తర్వాత పరిస్థితి మారిపోయింది. ఎక్కువ మందిని తనిఖీలు, బందోబస్తు విధుల్లో ఉంటున్నారు. బాధితుల తాకిడి ఎక్కువ ఉంటుందనే ఉద్దేశంతో కొన్ని ఠాణాల్లో ఓ ఎస్సైని ఉంచుతున్నారు. వచ్చిన ఫిర్యాదులు స్వీకరించి పరిష్కరించే ప్రయత్నం చేస్తున్నారు. మిగిలినవారు బందోబస్తు విధుల్లో ఉంటున్నారు. సమయం ఉంటే, ఠాణాకొచ్చి పెండింగ్ కేసుల మీద దృష్టిసారిస్తున్నారు.

# సద్దులు.. ఛార్జీలూ.. ప్రజలవే

హైదరాబాద్: ఎన్నికల ప్రచార సరళిలో అనేక మార్పులొచ్చాయి.. రేడియోల నుంచి టీవీలు.. అటు నుంచి సామాజిక మాధ్యమాల వరకు అనేక సాంకేతిక అంశాల్లో మార్పులు కనిపిస్తున్నాయి. తొలినాళ్లలో ప్రచారం మరోలా ఉండేది. ఓటర్లే నాయకులకు డబ్బులు ఇచ్చి మరీ ఓటు వేసేవారట.. ఇబ్రహీంపట్నం నుంచి రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన కొండిగారి రాములు ఈ విషయాలను పంచుకున్నారు.

ప్రచార ఖర్చు పార్టీదే..ప్రస్తుత ప్రచారమంటే నాయకుడి జేబుకి చిల్లు పడాల్సిందే.. కానీ 1989 ఎన్నికల్లో పరిస్థితులు వేరుగా ఉండేది. పార్టీలే అభ్యర్థుల ఖర్చులను చూసుకునేవి. అప్పట్లో కార్యకర్తలకు సైకిళ్లే ప్రచార వాహనాలు. జిల్లా నాయకత్వానికి, అభ్యర్థికి రెండు జీపులను పార్టీలే సమకూర్చేవి. ప్రదర్శనలు, బహిరంగ సభలు ఏర్పాటు చేస్తే జనాలు సొంత ఛార్జీలు పెట్టుకొని హాజరయ్యేవారు. జనాలే సద్దులు (టిఫిన్ బాక్సులు) కట్టుకొని వచ్చేవారు.



ఓటుతో పాటు రూపాయి...

రాములు 1989లో ఇబ్రహీంపట్నం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఈ ఎన్నికల్లో రూ. 88 వేలు ఖర్చవగా, పార్టీయే భరించిందట. జనాలు బ్యాలెట్ బాక్సులో ఓటుతో పాటు ఒక్క రూపాయిని వేశారట. అలా రూ. 10వేలు జమకాగా, పార్టీ ఫండ్ కింద ఇచ్చారట. 1994 ఎన్నికల్లో రూ. 3 లక్షల ఖర్చునూ పార్టీయే భరించింది. ఈ ఎన్నికల్లో 29,900 మెజార్టీ లభించింది.

# చివరికి నిలిచేదెవరు?

హైదరాబాద్: రాజధానిలో నామినేషన్ల దాఖలు ప్రక్రియ ముగియగా.. పోటీకి సిద్ధమైన వారిలో ఎందరు నిలుస్తారనే చర్చ ఊపందుకుంది. మూడు జిల్లాల్లో కలిపి 1,078 అభ్యర్థులు పోటీకి దరఖాస్తు చేసుకున్నారు. ప్రధాన పార్టీల అభ్యర్థుల నుంచి స్వతంత్రుల వరకు.. చాలా మంది తనతోపాటు భార్య, కుమారుడు లేదా కుమార్తెలు, ఇతర మద్దతుదారులతోనూ నామినేషన్ వేయించారు. ఏదైనా కారణంతో వారి నామినేషన్ తిరస్కరణకు గురైతే.. తన స్థానంలో అయినవారిని పోటీలో నిలిపేందుకు అలా చేశారు. నామపత్రాల పరిశీలన ఈనెల 13న జరగనుండగా, 14, 15 తేదీల్లో ఉపసంహరణ ప్రక్రియ ఉంటుంది. 15న మధ్యాహ్నం 3గంటల తర్వాత బరిలో మిగిలిన అభ్యర్థులు లెక్క తేలనుంది. వారితో ఎన్నికల సంఘం శాసనసభ ఎన్నికను ఈ నెల 30న నిర్వహించనున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో.. ప్రజాక్షేత్రంలో పోటీపడేదెవరనే అంచనాలు నగరంలో ఊపందుకున్నాయి. హైదరాబాద్ జిల్లాలోని 15 నియోజకవర్గాలకు 438 మంది అభ్యర్థులు 650 నామినేషన్లను దాఖలు చేశారు. వీరిలో 183 మంది స్వతంత్రులు, రిజిస్టర్డ్ పార్టీల నుంచి 156, జాతీయ, గుర్తింపు పొందిన పార్టీల నుంచి 99 మంది నామినేషన్లు వేశారు. రంగారెడ్డి జిల్లాలోని 8 స్థానాలకు 330 మంది 490 నామినేషన్లు, మేడ్చల్‌లోని ఐదు స్థానాలకు 310 మంది 356 నామినేషన్లను సమర్పించిన విషయం తెలిసిందే.

# ఇదేం గోల!




కరీంనగర్ : పట్టణాలు, పల్లెల్లో ఎన్నికల ప్రచార మైకులు హోరెత్తిస్తున్నాయి.. వాటి శబ్దాలతో ప్రజలు సతమతమవుతుంటే.. మరో వైపు చరవాణుల ద్వారా వచ్చే ప్రచారాల మోత మరింత ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. రోజుకు ఏడు, ఎనిమిది సార్లు ప్రధాన పార్టీల నుంచి పోటీ చేసే అభ్యర్థుల ఓటు అభ్యర్థనలు, ఇతర ప్రచారాలతో పాటు సర్వేలు కూడా ఓటర్లను చిరాకు తెప్పిస్తున్నాయి. ప్రధాన పార్టీల నేతల తరఫున కాకుండా కొన్ని సర్వే ఏజెన్సీలు కూడా అదే పని పెట్టుకున్నాయి. ప్రచారాలు చేసే ప్రాంతాల్లో కూడా స్థానికులకు ఇలాంటి సందేశాలు వినిపిస్తున్నారు.

నామినేషన్‌కు కదిలిరండి

నేను ఫలాన పార్టీ అభ్యర్థిని, మా పార్టీ నుంచి ఈ రోజు నామినేషన్ వేస్తున్నాను.. నా మిత్రులు, ఓటర్లు, శ్రేయోభిలాషులు, పార్టీ కార్యకర్తలంతా తరలి వచ్చి ఆశీర్వదించాలని కోరుతూ ఉదయం ఆరు గంటల నుంచి పది గంటల వరకు ఫోన్ల ద్వారా వాయిస్ సమాచారం అభ్యర్థుల మాటల్లోనే వస్తోంది. ఓటు ఎవరికో ఒకరికి వేస్తాం.. గీ నామినేషన్‌కు మాకేం సంబంధం అంటూ ఆ సమాచారాన్ని అందుకుంటున్న వారు కట్ చేస్తున్నారు.

ఎవరికి ఓటు వేయాలనుకుంటున్నారు?

ఈ ఎన్నికల్లో మీ నియోజకవర్గంలో మూడు పార్టీల అభ్యర్థులు పోటీ చేస్తున్నారు అంటూ పార్టీ, అభ్యర్థి పేరు చరవాణిలో వినిపిస్తున్నారు. మీరు ఎవరికి ఓటు వేయాలంటుకున్నారో ఆ సంఖ్య నొక్కండి అంటూ సర్వేలు చేస్తున్నారు. ఓటు అనేదీ పోలింగ్ కేంద్రానికి వెళ్లి నచ్చిన వ్యక్తికి ఓటు వేస్తామని, వీరికి చెప్పాలా అంటూ కట్ చేస్తున్నారు. ప్రచారం కోసం, విజయావకాశాల కోసం ప్రధాన పార్టీల అభ్యర్థుల తరఫున అభిమానులు, అనుచరులు ఫలితాలు తెలుసుకోవడానికి చరవాణిని ఎక్కువగా వినియోగిస్తున్నారు.

నన్ను ఆశీర్వదించండి

నేను మీ ప్రాంతంలో పుట్టిన వాడిని, మీ ఆశీర్వాదంతో ఎన్నికల్లో ఫలాన పార్టీ నుంచి పోటీ చేస్తున్నానని.. మిమ్మల్ని స్వయంగా కలువలేక పోయినందుకు ఏమీ అనుకోవద్దు.. నన్ను ఆదరించి గెలిపించాలని, నవంబరు 30న పోలింగ్ రోజున నాకు ఓటు వేయండి అంటూ అభ్యర్థులు శబ్ద సమాచారాలతో వినిపిస్తున్నారు. ఓవైపు ఇంటింటి ప్రచారం చేస్తుండగా, మళ్లీ చరవాణిలో ఇదేం నస అంటూ గొణుక్కుంటున్నారు.

# అటవీశాఖ అనుమతి ఎప్పుడొచ్చేను?



కరీంనగర్ : హడావుడిగా పనులు ప్రారంభించి మధ్యలో వదిలేయడంతో గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారు. కోతకు గురైన రోడ్డుతో తిప్పలు తప్పడం లేదు. కొనుగోలు కేంద్రానికి ధాన్యం తరలించాలంటే ఆపసోపాలు పడుతున్నారు. వీర్నపల్లి మండలం బావుసింగ్‌నాయక్‌తండా పరిధిలోని బానోతుతండా నుంచి ఎల్లారెడ్డిపేట మండలం తిమ్మాపూర్ వరకు ఒక వరుస బీటీ రోడ్డు మంజూరైంది. ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజనలో భాగంగా మూడు కిలో మీటర్లకు రూ. 178.49 లక్షలు మంజూరయ్యాయి. దీంతో 2021లో పనులు ప్రారంభమయ్యాయి. పని ప్రారంభించిన 18 నెలల్లో పూర్తి చేయాల్సి ఉండగా అసంపూర్తిగా దర్శనమిస్తుంది. అటవీ ప్రాంతంలో రోడ్డు పరిస్థితి మరింత అధ్వానంగా తయారైంది. ద్విచక్రవాహన దారులు సైతం ప్రయాణించాలంటే నానా తంటాలు పడుతున్నారు.

అన్నదాతలకు ఇబ్బంది

గుత్తేదారు రహదారిని విస్తరించేందుకు గతంలో పంట పొలాలకు రైతులు వేసుకున్న కంచెను, చిన్న చిన్న వాగులపై బొంగులను తొలగించారు. ఫలితంగా వన్యప్రాణులు పంటలపై దాడి చేస్తున్నాయి. వరద కారణంగా పొలంలో ఇసుక మేటలు వేశాయి. ప్రస్తుతం కోతలు జోరుగా సాగుతున్నాయి. బానోతుతండా కొనుగోలు కేంద్రం తిమ్మాపూర్ వెళ్లే రహదారిలో ఉంది. సుమారు కిలోమీటరు పైగా రోడ్డు పూర్తిగా కోతకు గురై ట్రాక్టర్లు వెళ్లేందుకు ఇబ్బంది అవుతుంది. సేకరించిన ధాన్యం తరలించేందుకు ఇబ్బందులు ఎదురవుతాయని అన్నదాతలు చెబుతున్నారు. దీనిపై అధికారులకు విన్నవించినా స్పందించడం లేదని స్థానికులు వాపోతున్నారు.

గడువు పొడిగించారు

అటవీశాఖ అనుమతి త్వరగా వస్తుందన్న ఉద్దేశంతో గుత్తేదారు పనులు పారంభించారు. కిలోమీటర్ వరకు అటవీశాఖ అనుమతి కోసం ప్రతిపాదనలు పంపించాం. రావడంలో జాప్యం కారణంగా రహదారి నిర్మాణం నిలిచిపోయింది. అనుమతి రాగానే పనులు ప్రారంభిస్తాం. వచ్చే ఏడాది సెప్టెంబర్ వరకు గడువు పొడిగించారు. ఆ లోపు నిర్మాణం పూర్తయ్యేలా చూస్తాం.

సాయికృష్ణ, పంచాయతీరాజ్ ఇంజినీర్

వన్యప్రాణులు ధ్వంసం చేస్తున్నాయి

రెండేళ్ల క్రితం పనులు ప్రారంభించి మా పంట పొలాలకు ఉన్న కంచెలను తొలగించారు. ఫలితంగా వన్యప్రాణులు పంట పొలాలపై దాడి చేసి ధ్వంసం చేస్తున్నాయి. వానాకాలంలో కురిసిన వర్షాలకు పొలాల్లోకి వాగు వరద ప్రవహించి ఇసుక మేటలు వేశాయి. దారంతా కోతకు గురికావడంతో ధాన్యం రాశులను కొనుగోలు కేంద్రానికి తరలించాలంటే ఇబ్బంది అవుతుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డును చదును చేయించాలి. గుగులోతు అభిలాష్, గోల్యానాయక్‌తండా

# చైతన్యం వెల్లువెత్తాలి.. ఓట్లు పోటెత్తాలి

సిరిసిల్ల: జిల్లాలోని అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఓటర్లు పెరిగారు. ప్రస్తుతం జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ నియోజక వర్గాల్లో మొత్తం 4,61,143 మంది ఓటర్లు ఉన్నారు. 2023లో జిల్లా జనాభా 6,64,923 మంది కాగా ఇందులో 69 శాతం మంది ఓటర్లు ఉన్నారు. ఈ ఎన్నికల్లో వజ్రాయుధం లాంటి ఓటును సమర్థంగా వినియోగిస్తే ప్రజలకు మేలు జరుగుతుంది. కానీ అయిదేళ్లకోసారి జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో కొన్ని చోట్ల ఓటు వేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. రెండు నియోజక వర్గాల్లో 2014 ఎన్నికల్లో సగటున 73.47 శాతం, 2018లో 80.75 శాతం నమోదయ్యాయి. ఎన్నికల యంత్రాంగం ఈసారి మరింత పెంచేందుకు దృష్టిసారించింది. స్వీప్ కార్యక్రమంలో పెద్ద ఎత్తున చైతన్య కార్యక్రమాలు చేపడుతోంది. ఈ నెల 30న జరిగే పోలింగ్‌లో అందరూ బాధ్యతగా ఓటు వేయడానికి కేంద్రాల వైపు నడవాలని ప్రచారం చేస్తోంది.

అవగాహనతో అధిక శాతం..

2018 ఎన్నికల్లో అధికారులు ఓటు హక్కు వినియోగంపై గ్రామాలు, పట్టణాల్లో అవగాహన సదస్సులు నిర్వహించారు. దాంతో రెండు నియోజకవర్గాల్లోనూ 80 శాతం పైన పోలింగ్ నమోదైంది. ఈ ఎన్నికల్లోనూ అదే స్ఫూర్తిని కొనసాగించేలా అవగాహన కల్పిస్తున్నారు. వేములవాడ నియోజకవర్గం కోనరావుపేట మండలం సుద్దాల, సిరిసిల్ల నియోజకవర్గం పెద్దూరు, మద్దికుంటలో 90 శాతం పోలయ్యాయి. సిరిసిల్ల నియోజకవర్గం చింతల్‌ఠాణా ఎంపీపీఎస్ కేంద్రాల్లో అత్యల్పంగా నమోదయ్యాయి. పోలింగ్ తక్కువ నమోదవడానికి కారణాలను పరిశీలించగా ఆయా కేంద్రాల్లో మధ్యమానేరు ముంపు ప్రాంతం ఉంది. ఎన్నికలకు ముందే ప్రజలు ఆర్‌అండ్‌ఆర్ కాలనీలు, ఇతర ప్రాంతాలకు వెళ్లారు. అప్పుడు వారికి పోలింగ్ కేంద్రం అందుబాటులో లేకపోవడం, బీఎల్‌వోలు ముందస్తు సమాచారం



ఇవ్వకపోవడంతో ఓటు హక్కు వినియోగించుకోలేకపోయారు.

ఓటు ఆవశ్యకతపై సాంస్కృతిక కళాకారులు పల్లె, పట్టణాల్లో ప్రదర్శనలిస్తున్నారు. ప్రధాన కూడళ్లలో జన సంచారం ఉండే ప్రాంతాల్లో ఓటరు చైతన్య గీతాలతో ఆకర్షిస్తున్నారు. వీరి వెంటే ఈవీఎంలు, వీవీప్యాట్‌ల నమూనాలను ప్రదర్శిస్తున్నారు. వాటి వినియోగంతో అవగాహన కల్పిస్తున్నారు. ఓటర్లు ఫొటోలు దిగేందుకు పక్కనే సెల్ఫీ పాయింట్లు ఏర్పాటు చేశారు. దీంతో ఓటరు పోలింగ్ రోజు కేంద్రాలకు వెళ్తారని భావిస్తున్నారు.

యువ ఓటర్లను చైతన్యం చేసేందుకు రెండు నియోజక వర్గాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ, ఇంజినీరింగ్, నర్సింగ్, వ్యవసాయ కళాశాలల్లో అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో కళాకారులు రూపొందించిన ఓటేద్దాం రండి వీడియో పాటలను విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు.

# కార్తికమాసం.. శుభప్రద కాలం

యాదగిరిగుట్ట : పవిత్రమైన కార్తికమాసం ఆరంభానికి శుభ ఘడియలు సమీపిస్తున్నాయి. ఈ పవిత్ర పర్వాలు ఆరంభం కానున్నాయి. ఇందుకు హరిహర క్షేత్రమైన యాదాద్రి ముస్తాబవుతోంది. కార్తికమాసం వేడుకలు వచ్చే నెల 12 వరకు కొనసాగుతాయి. శ్రీసత్యనారాయణస్వామి వ్రతాల మొక్కు తీర్చుకోవడానికి మరో అన్నవరంగా ఈ క్షేత్రాన్ని ఆరాధించే భక్తులు వివిధ ప్రాంతాల నుంచి అత్యధికంగా వస్తారు. వ్రతాలతో పాటు పుణ్య స్నానాలు, దీపారాధన, శివ, కేశవుల దర్శనం చేసుకుని ఆధ్యాత్మిక ఆహ్లాదం పొందేందుకు భక్తులు ఎంతో ఆసక్తి చూపుతారు. ఈ మేరకు తగు ఏర్పాట్లు చేస్తున్నామని ఆలయ ఈవో గీత తెలిపారు. కొండకింద ఆధ్యాత్మిక వాడలోని ప్రత్యేక మండపంలో రెండు మార్లు సత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహిస్తారు. ఉదయం 6:30 గంటల నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు ప్రతి రెండు గంటలకు ఒకసారి సామూహిక వ్రతాల నిర్వహణ కొనసాగుతుంది. పుణ్యస్నానాల కోసం కొండ కిందే గల లక్ష్మీ పుష్కరిణి చెంత అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలని సివిల్ విభాగాన్ని ఈవో ఆదేశించారు. దీపారాధనకు ఆలయాల వద్ద ఏర్పాట్లు చేశారు.



పాతగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలోనూ కార్తిక మాసం వేడుకలు నిర్వహిస్తారు. సత్యనారాయణస్వామి వ్రతాలు నిత్యం ఐదు దఫాలుగా నిర్వహిస్తామని పేర్కొన్నారు.

స్వయంభువులకు ఆరాధన

యాదాద్రి పుణ్యక్షేత్రంలో స్వయంభువులైన పంచనారసింహులకు పూజారులు నిత్య ఆరాధనలు వైష్ణవ ఆచారంగా కొనసాగించారు. క్షేత్రపాలకుడైన ఆంజనేయస్వామిని కొలుస్తూ సహస్రనామార్చన జరిపారు. సింధూరంతో అలంకరించి అభిషేకం చేపట్టారు. గర్భాలయంలో మూలవరులను కొలుస్తూ పంచామృతంతో అభిషేకం నిర్వహించాక తులసీ పత్రాలతో అర్చన చేపట్టారు. శ్రీలక్ష్మీనరసింహస్వామి దర్శనమూర్తులను కొలుస్తూ సువర్ణ పుష్పాలతో అర్చన నిర్వహించారు. ఆలయ మహాముఖ మండపంలో వేద, మంత్రాలతో అష్టోత్తరం, సువర్ణ పుష్పార్చన పర్వాలు కొనసాగించారు. అష్టభుజి మండప ప్రాకారంలో శ్రీసుదర్శన నారసింహహోమం, శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాన్ని చేపట్టారు. సాయంత్రం అలంకార జోడు సేవోత్సవాలు నిర్వహించారు. దర్బారు సేవోత్సవాన్ని చేపట్టి ఆలయ నిత్యాదాయాన్ని వెల్లడించారు.

# కోడ్ నీడలో కల్యాణాలు

మధిర : మధిర పురపాలకంలోని ఉపాధ్యాయ కాలనీకి చెందిన ఓ ఇంట్లో ఈనెల వివాహం ఉంది. పెళ్లి దుస్తులు, నగలు కొనేందుకు విజయవాడకు బిక్కుబిక్కుమంటూ వెళ్లాల్సి వచ్చిందని ఆ కుటుంబీకులు వాపోయారు. పెద్దపెద్ద దుకాణాల్లో నగదునే చెల్లించాల్సి వస్తుంది. దీంతో విజయవాడలోని బంధువుల నుంచి నగదు తీసుకుని కొనుగోలు చేసినట్లు తెలిపారు.నేలకొండపల్లిలోని ఓ కుటుంబ సభ్యుడి వివాహం ఖమ్మం కల్యాణమండపంలో పది రోజుల్లో జరుగనుంది. తమ బంధువులకు బహూకరించేందుకు వంద చీరలు వరకు కొనుగోలు చేసి స్వగ్రామంలోని ఇంట్లో ఉంచారు. ఇక్కడ నుంచి ఖమ్మం కల్యాణ మండపానికి చీరలు తీసుకెళ్లడం ప్రహసనంగా మారింది. బంధుమిత్రుల ద్వారా ద్విచక్రవాహనాలపై రోజూ కొన్ని తరలిస్తున్నామని సదరు వ్యక్తి తెలిపారు.

మధిర మండలం సిరిపురం గ్రామంలో ఈనెల 20న వివాహం జరుగనుండగా ఆ ఇంటి వారు నగలు, వస్త్రాలు కొనుగోలు చేసేందుకు అవస్థలు పడ్డారు. నేరుగా నగదుతో వెళ్లే అవకాశం లేక స్నేహితుల వద్ద నుంచి క్రెడిట్, ఏటీఎం కార్డులు తీసుకుని వెళ్లామని వారు తెలిపారు. కల్యాణాల నిర్వహణకు ఎన్నికల కోడ్ ఓ పరీక్ష పెడుతోంది. కట్నకానుకాల మాట దేవుడెరుగు కనీసం పెట్టుబడి చీరలు కూడా ఒకేసారి తీసుకెళ్లడానికి జంకుతున్నారు. పెళ్లిళ్లకు నగలు, వస్త్రాలు భారీ ఎత్తున కొనుగోలు చేస్తుంటారు. ఇందుకోసం ఉమ్మడి జిల్లా వాసులు ప్రధాన పట్టణాలతోపాటు సమీపంలోని పెద్ద నగరాలకు వెళుతుంటారు. చెక్‌పోస్టుల వద్ద నిఘా పెట్టడంతో కొనుగోలు చేసిన వాటికి తగిన ఆధారాలు చూపేందుకు అవస్థలే పడాల్సి వస్తోందని ఆయా కుటుంబాలవారు వాపోతున్నారు.

నవంబరులో భారీగా వివాహాలు

ఈ నెల 16నుంచి శుభముహూర్తాలుండటంతో ఉమ్మడి జిల్లాలో వందలాది వివాహాలు జరుగనున్నాయి. పెళ్లి వేడుకలను అంగరంగ వైభవంగా జరుపుకోవడం తెలుగు సంప్రదాయం. ఇందుకోసం రూ.లక్షలకు లక్షలు ఖర్చు చేస్తుంటారు. ఒకరికంటే మరొకరు పోటీ పడుతూ హంగూఆర్భాటాలతో మూడు నుంచి ఐదు రోజుల పాటు వేడుకలను నిర్వహిస్తున్నారు. రిటర్న్ గిఫ్ట్‌ల సంస్కృతి బాగా పెరిగింది. బంధుమిత్రులు భారీగా హాజరవుతుంటారు. వీటన్నింటిపైనా జాగ్రత్తలు తీసుకోవాల్సి వస్తోంది.

నగలు, దుస్తుల రవాణాకు తిప్పలు

ప్రస్తుతం ఎన్నికల కోడ్ కారణంగా రాష్ట్ర, జిల్లా సరిహద్దుల వద్ద ప్రధాన రహదారుల్లో పోలీస్ చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి నగదు తరలింపు జరుగకుండా కట్టుదిట్టం చేస్తున్నారు. రూ. 50వేలకు మించి నగదు తీసుకెళ్లాలంటే ఇబ్బందికర పరిస్థితి నెలకొంటోంది. సాధారణంగా పెళ్లి దుస్తులు, నగలను హైదరాబాద్, విజయవాడ, ఖమ్మం, కొత్తగూడెంలలో ఎక్కువగా కొనుగోలు చేస్తుంటారు. వంటతయారు చేసేవారికి రూ. లక్ష నుంచి రూ. 2లక్షల వరకు ఇవ్వాల్సి ఉంది. వంట తయారీకి అవసరమైన సరకులు రూ. 3 లక్షల నుంచి రూ. 5లక్షల వరకు అవుతున్నాయి. కల్యాణమండపం, డెకరేషన్స్, ఈవెంట్ నిర్వాహకులకు డబ్బులు ఇచ్చేందుకు ఇబ్బందులు తప్పడం లేదు. దూరప్రాంతాలకు వెళ్లి అవసరమైన వాటిని కొనేందుకు ఇక్కట్లు పడుతున్నారు. సరైన ఆధారాలు చూపకుంటే పట్టుబడిన నగదు వెంటనే చేతికి రావడంలేదు. శుభకార్యాలు చేసుకుంటున్న వారి పరిస్థితి దయనీయంగా మారింది.ఆధారాలు చూపితే ఇబ్బందిలేదువివాహ వేడుకలకు సంబంధించి తగు ఆధారాలుంటే ఇబ్బందిలేదు. ఎక్కువ మొత్తం నగదు పట్టుబడితే వాటికి సరైన ఆధారాలు చూపి తిరిగి పొందవచ్చు. కొనుగోలు చేసిన వాటి రసీదులు చూపి, ఎందుకోసం కొన్నారనే అంశాలు వివరించాలి.వసంత్‌కుమార్, మధిర సీఐ

# దర్జాగా చెరువుల కబ్జా..!

మహబూబాబాద్ :మానుకోట పట్టణంలోని విశాలమైన చెరువుల శిఖం, ఎఫ్‌టీఎల్ భూములనే కాకుండా ప్రభుత్వ భూములు అక్రమార్కుల చేతుల్లోకి వెళ్తున్నాయి. రెవెన్యూ అధికారుల అంచనాల ప్రకారం 255, 286, 287, 551 సర్వే నంబర్లతో పాటు మరికొన్ని సర్వే నంబర్లలో వందల ఎకరాల భూమి ఉండగా, కొంతమేర స్థలంలో పేదలు గుడిసెలు వేసుకోగా, ఇటీవల ప్రభుత్వం 58, 59 జీవో ప్రకారం వారికి పట్టాలు చేసేందుకు అవకాశం కల్పించారు. గణాంకాల ప్రకారం ఉండాల్సిన భూమి క్షేత్రస్థాయిలో ఉండడం లేదు. ఏదైనా ప్రభుత్వ కార్యాలయం, విద్యాలయం, వ్యవసాయ మార్కెట్ తదితర భవనాల నిర్మాణానికి స్థలం సమస ఎదురవుతుంది. ప్రభుత్వ భూమి వద్దకు అధికారులు వెళ్లినప్పుడు కబ్జాదారుల ఆందోళనతో వెనుదిరిగి వచ్చిన సందర్భాలున్నాయి. అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తుండటంతో.. కబ్జాదారులు చెలరేగుతున్నారు. అధికారులపై విచారణ చేసి తగిన చర్యలు తీసుకోకుండా ఉన్నతాధికారులు వదిలేస్తున్నారని, కొత్తగా వచ్చినవారు కూడా అదే మార్గాన్ని అనుసరిస్తూ.. అక్రమార్కులకు అండగా నిలుస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.

ఇది మహబూబాబాద్ పట్టణంలోని బంధం చెరువు శిఖం. సుమారు 46 ఎకరాలు ఉంటుంది. జిల్లా కేంద్రం కావడం.. భూముల ధరలు అమాంతం పెరగడంతో.. చెరువు పరిధిలోని ఎఫ్‌టీఎల్, శిఖం భూములను అక్రమార్కులు దర్జాగా కబ్జా చేస్తున్నారు. సుమారు 3.15 ఎకరాల భూమి ఆక్రమణకు గురైంది. ఈ స్థలంలో భనవాలతో పాటు రేకుల ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు. స్థిరాస్తి వెంచర్లకు అడ్డాగా మారడంతో విశాలమైన చెరువు చిన్న కుంటలా మారింది. ఆక్రమణకు గురైన స్థలం విలువ సుమారు రూ.10 కోట్లు ఉంటుందని, అన్యాక్రాంతానికి అడ్డుకట్ట వేసి ఆక్రమణకు గురైన స్థలాన్ని పరిరక్షించాలంటూ పట్టణ



ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

ఈ చిత్రంలో కనిపిస్తున్నది మహబూబాబాద్ పట్టణం గుముదూర్ రెవెన్యూ శివారులోని 281 సర్వే నెంబర్‌లోని ప్రభుత్వ భూమి. ప్రభుత్వ పీజీ కళాశాల కోసం రెవెన్యూ అధికారులు ఐదెకరాలు కేటాయించి ప్రభుత్వ స్థలం బోర్డును ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఆ బోర్డును తొలగించి భూమిని ఆక్రమించారు. కబ్జాకు గురైన స్థలాన్ని కాపాడి కళాశాల నిర్మాణానికి అప్పగించాలని విద్యార్థులు కోరుతున్నారు.

**ఎఫ్‌టీఎల్‌లో కట్టడాలు**

పట్టణం మధ్యలో నిజాం చెరువు 67.29 ఎకరాల విస్తీర్ణం కలిగి ఉంది. ట్యాంక్ బండ్‌గా తీర్చిదిద్దుతున్న ఈ తటాకం పరిధిలోని శిఖం, ఎఫ్‌టీఎల్‌లో అక్రమ కట్టడాలు వెలిశాయి. 32 భవన నిర్మాణాలు జరిగినట్లు జలవనరులశాఖ ఇంజినీరింగ్ అధికారులు గుర్తించారు. సుమారు 2.20ఎకరాలు ఆక్రమణకు గురైనట్లు చెబుతున్నారు. బంధం, నిజాం చెరువు భూముల్లో చేపట్టిన నిర్మాణాలకు మున్సిపాలిటీ అధికారులు ఇంటి నంబర్లు కూడా ఇచ్చారు. అక్రమాలకు అధికారులు, పాలకులు వెనకుండి ప్రోత్సహిస్తున్నట్లు తేటతెల్లమవుతుంది. ఈ వ్యవహారంలో డబ్బులు చేతులు మారినట్లు కూడా సమాచారం.

జిల్లా కేంద్రంలోని గుముదూర్ రెవెన్యూ పరిధి జగన్నాయకుల చెరువులో 201 ఎకరాల శిఖం భూమి ఉంది. దశాబ్దకాలంగా ఇప్పటికే 30 ఎకరాలకు పైగా భూ ఆక్రమణ జరిగింది. స్థిరాస్తి వ్యాపారుల చేతిలో పడి ప్లాట్లుగా విక్రయాలు సాగుతున్నాయి.

రాభద్రు చెరువులో 46.10 ఎకరాల శిఖం భూమి ఉండగా, 20 ఎకరాలకు పైగా ఆక్రమించారు. ఈ ప్రాంతంలో పందుల పెంపకం దారులకు కేటాయించిన రెండెకరాల భూమిని సైతం అక్రమార్కులు వదిలిపెట్టలేదు.

దామెరకుంట 54 ఎకరాల విస్తీర్ణం ఉండగా, సుమారు 10 ఎకరాలకు పైగా ఆక్రమణకు గురైంది.


**నెంబర్లను తారుమారు చేసి..**

ప్రభుత్వ భూముల పక్కనే ఉన్న పట్టా భూముల సర్వే నెంబర్లు వేస్తూ.. స్థిరాస్తి వ్యాపారులు ఆ భూములు దర్జాగా కబ్జా చేస్తున్నారు. ఇందులో సర్వేయర్లు, రెవెన్యూ అధికారుల సహకారంతో పట్టా భూముల నెంబర్లతో రికార్డులు సృష్టిస్తున్నారు. దీనికోసం రెవెన్యూ అధికారులకు లక్షల రూపాయలు ముడుపులు చెల్లిస్తున్నారు. ధరణి పోర్టల్ ప్రారంభించాక ఈ అక్రమాలు మరింత పెరిగాయి.

**చెరువులను సర్వే చేయిస్తాంకొమురయ్య, ఆర్డీవో, మహబూబాబాద్**

పట్టణ పరిధిలోని చెరువులను సర్వే చేయిస్తాం. ఆక్రమణలు గుర్తించి స్వాధీనం చేసుకుంటాం. అసైన్డ్ భూముల క్రయవిక్రయాలు చేయకూడదు. ప్రభుత్వ భూములను ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకుంటాం.

# నకిలీ విత్తు.. అన్నదాతలకు విపత్తురి



ఇల్లెందు :2021లో ఇల్లెందులో నకిలీ మొక్కజొన్న విత్తనాలను అధికారులు స్వాధీనపరచుకున్నారు.

2021లో చంద్రుగొండ, జూలూరుపాడు, బూర్గంపాడు, పినపాక మండలాల్లో సుమారు ఏడు కిలోల నకిలీ మిర్చి విత్తనాలు విక్రయిస్తున్న దళారులను పట్టుకుని కేసులు నమోదు చేశారు.

2021లో ఏన్కూరు మండలంలో నిషేధిత గ్లైఫోసెట్ కలుపు మందును టాస్క్‌ఫోర్స్ బృందాలు పట్టుకున్నాయి.

2022లో పాల్వంచలో రూ.3.22 లక్షల విలువ చేసే 232.5 లీటర్ల గ్లైఫోసెట్ ద్రావకాన్ని టాస్క్‌ఫోర్స్ బృందాలు స్వాధీనపరచుకున్నాయి.

మరికొద్దిరోజుల్లో వానాకాలం వ్యవసాయ పనులు మొదలవుతాయి. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో ఈ సీజన్‌లో పత్తి, మిర్చి, మొక్కజొన్న పంటలను అధికంగా సాగు చేస్తుంటారు. ఈ ఏడాది పత్తి, మిర్చికి అధిక ధరలు పలకటంతో మరింతమంది అన్నదాతలు ఈ పంటల సాగుకు మొగ్గు చూపుతున్నారు. అధికారులు ఏటా నకిలీల బెడద కట్టడికి యత్నిస్తున్నా ఏదో ఒక మార్గంలో రైతులకు విత్తనాలు చేరుతూనే ఉన్నాయి. గతేడాది ఉభయ జిల్లాల్లో కొన్నిచోట్ల నకిలీ విత్తనాలు, నిషేధిత గ్లైఫోసెట్ కలుపుమందు నిల్వలు లభ్యమయ్యాయి.

తాజాగా రైతులు విత్తనాలు కొనుగోలు చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఇదే అదనుగా గ్రామాల్లోకి లైసెన్స్ లేని వ్యాపారులు రంగప్రవేశం చేసి నాసిరకం విత్తనాలను అంటగట్టే అవకాశాలున్నాయి.

**అధికారులు అప్రమత్తం**

నకిలీ విత్తనాల నుంచి రైతులను కాపాడేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. కలెక్టర్లు, వ్యవసాయశాఖ అధికారులను ఇప్పటికే అప్రమత్తం చేసింది. నకిలీలను అరికట్టేందుకు మండలాల వారీగా వ్యవసాయాధికారులు, జిల్లాల్లో టాస్క్‌ఫోర్స్ బృందాలు, ఇంటర్నల్ స్క్వాడ్, మూడు నాలుగు జిల్లాలను కలిపి విజిలెన్స్ బృందాలతో నిఘా వ్యవస్థలను పటిష్ఠపరచాలని యోచిస్తోంది. గ్రామాల్లో రహస్యంగా జరిగే విత్తన దందాను పసిగట్టేందుకు రైతుబంధు సమన్వయకర్తలను అప్రమత్తం చేయనుంది.

కొన్ని కొత్త కంపెనీలు.. డీలర్లకు అధిక కమీషన్ల ఆశ చూపి సొమ్ము చేసుకునేందుకు ఒప్పందాలు కుదుర్చుకుంటున్నాయి. పత్తి ఎక్కువగా సాగుచేసే మండలాల్లో ఏజెంట్ల వద్దకు నకిలీ విత్తనాలు చేరే ఆస్కారముంది.

**దళారులను నమ్మి మోసపోవద్దు**

**లాల్‌చంద్, టెక్నికల్ ఏడీఈ, భద్రాద్రి కొత్తగూడెం**

దళారుల మాటలు నమ్మి రైతులు మోసపోవద్దు. స్థానికంగా లైసెన్స్ కలిగిన డీలర్ల వద్ద విత్తనాలు కొనాలి. హెచ్‌టీ(హెర్బిసైడ్ టోలరెంట్) కాటన్ విత్తనాలు నిషేధితం. డీలర్ సంతకం, రైతు సంతకం ఉన్న రసీదును పంటకాలం పూర్తయ్యేవరకు భద్రంగా ఉంచుకోవాలి. గుంటూరు, బాపట్ల ప్రాంతాలతో పాటు ఆన్‌లైన్, బిగ్‌హట్‌లో విత్తనాలు కొన్నా రసీదులు కలిగి ఉండాలి. విత్తనాలు మొలకెత్తకపోయినా, దిగుబడులు రాకపోయినా విత్తన ఒప్పందం చట్టం ప్రకారం బాధిత రైతుకు సదరు కంపెనీ పరిహారం అందించే అవకాశముంటుంది. గ్రామాల్లో ముందస్తు బుకింగ్‌లు చేస్తున్నట్లయితే వ్యవసాయ అధికారులకు సమాచారమివ్వాలి. వివరాలు గోప్యంగా ఉంచడంతో పాటు సమాచారమిచ్చిన వారికి పారితోషికం అందజేస్తాం.

# లోతుపాతులు తెలియక ప్రాణాలోదులుతున్నారు



ఇల్లెందు : తల్లాడ మండలం కొడవటిమెట్ట(రెడ్డిగూడెం) గ్రామానికి చెందిన గాజుల తిరుపతిరావు(20) వరంగల్‌లో బీఎస్సీ (ఎంఎల్‌టీ) చదువుతున్నారు. సంక్రాంతి సెలవుల్లో ఇంటికొచ్చి స్నేహితులతో కలిసి సరదాగా గడిపేందుకు వైరా జలాశయానికి జనవరి 18న చేరుకున్నారు. ఈత రాకపోయినా మోకాళ్లలోతు వరకు వెళ్లారు. ప్రమాదవశాత్తు నీటిలో మునిగి తిరుపతిరావు మృతిచెందారు. భద్రాచలం ఏఎంసీ కాలనీకి చెందిన శివకృష్ణ-నాగలక్ష్మి దంపతుల ఏకైక కుమారుడు వాసు(16), కొత్తకాలనీకి చెందిన నజీర్-రెహానా దంపతుల పెద్దకుమారుడు అక్బర్‌పాషా(17) కూలీపనులు చేసుకుంటూ తమ కుటుంబాలకు అండగా నిలుస్తున్నారు. వీరిద్దరితో పాటు మరో నలుగురు గోదావరిలో స్నానం చేసేందుకు ఫిబ్రవరి 19న వెళ్లారు. స్నానాలు చేస్తూ వాసు, అక్బర్‌పాషా గల్లంతయ్యారు. ఘటనా స్థలం అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక పరిధిలో ఉండటంతో రెండు మృతదేహాలను తెలంగాణ, ఆంధ్ర పోలీసులు సంయుక్తంగా వెతికి గుర్తించారు.

భానుడు భగభగమంటున్నాడు.. పైగా ఈత అంటే చాలామందికి సరదా.. చెరువులు, వాగుల్లో నీటిని చూస్తే పెద్దలైనా, చిన్నారులైనా ఈత కొట్టాలనే అనుకుంటారు.. అయితే ఈ సరదా ప్రాణాల మీదకు రాకుండా చూసుకోవాలి.. ప్రధానంగా చిన్నారులు, యువకులు నీళ్లను చూసి త్వరగా ఆకర్షితులవుతారు.. ఈత రాకున్నా నీళ్లలో దిగి స్నానాలు చేస్తుంటారు.. ప్రమాదాలను పసిగట్టలేక ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు.

ఇటీవల ఈతకు వెళ్లి కొందరు మృత్యువాత పడుతున్న ఘటనలు కలవరపెడుతున్నాయి. కాల్వలు, చెరువులు, నదుల్లో సరదాగా గడిపేందుకు వెళ్లి చనిపోతున్నారు. వేసవి నేపథ్యంలో తమ పిల్లలు ఎటు వెళ్తున్నారో తల్లిదండ్రులు గమనిస్తుండాలి. నిపుణుల సమక్షంలో ఈత నేర్చుకోవాలి. ఈతకు వెళ్తున్నామని పిల్లలు చెప్పినప్పుడు తల్లిదండ్రులు వారి వెంట ఉండటం శ్రేయస్కరం.

**ఎన్.వెంకటేశ్, డీఎస్పీ, పాల్వంచ**

తీసుకోవాల్సిన జాగ్రత్తలు.. చెరువులకు మరమ్మతులు చేసే సందర్భాల్లో హెచ్చరిక బోర్డులను అధికారులు ఏర్పాటు చేయించాలి.

చెరువులు, వాగుల్లో పూడిక తీసే సందర్భంలో గుంతల్లో నీరు నిలవకుండా చూడాలి. చెరువులు, వాగుల్లో భూమికి సమాంతరంగా పనులు చేపట్టాలి.

గ్రామీణ ప్రాంతాల్లోని వ్యవసాయ బావుల వద్ద సంబంధిత యజమానులు కంచె ఏర్పాటు చేయాలి.

చెరువులు, వాగులు, నదులు, కాల్వల వద్ద పొంచి ఉన్న ప్రమాదాలపై తల్లిదండ్రులు అవగాహన కల్పించాలి.

పాఠశాల స్థాయిలో సైతం ఉపాధ్యాయులు ఈ విషయంలో విద్యార్థులను చైతన్యపర్చాలి.

నిపుణుల సమక్షంలో పిల్లలకు ఈత నేర్పాలి.

చెరువులు, కుంటలు, బావుల్లో అడుగున బురద పేరుకుపోయి ఉంటుంది. అక్కడి పరిస్థితి తెలుసుకోకుండా ఈత వచ్చినా దూకితే ప్రమాదాల బారిన పడొచ్చు.

# అర్బన్ అటవీ పార్కుపై నిర్లక్ష్యం



జగిత్యాల : ఒత్తిడి, ఆందోళన తగ్గించుకొని మానసిక ప్రశాంతతతో ప్రకృతి ఒడిలో గడిపేందుకు అటవీ ప్రదేశాల్లో పచ్చని చెట్ల నడుమ 'అర్బన్ అటవీ పార్కులను' ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఉరుకుల పరుగులతో జీవితాలను గడిపే వారికి ఉపశమనంగా కుటుంబంతో కలిసి కాసేపు ఆరుబయట సేదతీరేందుకు పట్టణ వాసులకి ఆహ్లాదాన్ని పంచేవిధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. జగిత్యాలకు రూ.కోటి మంజూరు కాగా జగిత్యాల అర్బన్ మండలం అంబారిపేట అటవీ ప్రాంతంలో ఏర్పాటుకు పనులు ప్రారంభించారు. ఈ ప్రాంతంలో చుట్టు పక్కల అటవీ ప్రాంతాన్ని చూసేందుకు ఎత్తైన వాచ్ టవర్, పిల్లలు ఆడుకోవడానికి ప్లే గ్రౌండ్, పాదచారులకి వాకింగ్‌ట్రాక్, ఆహ్లాదకరమైన పూల మొక్కలను, ఆకట్టుకునే విద్యుత్తు దీపాలు, కూర్చోవడానికి బెంచీలు, తాగునీటి సౌకర్యాలు కల్పించనున్నారు. ఇప్పటి వరకు నిర్ణయించిన ప్రదేశంలో ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టలేదు. కేవలం చెక్‌డ్యాం పనులు మాత్రమే నిర్మించి వదిలేశారు.

**ఆలయ సమీపంలో ఏర్పాటుచేస్తే మేలు..**

పార్కు ప్రదేశానికి వెళ్లాలంటే ఎస్సారెస్పీ కాలువ నుంచి రెండు కిలోమీటర్ల దూరం వెళ్లాలి. రహదారి సౌకర్యం లేదు, చుట్టూ ముళ్ల కంపలు, నడవలేని పరిస్థితి ఉంది. ఇక ద్విచక్రవాహనంపై అతి కష్టంగా వెళ్లాలి. కేటాయించిన రూ.కోటి నిధులు రోడ్డు వేయడానికే సరిపోవు. చిన్న పిల్లలు, వృద్ధులు, ఒంటరిగా వెళ్లేవారికి ఈ మార్గం భయాందోళనగా ఉంటుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయితే అటవీ ప్రాంతంలో అంతలోపలికి కాకుండా సమీపంలోనే శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ సమీపంలో అర్బన్ అటవీ పార్కుగా తీర్చిదిద్దితే ఆలయానికి భక్తులరాకతో పాటు ఆధ్యాత్మికంగా అభివృద్ధి చెందుతుందని గ్రామస్థులు కోరుకుంటున్నారు. పట్టణం నుంచి వచ్చే వారికి అనువుగా ఉండటమే కాకుండా పక్కనే బైపాస్ రహదారి అందుబాటులో ఉండటంతో దూర ప్రాంత వాసులకు కాలక్షేపంగా ఉంటుందని అంబారిపేట గ్రామస్థులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పుడు కేటాయించిన స్థలంలో కాకుండా ఆలయ సమీపంలో పార్కును ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

# మణుగూరు, ఇల్లెందు ఆసుపత్రుల్లో.. డయాలసిస్ కేంద్రాలు సిద్ధం

కొత్తగూడెం : మణుగూరు, ఇల్లెందులోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో కొత్తగా ఏర్పాటు చేసిన డయాలసిస్ కేంద్రాలు సేవలు అందించేందుకు సిద్ధమైనట్లు కలెక్టర్ అనుదీప్ తెలిపారు. ప్రస్తుతం కొత్తగూ డెం సర్వజన ఆసుపత్రిలో ఐదు, భద్రాచలం ఏరియా దవాఖానాలో పది యంత్రాలతో డయాలసిస్ సేవలు అందిస్తున్నట్లు ఆయన చెప్పారు. రోగులకు నిరీక్షణ లేకుండా చేసేందుకు జిల్లాకు మరో మూడు డయాలసిస్ కేంద్రాలు అవసరమని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామన్నారు. మణుగూరు, ఇల్లెందు, అశ్వారావుపేటలో ఈ కేంద్రాలను నెలకొల్పాల ని కోరినట్లు చెప్పారు. దీంతో ప్రభుత్వం స్పందించి ఒక్కో కేంద్రానికి రూ.50 లక్షల చొప్పున నిధులు కేటాయించిందన్నారు. ప్రతి కేంద్రంలో ఐదు రక్తశుద్ధి యంత్రాలను అందుబాటులోకి తెచ్చినట్లు వివరించారు. త్వరలో అశ్వారావుపేటలోనూ ప్రత్యేక సేవలు అందుబాటులోకి రానున్నట్లు తెలిపారు. రోగులు వ్యయ ప్రయాసలతో దూరప్రాంతాలకు వెళ్లకుండా పూర్తిస్థాయిలో జిల్లాలోని ఆసుపత్రుల్లో డయాలసిస్ సేవలు అందుబాటులోకి వస్తున్నట్లు చెప్పారు.

# అభివృద్ధికి నోచని బయ్యన్న జలాశయం

కొడకండ్ల : కొడకండ్లలోని బయ్యన్న జలాశయం అభివృద్ధికి నోచుకోవడం లేదు. దీన్ని మినీట్యాంక్‌బండ్‌గా మార్చి పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దే పనులు ప్రతిపాదన దశలోనే ఉన్నాయి. నల్గొండ జిల్లాకు నీరందించే ఈ చెరువు స్థానికులకు ఉపయోగపడడం లేదని మండల ప్రజలు వాపోతున్నారు. 2006లో ఈ జలాశయాన్ని అప్పటి భారీ నీటిపారుదల శాఖ మంత్రి పొన్నాల లక్ష్మయ్య ప్రారంభించారు. దీన్ని పర్యాటక ప్రదేశంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానన్నారు. రెండు కి.మి. పొడవైన కట్ట, చుట్టూ పచ్చని పొలాలు కలిగిన ఈ జలాశయాన్ని మినీ ట్యాంక్‌బండ్‌గా అభివృద్ధి చేయాలని కొడకండ్ల, నర్సింగాపురం, ఏడునూతుల గ్రామాల ప్రజలు ప్రజాప్రతినిధులకు, ఎస్సారెస్పీ ఉన్నతాధికారులకు విన్నవించారు. ఈ రిజర్వాయర్ ఆధారంగా పదేళ్ల క్రితం రూ.10 కోట్లతో సమీపంలోని ఏడునూతులలో చేపట్టిన డీఫ్లోరైడ్ ప్రాజెక్ట్ నిర్మాణం పూర్తయినప్పటికీ నేటికీ ప్రారంభించకపోవడంతో నిరుపయోగంగా ఉంది. ఈ ప్రాజెక్టుకు నీరందించేందుకు జలాశయంలోనే ప్రత్యేక బావిని నిర్మించారు. రిజర్వాయర్ కట్టపై ఉన్న విద్యుత్తు సామగ్రి చోరీకి గురవుతోంది. జలాశయం కట్టపై సీసీ రోడ్డు నిర్మించి, విద్యుత్తు దీపాలు ఏర్పాటు చేసి, పూల చెట్లు, బెంచీలు ఏర్పాటు చేసి ఆహ్లాదకరంగా తీర్చిదిద్దాలని ప్రజలు అప్పటి ఎంపీ సిరిసిల్ల రాజయ్యను కోరారు. మినీట్యాంక్ బండ్ నిర్మాణానికి ఆయన అధికారులతో ప్రతిపాదనలు సిద్ధం చేయించారు. ప్రారంభంలో రిజర్వాయర్‌లో చేపల పెంపకం విషయంలో వివాదం నెలకొనడంతో ఐదేళ్ల పాటు చేపలను పెంచలేదు. అనంతరం మూడు గ్రామాల మత్స్య సహకార సంఘాల అంగీకారంతో చేపల పెంపకం చేపట్టారు.

జలాశయంలో బోటింగ్ సౌకర్యం కల్పించాలని కొడకండ్లకు చెందిన పలు మత్స్యకార కుటుంబాలు కోరాయి. మినీట్యాంక్ బండ్ నిర్మాణంతో పర్యాటక ప్రాంతంగా మారడమే కాకుండా, కొడకండ్ల, ఏడునూతుల, నర్సింగాపురం గ్రామాల ప్రజలకు వారధిగా ఉంటుంది. శ్రీరాంసాగర్ రెండో దశలో నిర్మించిన బయ్యన్న రిజర్వాయర్‌కు శ్రీరాంసాగర్ జలాశయం నుంచి నిరంతరాయంగా నీటి సరఫరా జరుగుతుండటంతో జలకళతో కనువిందు చేస్తోంది. మినీట్యాంక్ బండ్‌కు కావాల్సిన అన్ని వసతులు ఉన్నందున ప్రభుత్వం ప్రత్యేక నిధులందించి నిర్మాణం చేపట్టాలని జలాశయం పరిసర గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

**ప్రభుత్వానికి ప్రతిపాదన పంపించాం**

**సారంగపాణి, డీఈ, ఎస్సారెస్పీ**

మిషన్ కాకతీయ పథకం ప్రారంభంలోనే బయ్యన్న రిజర్వాయర్‌ను మినీట్యాంక్ బండ్‌గా మార్చాలని ప్రతిపాదనలు పంపించాం. నాటి అంచనాల ప్రకారం సుమారు రూ.60 కోట్లతో కట్టపై సీసీ నిర్మాణాలు, వసతి, విద్యుత్తు తదితర సౌకర్యాలు ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలను రూపొందించాం. ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తే ఏడాదిలోగా మినీట్యాంక్ బండ్‌ను నిర్మించొచ్చు.

**పర్యాటక ప్రదేశంగా తీర్చి దిద్దుతాం**

**మధుసూదన్, సర్పంచి, కొడకండ్ల**

బయ్యన్న రిజర్వాయర్‌ను మినీట్యాంక్ బండ్‌గా తీర్చిదిద్దే విషయాన్ని మంత్రి దయాకర్‌రావు దృష్టికి తీసుకెళ్తాం. జలాశయాన్ని పర్యాటక ప్రదేశంగా తీర్చిదిద్దుతాం. రిజర్వాయర్ నుంచే కొడకండ్లకు తాగునీరు, చెరువులు, కుంటలను నింపేలా ప్రణాళికలను సిద్ధం చేశాం.

**మత్స్యకారులకు ఉపాధిశింగరం చంద్రయ్య, అధ్యక్షుడు, మత్స్య సహకార సంఘం**

ఈ జలాశయం స్థానిక వత్స్యకారుల కుటుంబాలకు ఉపాధినిస్తోంది. దీన్ని మినీట్యాంక్ బండ్‌గా మారిస్తే పడవలు, మరబోట్లు నడిపే యువకులకు ఉపాధి లభిస్తుంది. పర్యాటక ప్రాంతంగా మారితే పరిసర గ్రామాల్లోని నిరుద్యోగులు, నిరుపేదలకు చిరు వ్యాపారాలతో ఉపాధి పొందుతారు.

# సమీకృత మార్కెట్ భవన నిర్మాణం పూర్తయ్యేనా?

జనగామ : పురపాలికల పరిధిలో సమీకృత మార్కెట్ల నిర్మాణానికి ప్రభుత్వం ప్రత్యేక నిధులు మంజూరు చేసింది. జనగామలోని రెండెకరాల స్థలంలో మార్కెట్ భవన నిర్మాణానికి రూ.4.50 కోట్లు అందించింది. ఈ పథకాన్ని ప్రకటించకముందే సంజయ్‌నగర్ పోలీస్ క్వార్టర్స్ సమీపంలో ఎకరంన్నర స్థలంలో ఆదర్శ మార్కెట్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. రూ.30 కోట్ల పథకం నిధుల నుంచి రూ.2 కోట్లను కేటాయించారు. ఆ తర్వాత ప్రభుత్వం ప్రకటించిన సమీకృత మార్కెట్ నిధులను వీటికి జోడించారు. దీంతో ఆదర్శమార్కెట్ పనులు సమీకృత మార్కెట్ పనులుగా మారాయి.

**నాలుగేళ్ల నుంచి..**

2018 ఎన్నికల ముందు రూ.30 కోట్ల పథకం మంజూరైంది. పనులకు శంకుస్థాపన చేశారు. అప్పటి ఆపద్ధర్మ ఛైర్మన్ నాగారపు వెంకట్ ఆధ్వర్యంలో మార్కెట్ నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. 2020లో కొత్త కౌన్సిల్ ఏర్పడిన తర్వాత మరోసారి శంకుస్థాపన చేసి పనులకు శ్రీకారం చుట్టారు. కూరగాయల మార్కెట్ భవనం పనులు దాదాపు పూర్తి కావచ్చాయి. ఇంకా మౌలిక సౌకర్యాల పనులు చేపట్టాల్సి ఉంది. రూ.6.50 కోట్ల అంచనా వ్యయంలో ఇప్పటి వరకు గుత్తేదారుకు సుమారు రూ.కోటి బిల్లు మంజూరైంది. మరో రూ.1.25 కోట్ల పనులకు సంబంధించిన బిల్లు ఇవ్వాల్సి ఉందని సమాచారం. ఇప్పటి వరకు 50 శాతం నిధులు కూడా ఖర్చు కానందున, పనులు కూడా ఆ స్థాయిలోనే జరిగినట్లు స్పష్టమవుతోంది.

**పునాది దశలోనే పనులు**

ఎకరంన్నర స్థలం ముందు భాగంలో, తూర్పువైపున పూలు, పండ్ల మార్కెట్ నిర్మాణానికి పునాదులు తీసి పిల్లర్లు వేసి పనులను నిలిపివేశారు. సుమారు రెండేళ్ల నుంచి పునాది దశ దాటలేదు. కూరగాయలు, మటన్, చికెన్, చేపల అమ్మకాలకు భవనాన్ని సిద్ధం చేసి, ఆపైన పూలు, పండ్ల మార్కెట్‌పై దృష్టి సారించాలన్నది గుత్తేదారు, అధికారుల యోచన.

**సంస్థ తీరుపై విమర్శలు ..**

రూ.6.50 కోట్లతో సమీకృత మార్కెట్ నిర్మాణం విషయంలో పథక రచన చేసిన సంస్థ తీరుపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సుమారు రూ.4 కోట్లతో నిర్మిస్తున్న కూరగాయలు, మాంస మార్కెట్ భవనం లోపల ఎత్తు 10 అడుగులే. ఫ్లోరింగ్ వేయడంతో మరో అడుగు తగ్గింది. దీంతో అవసరమైనంత గాలి, వెలుతురు లేదంటున్నారు. కనీసం పూలు, పండ్ల మార్కెట్ నిర్మాణంలో ఇతర మార్కెట్ల ప్రణాళికలను పరిశీలించి పనులు పూర్తి చేయాలని నిపుణులు సూచిస్తున్నారు. ఖమ్మం, నల్గొండ, హైదరాబాద్ తదితర జిల్లా కేంద్రాల్లో వ్యవసాయ మార్కెట్ల తరహాలో కప్పు వేస్తే గాలి, వెలుతురు ధారాళంగా వస్తాయంటున్నారు. మంత్రి కేటీఆర్ సైతం సామాజిక మాధ్యమంలో ఇలాంటి మార్కెట్ల చిత్రాలను పోస్టు చేసి ప్రశంసించిన సంగతిని గుర్తు చేస్తున్నారు. పూలు, పండ్ల మార్కెట్ పనుల్లో లోపాలు లేకుండా ముందస్తు కసరత్తు చేయాలని నిపుణులు సూచిస్తున్నారు.

బహుళ ప్రయోజనాల కోసంజనగామ పట్టణంలో రైల్వేస్టేషన్ నుంచి బస్టాండు వరకు, గజానికో కూరగాయలు, పండ్ల దుకాణాలున్నాయి. రద్దీ నివారణకు బస్టాండు నుంచి నెహ్రూపార్కు వరకు 100 అడుగులు, అక్కడి నుంచి రైల్వేస్టేషన్ వరకు 60 అడుగుల మేర అభివృద్ధి చేశారు. ఇంత చేసినా ఈ దారుల్లో కాలిబాటలు లేవు.

# పీఎం కిసాన్ విడుదల...

## ఆదివాసీల సంక్షేమం కోసం పీవీటీజీని ప్రారంభించిన ప్రధాని



రాంచీ: రైతులకు పెట్టుబడి సాయం కోసం కేంద్రం అందిస్తున్న ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి 15వ విడత నిధులను ప్రధాని మోదీ బుధవారం ఝార్ఖండ్‌లోని కుంతీలో విడుదల చేశారు. ఈ పథకం ద్వారా సుమారు 8 కోట్ల మందికి పైగా రైతుల ఖాతాల్లో ఒక్కొక్కరికి రూ.2 వేలు నగదు జమ అవుతుంది.

అయితే, ఈ నిధుల విడుదలపై కాంగ్రెస్ అభ్యంతరం వ్యక్తం చేసింది. మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్ (రెండో విడత), తెలంగాణ రాష్ట్రాల్లో శాసనసభ ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో పీఎం కిసాన్ నిధుల విడుదల ఆలస్యం కావడంపై కాంగ్రెస్ నేత జైరాం రమేశ్ అనుమానాలు వ్యక్తం చేశారు. కేంద్రం ఉద్దేశపూర్వంగానే నిధుల విడుదలలో జాప్యం చేసిందని ఆరోపించారు.

**ఆదివాసీల కోసం పీవీటీజీ :** రెండు రోజుల పర్యటన నిమిత్తం ఝార?ండ్‌లో పర్యటిస్తున్న ప్రధాని మోదీ రూ. 24 వేల కోట్లతో ఆదివాసీల సంక్షేమం కోసం ప్రధాన మంత్రి అత్యంత వెనుకబడిన ఆదివాసీ బృందాలకు చేయూత పథకాన్ని ప్రారంభించారు. దీని ద్వారా దేశంలోని 18 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని అడవులు, పర్వతాల్లోని మారుమూల గ్రామాల్లో నివసిస్తున్న 28 లక్షల మంది ఆదివాసీల కోసం పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టనున్నారు. ఇందులో భాగంగా రోడ్డు, ఫోన్ కనెక్టివిటీ, పరిశుభ్రమైన తాగు నీరు, ఇళ్ల నిర్మాణం, పారిశుద్ధ్యం, విద్య, వైద్యం, పౌష్టికాహారం, స్థిరమైన జీవనోపాధిని వారికి కల్పించనున్నట్లు కేంద్ర ప్రభుత్వం తెలిపింది. మరోవైపు ఖనిజ వనరులను వెలికితీసే క్రమంలో నిర్వాసితులైన ఆదివాసీల కోసం ప్రత్యేక పథకాలు తీసుకురావాలని ప్రధాని మోదీని ఝార?ండ్ సీఎం హేమంత్ సోరేన్ కోరారు. అంతకుముందు ఆదివాసీ నాయకుడు బిర్సా ముండా జయంతి సందర్భంగా ఝార?ండ్‌లో ఆయన జన్మస్థలమైన ఉలిహాటుకులో ప్రధాని మోదీ నివాళులు అర్పించారు. ఉలిహాటుకును సందర్శించిన తొలి ప్రధాని మోదీనే కావడం విశేషం. ఈ సందర్భంగా అక్కడి ప్రజలు ప్రధానికి సంప్రదాయ నృత్యాలతో స్వాగతం పలికారు.

## జగన్‌లో ఓటమి అసహనం మొదలైంది.. అందుకే ఈ అక్రమ అరెస్టులు: లోకేశ్



అమరావతి: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డికి తన కళ్ల ముందు దారుణ ఓటమి కనిపిస్తోందని తెదేపా జాతీయ ప్రధాన కార్యాదర్శి నారా లోకేశ్ అన్నారు.

చివరికి సీఎం సొంత నియోజకవర్గం పులివెందులలో కూడా ప్రజలు అసంతృప్తితో ఉన్నారని తెలిపారు. పులివెందులలో జగన్ పునాదులు కదులుతున్నాయి.. ఆ అసహనం వల్లే అక్రమ కేసులు పెట్టి తెదేపా నేతలను అరెస్టు చేయిస్తున్నారని మండిపడ్డారు. కడప జిల్లాలో ప్రొద్దుటూరు ఇంఛార్జి ప్రవీణ్ కుమార్ రెడ్డి, పులివెందుల ఇంఛార్జి బీటెక్ రవిల అరెస్టుతోనే ప్రతిపక్షం అంటే జగన్ ఎంతగా భయపడుతున్నారో అర్థం అవుతోందని లోకేష్ విమర్శించారు. పులివెందులలో తెదేపా స్పీడు పెరగడంతో తన మార్కు అక్రమ కేసులతో భయపెట్టే చర్యలకు జగన్ దిగారని దుయ్యబట్టారు. ఏ సీఎం అయినా, వారి సొంత జిల్లాలో చేసిన అభివృద్ధి పనుల గురించో.. కట్టిన ప్రాజెక్టుల గురించో.. తెచ్చిన కంపెనీల గురించో చెబుతారు.. కానీ జగన్ మాత్రం ఏ నియోజకవర్గంలో ఎన్ని అక్రమ కేసులు పెట్టారో మాత్రమే చెప్పగలరని ఎద్దేవా చేశారు. సైకో చర్యలతో జగన్ తన సొంత పార్టీకే రాజకీయ సమాధి కట్టుకున్నారన్నారు. ఈ అక్రమ కేసులు, బెదిరింపు రాజకీయాలు వైకాపాని బతికించలేవని చెప్పారు. అక్రమ పద్ధతుల్లో సహకరిస్తున్న పోలీసులు లేకపోతే రాష్ట్రంలో వైకాపా అనే పార్టీయే లేదని ధ్వజమెత్తారు. జగన్ పెట్టే ప్రతి కేసు ప్రజల్లో ప్రభుత్వంపై వ్యతిరేకతను పెంచుతుంది తప్ప ప్రజల పక్షాన తమ పోరాటాన్ని ఆపదని నారా లోకేష్ స్పష్టం చేశారు.

## అల్ షిఫాలోకి ఇజ్రాయెల్ బలగాలు..!



గాజాలోని అతిపెద్ద ఆస్పత్రి అయిన అల్-షిఫాపై అమెరికా తొలిసారి సంచలన ప్రకటన చేసింది. ఆ ఆస్పత్రి కింద హమాస్ కమాండ్ సెంటర్ ఉందని తమకు ఇంటెలిజెన్స్ సమాచారం లభించిందని పేర్కొంది. ఈ మేరకు అమెరికా నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ కోఆర్డినేటర్ జాన్ కిర్బీ ప్రకటించారు. ఆయన మాట్లాడుతూ అల్-షిఫా ఆస్పత్రి కింద హమాస్ భారీగా ఆయుధాలను భద్రపర్చిందని వివరించారు. ఆ ఆస్పత్రిని చుట్టుముట్టిన తర్వాత తొలిసారి అమెరికా నుంచి ఇజ్రాయెల్ దళాలకు మద్దతు లభించింది. ఓ పక్క పౌర ఆస్పత్రులను రక్షించాలని ఇజ్రాయెల్‌పై అంతర్జాతీయ ఒత్తిడి పెరుగుతున్న సమయంలో ఈ ప్రకటన వెలువడటం గమనార్హం. హమాస్, ఇస్లామిక్ జిహాద్ సంస్థలు గాజాలోని ఆస్పత్రుల కింద సొరంగాలను సైనిక కార్యకలాపాలకు, బందీలను దాచేందుకు వాడుతున్నట్లు వివిధ మార్గాల్లో వచ్చిన ఇంటెలిజెన్స్ సమాచారం ఆధారంగానే గుర్తించామన్నారు. "హమాస్, పాలస్తీనా ఇస్లామిక్ జిహాద్ సంస్థలు గాజాలోని అల్-షిఫా ఆస్పత్రి నుంచి కమాండ్ అండ్ కంట్రోల్ కేంద్రాన్ని నిర్వహిస్తున్నాయి. అక్కడ వారు ఆయుధాలను దాచారు. ఇజ్రాయెలీ దాడులకు బదులిచ్చేందుకు సిద్ధమవుతున్నారు. వారు ప్రజల్లో పూర్తిగా కలిసిపోయి కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. అమాయక ప్రజలు ఉన్న చోట వైమానిక దాడులు చేయడాన్ని, కాల్పులు జరపడాన్ని మేము సమర్థించం. ఆస్పత్రులు, పేషెంట్లను కచ్చితంగా కాపాడాలి. హమాస్ చర్యలు.. గాజా పౌరులను రక్షించాల్సిన బాధ్యతల నుంచి ఇజ్రాయెల్‌ను దూరం చేయలేవు. ఈ విషయాన్ని మేం చాలా సందర్భాల్లో చెప్పాం" అని కిర్బీ చెప్పారు. మరోవైపు శ్వేతసౌధం ప్రకటనపై హమాస్ స్పందిస్తూ.. "ఆస్పత్రులపై తీవ్రమైన చర్యలు తీసుకోవడానికి, గాజా వైద్య వ్యవస్థను ధ్వంసం చేయడానికి శ్వేతసౌధం ఇజ్రాయెల్‌కు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది" అని ఆరోపించింది.

**అల్-షిఫాలోకి ప్రవేశించిన ఇజ్రాయెల్ దళాలు..! :** హమాస్ కమాండ్ సెంటర్ ఉన్నట్లు చెబుతున్న అల్-షిఫా ఆస్పత్రిలోకి ఇజ్రాయెల్ దళాలు ప్రవేశించాయి. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం ట్యాంకులు, సైన్యం ఆస్పత్రిలోకి చేరుకొని.. అత్యవసర విభాగంలోకి ప్రవేశించాయి. ఈ ఆస్పత్రిలో దాక్కొన్న హమాస్ దళాలు లొంగిపోవాలని ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్ హెచ్చరికలు జారీ చేసింది. అంతకుముందే.. ఈ ఆస్పత్రిలో కచ్చితమైన సమాచారంతో లక్ష్యాలపై దాడులు చేసినట్లు ఐడీఎఫ్ పేర్కొంది. ఈ దాడిలో వైద్య సిబ్బంది, అరబిక్ భాష తెలిసిన వారిని వెంట తీసుకెళ్లినట్లు వెల్లడించింది. ఇక్కడ దాడి నిర్వహించడం కోసం దళాలకు ప్రత్యేక శిక్షణ కూడా ఇప్పించినట్లు తెలిపింది. మరోవైపు అల్-షిఫా ఆస్పత్రిలో పరిస్థితి దారుణంగా ఉందని అక్కడి సహాయకులు చెబుతున్నారు. హమస్ ఆధ్వర్యంలోని గాజా ఆరోగ్య శాఖ ప్రతినిధి డాక్టర్ అల్ ఖుద్రా స్పందిస్తూ.. ఈ ఆస్పత్రిలో వేల మంది నిరాశ్రయులు తలదాచుకొంటున్నారని పేర్కొన్నారు. అంతర్జాతీయ పరిశీలకులు ఈ ఆస్పత్రికి రావచ్చని ఆహ్వానించారు. ఇజ్రాయెల్ దళాల ఆపరేషన్‌కు మూడు గంటల ముందు ఈ ప్రకటన వెలువడింది. ఈ ఆస్పత్రిలో 1500 మంది వైద్య సిబ్బంది, 7,000 మంది నిరాశ్రయులు ఉన్నారని అల్ ఖుద్రా వెల్లడించారు.

## నాటి కేసును తిరగదోడి.. బీటెక్ రవిపై నాన్‌బెయిలబుల్ కేసా? టీడీపీ నేతల ఫైర్..



కడప : పులివెందుల ఇన్‌చార్జి బీటెక్ రవిని నాటకీయ పరిణామాల మధ్య పోలీసులు అరెస్ట్ చేశారు. 10 నెలల క్రితం టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ కడప జిల్లా పర్యటనలో భాగంగా ఎయిర్ పోర్టులోకి పంపించలేదని పోలీసులకు బీటెక్ రవికి మధ్య గొడవ జరిగింది. అప్పట్లో వల్లూరు పోలీస్ స్టేషన్ పరిధిలో 324 సెక్షన్ కింద కేసు నమోదైంది. ఇప్పుడు దానిని పోలీసులు నాన్ బెయిలబుల్‌గా మార్చారు. రాత్రి కడప రిమ్స్‌లో వైద్య పరీక్షల అనంతరం నివాసం వద్ద జడ్జి ఎదుట పోలీసులు హాజరుపరిచారు. 10 నెలల తరువాత చిన్నగొడవ కేసును ఇప్పుడు నాన్ బెయిలబుల్‌గా మార్చి అప్పటికప్పుడు జడ్జి నివాసం వద్ద 41ఎ నోటీసు ఇచ్చి అర్ధరాత్రి హాజరుపరచడంపై మొదట జడ్జి అభ్యంతరం తెలిపారు. పోలీసుల రిక్వెస్ట్‌తో.. 14 రోజుల పాటు రిమాండ్‌కి తరలించడంతో అర్ధరాత్రి తరువాత కడప సెంట్రల్ జైలుకు పోలీసులు తరలించారు. పాత కేసులను తిరగదోడి ఇప్పుడు నాన్ బెయిలబుల్ కేసులు పెట్టడంపై జగన్ ప్రభుత్వంతో పాటు పోలీసులపై టీడీపీ నేతలు మండిపడుతున్నారు. బీటెక్ రవి అడ్డగోలు కేసులపైనే కోర్టులోబెయిల్ కోసం అప్లై చేస్తున్నట్టు కుటుంబ సభ్యులు తెలిపారు.

## లోయలో పడిన బస్సు.. 36 మంది మృతి



శ్రీనగర్: జమ్మూ కశ్మీర్‌లో పెను విషాదం చోటుచేసుకుంది. ప్రయాణికులతో వెళ్తున్న బస్సు ఘోర ప్రమాదానికి గురైంది. కిష్త్వాఢ్ నుంచి జమ్మూ వెళ్తున్న ఓ బస్సు లోయలోకి దూసుకెళ్లిన ఘటనలో 36మంది మృతి చెందారు. మరో 19మంది గాయపడ్డారు. వీరిలో ఆరుగురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు కేంద్రమంత్రి జితేంద్రసింగ్ 'ఎక్స్' వేదికగా వెల్లడించారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు సమాచారం. జమ్మూలోని డోడా జిల్లాలో బటోత్-కిష్త్వాఢ్ జాతీయ రహదారిపై ఈ ఘోరం చోటుచేసుకుంది.

దాదాపు 55 మందికి పైగా ప్రయాణికులతో బుధవారం ఉదయం కిష్త్వాఢ్ నుంచి బస్సు బయలుదేరింది. ఈ క్రమంలో తృంగాల్-అస్సార్ ప్రాంతానికి చేరుకోగానే దాదాపు 300 అడుగుల లోయలో బస్సు జారిపడింది. ఈ సమాచారం తెలిసిన వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న అధికారులు సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను సమీపంలోని ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నట్లు మంత్రి తెలిపారు. అక్కడి పరిస్థితులను ఉన్నతాధికారులతో ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు.

**బస్సు దుర్ఘటనపై ప్రధాని మోదీ తీవ్ర దిగ్భ్రాంతి :** డోడాలో బస్సు దుర్ఘటనపై ప్రధాని నరేంద్ర మోదీ తీవ్ర విచారం వ్యక్తంచేశారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.

క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. మృతులకు ప్రధానమంత్రి సహాయ నిధి నుంచి రూ.2లక్షలు, క్షతగాత్రులకు రూ.50వేలు చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు.

## 5 లక్షల గాజులతో దుర్గమ్మకు అలంకరణ



**విజయవాడ: ఇంద్రకీలాద్రిపై వెలసిన కనకదుర్గమ్మ అమ్మవారు గాజుల అలంకరణలో భక్తులకు దర్శనమిస్తున్నారు. ఇంద్రకీలాద్రి అమ్మవారి ఆలయంలో ప్రతి ఏడాది కార్తీక మాసంలో గాజుల అలంకరణలో అమ్మవారి దర్శనమిస్తుంటారు. ప్రతీఏడు మాదిరిగానే ఈసారి కూడా గాజుల అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిస్తున్నారు. అమ్మవారి మూల విరాట్‌తో పాటు, ఆలయ ప్రాంగణమంతా గాజులతో ఆలయ అధికారులు అలంకరించారు. గాజుల అలంకరణలో ఉన్న దుర్గమ్మను దర్శించేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివస్తున్నారు.**

## తెదేపా ఎమ్మెల్యే నిమ్మల అరెస్ట్



పాలకొల్లు పట్టణం: పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లులో తెదేపా ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడును పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. 'పాలకొల్లు చూడు' పేరుతో నిరసన కార్యక్రమంలో భాగంగా పెంకిళ్లపాడు టిడ్కో గృహాల వద్ద వంటా వార్పు కార్యక్రమానికి ఎమ్మెల్యే పిలుపునిచ్చారు.

దీనికి పోటీగా వైకాపా పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ గొడాల గోపి ఆధ్వర్యంలో అదే ప్రాంతంలో 'నిజం చెబుతాం' నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. అనుమతి లేదంటూ రెండు పార్టీల కార్యక్రమాలను పోలీసులు అడ్డుకున్నారు. అయినప్పటికీ నిరసన వ్యక్తం చేసేందుకు తెదేపా శ్రేణులు, లబ్ధిదారులు ఎమ్మెల్యే నిమ్మల ఇంటి వద్దకు చేరుకున్నారు. మరోవైపు ఎమ్మెల్యేను పోలీసుల గృహనిర్బంధం చేశారు. దీంతో పోలీసులు, తెదేపా కార్యకర్తల మధ్య తీవ్రస్థాయిలో తోపులాట జరిగింది. అయితే పోలీసుల కళ్లుగప్పి ఎమ్మెల్యే రామానాయుడు ఇంటి నుంచి బయటకు వచ్చారు. అనంతరం జాతీయ జెండాలతో పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్దకు ఆయనతో పాటు తెదేపా, జనసేన కార్యకర్తలు చేరుకున్నారు.

వారిని పోలీసులు అడ్డుకున్నారు. పోలీసుల తీరుపై ఎమ్మెల్యే తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మహనీయుడి విగ్రహానికి పూలమాల వేసి అంజలి ఘటిస్తుంటే అడ్డంకులేంటని మండిపడ్డారు. ఈ క్రమంలో జరిగిన పోలీసులు, తెదేపా కార్యకర్తల మధ్య జరిగిన తోపులాటలో ఎమ్మెల్యే కిందపడిపోయారు. అనంతరం పోలీసులు ఆయన్ను అరెస్ట్ చేసి భీమవరం వైపునకు తీసుకెళ్లారు.

## జగన్ జాతకం బాలేదు కాబట్టే చంద్రబాబు జోలికొచ్చారు



అమరావతి: వైసీపీ చేపట్టిన సామాజిక బస్సు యాత్ర బుస్సు యాత్రగా మారిందని టీడీపీ ఉత్తరాంధ్ర ఇన్‌చార్జ్ బుద్దా వెంకన్న వ్యాఖ్యలు చేశారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. ప్రజల్లో ఉన్న ప్రభుత్వ వ్యతిరేకత కొట్టొచ్చినట్లు కనబడింది కాబట్టే మూడు సార్లు యాత్రకు బ్రేక్ వేశారన్నారు. 33 మంది బీసీలను ఊచకోత కోయించి కేసులు లేకుండా చేసినప్పుడు జగన్ రెడ్డికి బీసీలు గుర్తుకు రాలేదా అని ప్రశ్నించారు. బీసీలను దగా చేసిన ఏకైక ప్రభుత్వం వైసీపీ ప్రభుత్వమని మండిపడ్డారు. బీసీలకు నాయకత్వం వహించే ఏకైక పార్టీ తెలుగుదేశం అని చెప్పుకొచ్చారు. చంద్రబాబు - పవన్ కలిశాక జగన్‌కు పులివెందులలోను ఓటమి భయం పట్టుకుందన్నారు. జగన్‌హన్ రెడ్డి దమ్ము ధైర్యం లేని పిరికిపంద కాబట్టే 10 నెలల క్రితం ఘటనలో ఇప్పుడు బీటెక్ రవిని అరెస్టు చేయించారని విమర్శించారు. జగన్‌మోహన్ రెడ్డి జాతకం బాలేదు కాబట్టే చంద్రబాబు జోలికి వచ్చారన్నారు. చంద్రబాబు రాశిఫలం బాలేదన్న కేశినేని నాని వ్యాఖ్యలను ఖండిస్తున్నానని బుద్దా వెంకన్న ఆగ్రహం వ్యక్తం చేశారు.

## 'దొంగలు పడ్డ ఆరు నెలలకు కుక్కలు మొరిగినట్లుంది'.. బీటెక్ రవి అరెస్ట్‌పై తులసిరెడ్డి



అమరావతి: టీడీపీ నేత బీటెక్ రవి అరెస్ట్‌పై కాంగ్రెస్ నేత తులసిరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. బీటెక్ రవి అరెస్ట్ పిరికిపంద చర్య అంటూ వ్యాఖ్యలు చేశారు.

బుధవారం మీడియాతో మాట్లాడుతూ... ముఖ్యమంత్రికి ఓటమి ఫోబియా పట్టుకుందన్నారు. దొంగలు పడ్డ ఆరు నెలలకు కుక్కలు మొరిగినట్లుంది ప్రభుత్వ వాలకం అంటూ ఎద్దేవా చేశారు. జనవరి 25న కడప విమానాశ్రయం వద్ద చిన్న తోపులాట జరిగితే నవంబర్ 14న కడప యోగి వేమన విశ్వవిద్యాలయం వద్ద రాత్రి సినిమా ఫక్కీలో అరెస్ట్ చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఎన్నికల నాటికి రాజకీయ ప్రత్యర్థులు అందరినీ అరెస్ట్ చేసి జైళ్లలో పెట్టి మళ్ళీ అధికారంలోకి రావాలన్న దుర్బుద్ధి ముఖ్యమంత్రికి ఉన్నట్లుందని మండిపడ్డారు. ఇది సాధ్యం కాదని.. మహామహా నియంతలే కాలగర్భంలో కలిసిపోయారని గుర్తుచేశారు. ఇప్పటికైనా సెల్ఫ్ గోల్ కొట్టుకోవడం మానుకొని ప్రజాస్వామ్యబద్ధంగా పరిపాలన చేయాలని కాంగ్రెస్ పార్టీ సూచిస్తోందని తులసిరెడ్డి పేర్కొన్నారు.

# వోగ్ ఇండియాపై దీపిక దుమారం!

బాలీవుడ్ మోస్ట్ వాంటెడ్ బ్యూటీ దీపికా పదుకొణే ఇన్ స్టా సంచనాల గురించి చెప్పాల్సిన పనిలేదు. సక్సెస్ అయ్యాను కదా? అని కామ్ గా కూర్చుంటే పనవ్వదని అమ్మడికి బాగా తెలుసు. అందుకే నవతరం నాయికల తోనూ బ్యూటీ విషయంలో పోటీ పడుతుంది. ఎప్పటికప్పుడు అప్ డేట్ అవుతూ తనదైన ప్రత్యేకతని చాటుతుంది. ఆల్ట్రా స్టైలిష్ లుక్ లో అమ్మడు కొలువు దీరే విధానం గురించైతే మరో ముచ్చట అవసరం లేదు. క్యాలెండర్ గాళ్ల్ గా పాపులర్ అయిన తెరంగేట్రం చేసిన హీరోయిన్ కా బట్టి మ్యాగజైన్ కవర్ పేజీల కోసం ఏ రేంజ్ లో సెన్సేషన్ క్రియేట్ చేస్తుందో గెస్ చేయోచ్చు. ఇప్పటికే




పలు కవర్ పేజీలపై అందాలు ఆరబోసిన అమ్మడు మరోసారి ప్రఖ్యాత వోగ్ ఇండియా మ్యాగజైన్ పై తళుక్కున మెరిసింది. షూట్ తోకాకుండా ఏకంగా మ్యాగజైన్ తో నెటి జనుల ముందుకొచ్చింది. ఇదిగో ఇక్కడిలా బ్లాక్ కలర్ డిజైన్డ్ దుస్తుల్లో అమ్మడు సెగలు పుట్టిస్తూ కెమెరాకి ఫోజులిచ్చింది. షోల్డర్ లెస్ గౌను అమ్మడిని హైట్ అంతే గొప్పగా ప్రోజెక్ట్ చేస్తుంది. ఒక చేతిని హిప్ పై ..మరో చేతిని మోకాలిపై బ్యాలెన్స్ చేస్తూ బాడీని కాస్త బెండ్ చేస్తూ ఇచ్చిన భంగిమ ఆకర్షణీయంగా ఉంది. ఈ షూట్ కోసం దీపిక ఎంపిక చేసుకన్న యాక్సరీస్..జ్యువలెరీ మరింత అందాన్ని జోడించాయి. దీపిక పెదాలపై ఎర్రటి లిప్ స్టిక్ ..మ్యాకప్ ప్రతీది అమ్మడిని మరింత అందంగా మలిచాయి. ప్రస్తుతం ఈ ఫోటో నెట్టింట వైరల్ గా మారింది. ఇక దీపిక సినిమాల సంగతి చూస్తే..బాలీవుడ్ మినహాయిస్తే తెలుగులో పాన్ ఇండియా చిత్రం కల్కితో తెరంగేట్రం చేస్తుంది. ఇందులో ప్రభాస్ కి జోడీగా నటిస్తుంది. భారీ అంచనాల మధ్య తెరకెక్కుతోన్న సైన్స్ ఫిక్షన్ థ్రిల్లర్ చిత్రమిది. ఇందులో దీపిక నటన ప్రత్యేకంగా ఉంటుందని చిత్ర యూనిట్ చెబుతుంది

# అందంలో మామ్ రవీనాటాండన్‌ని మించి..!

హాట్ హీరోయిన్ రవీనా టాండన్ పరిచయం అవసరం లేదు. నందమూరి బాలకృష్ణ నటించిన బ్లాక్ బస్టర్ మూవీ 'బంగారు బుల్లోడు'లో ఒక కథానాయికగా నటించింది. దశాబ్దాల పాటు బాలీవుడ్ ని ఏలిన రవీనా ఇండస్ట్రీ హాటెస్ట్ హీరోయిన్ గా పాపులరైంది. నిరంతరం స్టార్ హీరోలతో ప్రేమాయణాలతోను ఈ భామ మీడియా హెడ్ లైన్స్ కెక్కింది. రవీనా ఇటీవలే కేజీఎఫ్ 2లో ఒక కీలక పాత్రలో నటించడం ఆసక్తిని కలిగింది. కేజీఎఫ్ ఫ్రాంఛైజీ తదుపరి చిత్రాల్లోను రవీనా కనిపించే వీలుంది. ఇప్పుడు రవీనా టాండన్ కుమార్తె రాషా థడానీ బ్యాక్ టు బ్యాక్ సినిమా ఆఫర్లతో ఇండస్ట్రీలో దూసుకుపోతోంది. ఇంకా డెబ్యూ ఇవ్వక ముందే 18 ఏళ్ల అమ్మాయి రెండు సినిమాల్లో నటించేస్తోందని సమాచారం. బాలీవుడ్‌లో ఆమన్ దేవగన్‌తో కలిసి ఇంకా పేరు పెట్టని చిత్రంతో ఆరంగేట్రం చేస్తోంది. ఇందులో అజయ్ దేవగన్ కీలక పాత్రలో నటిస్తున్నారు. దీనిని అధికారికంగా



ప్రకటించకముందే ఇప్పటికే తన రెండవ సినిమా అవకాశాన్ని కైవసం చేసుకున్నట్లు తెలుస్తోంది. తాజా సమాచారం మేరకు రాషా టాలీవుడ్ లో ఆరంగేట్రానికి రెడీ అవుతోంది సమాచారం. అది కూడా పరిశ్రమ అగ్రహీరో సరసన తెరకు పరిచయమయ్యే అవకాశం ఉందని కథనాలొస్తున్నాయి. మెగాపవర్ స్టార్ రామ్ చరణ్ తదుపరి చిత్రం %=జ% 16 తో రవీనా కుమార్తె రాషా తెలుగులో అడుగుపెడుతుందని తెలిసింది. %===% స్టార్ చరణ్ తో ఉప్పెన దర్శకుడు బుచ్చి బాబు సనా స్పోర్ట్స్ డ్రామాను తెరకెక్కించనున్నారు. ఈ చిత్రంలో రాషా ఒక ముఖ్యమైన పాత్రలో నటించవచ్చని ఊహాగానాలు సాగుతున్నాయి. అయితే రాషా కానీ ఆమె కుటుంబ సభ్యులు కానీ ఇప్పటివరకు ఎటువంటి అధికారిక ప్రకటన చేయలేదు. అయితే ఈ రెండు సినిమాలు నిర్మాణ దశలో ఉన్నాయి. మేకర్స్ తమ తారాగణం వివరాల్లో రాషా గురించి ప్రకటించే వీలుందని టాక్ వినిపిస్తోంది. ఈ అమ్మాయి ఇప్పటికే సోషల్ మీడియాలో పాపులర్ అయింది. ఇటీవలే గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన ఈ యంగ్ గాళ్ ఎంతో గొప్ప ప్రతిభావంతురాలిగా పేరు తెచ్చుకుంది. రాషా కాలేజీ ఈవెంట్‌లో పాడిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.




# 16 సినిమాల్లో 7 హిట్లు.. మెగా మేనల్లుడి 9 ఏళ్ల సినీ ప్రయాణం..!




మెగా ఫ్యామిలీ నుంచి హీరోగా ఎంట్రీ ఇచ్చిన మెగా మేనల్లుడు సాయి ధరమ్ తేజ్ నేటితో తెలుగు చలన చిత్ర పరిశ్రమలో 9 ఏళ్లు పూర్తి చేసుకున్నారు. వైవిఎస్ చౌదరి రేయ్ సినిమా ముందు మొదలైనా ఏ.ఎస్ రవి కుమార్ చౌదరి డైరెక్షన్ లో తెరకెక్కిన పిల్లా నువ్వు లేని జీవితం సినిమా ముందు రిలీజైంది. ఆ సినిమాలో సాయి తేజ్ ఎనర్జీకి మెగా ఫ్యాన్స్ ఖుషి అయ్యారు. మెగా మేనల్లుడా మజాకానా అంటూ మెగా ఫ్యామిలీలో మరో హీరో స్టార్ క్రేజ్ దక్కించుకోవడం పక్కా అని ఫిక్స్ అయ్యారు. పిల్లా నువ్వులేని జీవితం హిట్ కాగా రేయ్ నిరాశ పరిచింది. ఆ తర్వాత వచ్చిన సుబ్రహ్మణ్యం ఫర్ సే, సుప్రీం రెండు సినిమాలు సాయి తేజ్ ఖాతాలో హిట్ అందించాయి. ఆ తర్వాత తిక్క, విన్నర్, నక్షత్రం, జవాన్, ఇంటెలిజెంట్, తేజ్ ఐ లవ్ యూ అంటూ 3 ఏళ్లు 6 సినిమాలు వరుస ఫ్లాపులు అందుకున్నాడు. తేజ్ ట్రాక్ తప్పాడు అనుకున్న టైం లో కిషోర్ తిరుమల డైరెక్షన్ లో వచ్చిన చిత్రలహరి అతనికి మళ్లీ ట్రాక్ ఎక్కించింది. ఆ సినిమా తర్వాత వెంటనే మారుతి డైరెక్షన్ లో వచ్చిన ప్రతి రోజు పండుగే సినిమా తేజ్ కి మరో హిట్ అందించింది. బ్యాక్ టు బ్యాక్ హిట్లతో ఇక తేజ్ కి తిరుగులేదు అనుకునే టైం లో సోలో బ్రతుకే సో బెటర్ సినిమా రిలీజై ఫ్లాపైంది. కోవిడ్ లాక్ డౌన్ తర్వాత థియేటర్లకు జనాలు వస్తారో రారో అన్న టైం లో రిలీజైన ఈ సినిమా ఆశించిన స్థాయిలో ప్రేక్షకులను అలరించలేదు. ఇక ఆ తర్వాత దేవా కట్ట డైరెక్షన్ లో రిపబ్లిక్ సినిమా చేశాడు. ఆ సినిమా రిలీజ్ టైం లో మేజర్ బైక్ యాక్సిడెంట్ తో కోమాలోకి వెళ్లాడు సాయి తేజ్. కేబుల్ బ్రిడ్జి మీద సాయి తేజ్ కి జరిగిన యాక్సిడెంట్ వల్ల దాదాపు 3 నెలల పాటు కోమాలోనే ఉన్నాడు. 2021 లో యాక్సిడెంట్ కాగా రెండేళ్లు టైం తీసుకున్న సాయి తేజ్ కార్తీక్ దండు డైరెక్షన్ లో విరూపాక్షతో ప్రేక్షకుల ముందుకు వచ్చాడు. ఆ సినిమా తో హిట్ అందుకోగా ఈ ఇయర్ మేనమామ పవన్ కళ్యాణ్ తో బ్రో సినిమాతో వచ్చాడు. బ్రో కూడా ప్రేక్షకులను మెప్పించింది. ప్రస్తుతం సంపత్ నంది డైరెక్షన్ లో గాంజా శంకర్ సినిమా చేస్తున్నాడు సాయి తేజ్. కెరీర్ అంతా సాఫీగా సాగుతుంది అనుకునే టైం లో బైక్ యాక్సిడెంట్ సాయి తేఏజ్ కెరీర్ మళ్లీ మొదటికి తెచ్చింది. ఆ యాక్సిడెంట్ తర్వాత ఒకప్పటిలా సాయి ధరం తేజ్ మాట్లాడటం కష్టం అవుతుంది. అయితే చిన్నగా తనను తాను ఫైన్ చేసుకుంటూ మళ్లీ ఆడియన్స్ ని మెప్పించే ప్రయత్నం చేస్తున్నాడు. 9 ఏళ్ల ఈ సినీ ప్రయాణంలో మెగా మేనల్లుడు సాయి తేజ్ మెగా ఫ్యాన్స్ నే కాదు తెలుగు సినీ ప్రేక్షకులను అలరించడం లో సక్సెస్ అయ్యాడని చెప్పొచ్చు.

# బాలీవుడ్ లో లాంచ్ అయితే బట్టలిప్పించేసారు! పాయల్ ఘోష్




పాయల్ ఘోష్ బాలీవుడ్ కెరీర్ ముగిసిన సంగతి తెలిసిందే. అమ్మడు తెలుగు.. కన్నడ...హిందీలో సినిమాలు చేసింది. కానీ ఏ భాషలోనూ నిలదొక్కుకోలేదు. బాలీవుడ్ లో కమిట్ మెంట్ పేరుతో లైంగిక దోపడీలపై సంచలన ఆరోపణలు చేయడంతో ఏకంగా పరిశ్రమకే దూరమైంది. ఆ వివాదంతో పాయల్ మళ్లీ బాలీవుడ్ లో కనిపించలేదు. ఈ నేపథ్యంలో తాజాగా మరోసారి బాలీవుడ్ పై తనదైన శైలిలో విరుచుకు పడింది. 'దేవుడి దయవల్ల సౌత్ సినిమాల ద్వారా పరిశ్రమలోకి వచ్చాను. అలా కాకుండా ముందే బాలీవుడ్ లో ఎంట్రీ ఇచ్చి ఉంటే నా దుస్తులు కూడా తొలగించేవారు. అలా చేసి నా పేరు మీద వ్యాపారం చేసుకు నేవారు. వాళ్లకి ప్రతిభతో పనిలేదు. దుస్తులు తీసేసి అమ్మాయిల అందాలు చూపిస్తే చాలు అని ఆరోపించింది. ఈ వ్యాఖ్యలు బాలీవుడ్ లో మరోసారి ఆసక్తికరంగా మారాయి. అమ్మడి వ్యాఖ్యలు బాలీవుడ్ ప్రతిష్టని మరింత దిగజార్చుతున్నాయి. బాలీవుడ్ లో కమిట్ మెంట్ వ్యవహారం ఎలా ఉంటుంది అన్నపై ఇప్పటికే చాలా మంది నటీమణులు సంచలన ఆరోపణలుచేసిన సంగతి తెలిసిందే. కంగనా రనౌత్ లాంటి నటి కూడా బాలీవుడ్ పై ఎప్పటికప్పుడు తనదైన శైలిలో విరుచుకుపడుతుంది. పాయల్ విషయంలో కంగన కూడా మద్దతు ప్రకటించిన సంగతి తెలిసిందే. మరి తాజాగా పాయల్ చేసిన ఆరోపణలపై ఎవరైనా స్పందిస్తారా? అన్నది చూడాలి. గతంలోనూ ఆమె చేసిన ఆరోపణల విషయంలో చాలా మంది మౌనంగానే ఉన్నారు.

కొంత మంది ఖండిచే ప్రయత్నం చేసే సరికి ఇరకాటం లోనూ పడ్డారు. పాయల్ ఘోష్ తెలుగు సినిమా 'ప్రయాణం'తో ఎంట్రీ ఇచ్చింది. ఆ తర్వాత 'ఊసరవెల్లి'..'మిస్టర్ రాస్కెల్'..ఓ కన్నడ సినిమాలో నటించింది. అటుపై బాలీవుడ్ లో ఎంట్రీ ఇచ్చింది. అక్కడామే 'పటేల్ కి పంజాబ్ షాదీ' ..'కోయి జానే నా' లాంటి సినిమాలు చేసింది. ఆ తర్వాత ఆమె సినిమాలు చేసింది లేదు. బాలీవుడ్ పై ఆరోపణలతోనే మీడియాలో హాట్ టాపిక్ గా మారింది.

# హనీ ఈజ్ ది బెస్ట్ కాదు..అంతకు మించి

ఎఫ్ -3- తర్వాత మెహరీన్ పిర్జాదా టాలీవుడ్ లో కనిపించలేదు. ఇన్ స్టాలో హాట్ హాట్ ఫోటోలతో దర్శనమివ్వడం తప్ప కెరీర పరంగా మరో ముందడుగు పడిన దాఖలాలేవు. అవకాశాలు రాకపోవడానికి ఎన్నో కారణలుంటాయి. వాటి సంగతి పక్కనబెడితే ఈ క్రమంలో అమ్మడు రూప లావణ్యంలో రకరకాల మార్పులు చేసింది. వెయిట్ లాస్ అవ్వడం...ఇంకా అవసరం అనుకుంటే జీరో సైజ్ లోకి వెళ్లడం వంటివి చేసింది. ఈ రకమైన ట్రాన్సపర్మేషన్ పెద్దగా కలిసి రాలేదు. కెరీర్ ఆరంభంలో కవ్వించినంతంగా మధ్యలో ఏదో మిస్ అయిందనే భావన కల్పించింది. హనీ కెరీర్ లో అదో రకమైన డిస్టబెన్స్ గానే చెప్పాలి. ఎందుకంటే ఆ ఫోటో షూట్లపై భిన్నమైన కామెంట్లు తెరపైకి వచ్చాయి. తాజాగా వాటన్నింటిని బ్యాలెన్స్



చేయడమే కాదు...వావ్ అనిపించే లుక్ లోనే దర్శనిమించ్చింది. మెహరీన్ కొత్త ఫోటోలు కొన్ని నెట్టింట వైరల్ అవుతున్నాయి. అందులో సొగసరి తనలో క్లాసిక్ బ్యూటీని మరోసారి లాంచ్ చేసింది. మిల్కీ అందంతో మెస్మరైజ్ చేస్తుంది. తనలో పర్ఫెక్ట్ బ్యూటీని ప్రోజుక్ట్ చేసింది. శరీరం సహా రూపంలో చాలా బ్యాలెన్సింగ్ కనిపిస్తుంది. వెయిట్ లాస్ అయినట్లుగానీ..గెయిన్ అయినట్లు గానీ లేకుండా పర్ఫెక్ట్ కొలతలతో పక్కాగా ప్రొజెక్ట్ అవుతుంది. క్రీమ్ కలర్ డిజైన్డ్ లెహంగాలో ఎంతో ఆకర్షణీయంగా ఉంది. అమ్మడి మ్యాకప్..చెవులకు బులకాలు.. నెక్ పై సన్నని చైన్ ధరించింది. తలలో గులాబీలతో మరింత వన్నె తీసుకొచ్చింది. ముదురు ఎరుపు రంగు గులాబీ తో గుభాళించేస్తుంది. ప్రస్తుతం ఈ ఫోటోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. మెహరీన్ బ్యూటీ సహా లుక్ పై అభిమానులు ఆసక్తికర కామెంట్లు పోస్ట్ చేస్తున్నారు. ఇక కెరీర్ సంగతి చూస్తే.. -స్పార్క్ -అనే తెలుగు చిత్రంలో నటిస్తోంది. అలాగే కన్నడ పరిశ్రమలోనూ లాంచ్ అవుతుంది.

# దేవుని సొంత దేశంలో పుట్టి ఏమి ఈ అరాచకం?

ఐశ్వర్య లక్ష్మి పరిచయం అవసరం లేదు. మణిరత్నం 'పొన్నియన్ సెల్వన్' సహా దుల్కార్ 'కింగ్ ఆఫ్ కోథ' వంటి భారీ పాన్ ఇండియా చిత్రాల్లో ఈ బ్యూటీ నటించింది. ఐశ్వర్య అందం, అద్భుత నట ప్రదర్శనకు ఇప్పుడు తమిళనాడు, తెలుగు రాష్ట్రాల్లో భారీ ఫాలోవర్స్ ఉన్నారు. పెరిగిన క్రేజ్ కి తగ్గట్టే ఐశ్వర్య పలు భారీ సినిమాలకు సంతకాలు చేసిందని సమాచారం. ఇటీవలే లెజెండరీ మణిరత్నం తెరకెక్కించిన 'పొన్నియిన్ సెల్వన్ -1' వార్షికోత్సవం సందర్భంగా (30సెప్టెంబర్ 2022న విడుదలైన %ూా%-1) బోట్ గర్ల్ పూంగుజలి పాత్రను పోషించిన నటి ఐశ్వర్య లక్ష్మి ఇన్ స్టాలో



ఒక త్రోబాక్ ఫోటోని షేర్ చేసింది. ది మణి సర్ స్క్వాడ్ పేరుతో రిలీజ్ చేసిన ఈ ఫోటోలో పీఎస్ 1 స్టార్లు అంతా ఉన్నారు. పొన్నియిన్ సెల్వన్ 1 దాదాపు 500కోట్లు వసూలు చేయగా సీక్వెల్ పొన్నియిన్ సెల్వన్ 2 ప్రపంచవ్యాప్తంగా దాదాపు రూ. 350 కోట్ల గ్రాస్ వసూలు చేసింది. సుమారు 850కోట్లు వసూలు చేసిన ఫ్రాంఛైజీలో ఐశ్వర్య లక్ష్మి కథానాయిక. అటుపై 'కింగ్ ఆఫ్ కోథ' ఆశించిన రిజల్ట్ ని ఇవ్వకపోవడం ఈ భామను నిరాశపరిచింది. అయినా ఐశ్వర్యకు అవకాశాల పరమైన సమస్య లేదు. అటు తమిళం ఇటు తెలుగు రెండుచోట్లా అవకాశాలు వరిస్తున్నాయని సమాచారం. ఇంతలోనే ఐశ్వర్యలక్ష్మి లేటెస్ట్ ఫోటోషూట్ అంతర్జాలంలో వైరల్ గా మారింది. ఇది యువతరం గుండెల్లో గుబులు రేపుతోంది. ఐశ్వర్య లక్ష్మి పూర్తిగా లెదర్ డ్రెస్ లో సంథింగ్ హాట్ గా కనిపిస్తోంది. థై స్లిట్ బ్లాక్ డిజైనర్ గౌన్ ఈ భామ లోని హాట్ కంటెంట్ ని పదింతలు పెంచిందంటూ అభిమానులు కామెంట్ చేస్తున్నారు. ఐషు పేరుతో ఉన్న ఇన్ స్టా పేజీలో ఐశ్వర్య లక్ష్మి స్వయంగా ఈ ఫోటోషూట్ ని షేర్ చేసింది. ఇది వెబ్ లో వేగంగా వైరల్ అవుతోంది.



# కాంగ్రెస్ గెలిస్తే ధరణి బంగాళాఖాతానికి.. రైతులు అరేబియా సముద్రానికి..

బోధన్: త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలిస్తే ధరణి బంగాళాఖాతానికి.. రైతులు అరేబియా సముద్రంలోకి వెళ్తారని భారాస అధినేత, సీఎం కేసీఆర్ అన్నారు. ఆ పార్టీని గెలిపిస్తే దళారీ రాజ్యం వస్తుందని వ్యాఖ్యానించారు. తెలంగాణ ప్రజల కోసమే భారాస కృషి చేస్తోందని చెప్పారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా నిజామాబాద్ జిల్లా బోధన్‌లో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభలో కేసీఆర్ మాట్లాడారు. "సమైక్య రాష్ట్రంలో నిజాంసాగర్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం ముంచింది. దానికి భారాస ప్రభుత్వం పూర్వ వైభవం తెచ్చింది. ఇది మీ కళ్ల ముందున్న సాక్ష్యం. రాష్ట్రంలో రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ ఇస్తున్నాం. కాంగ్రెస్ ప్రభుత్వం ఏనాడైనా రైతుబంధు గురించి ఆలోచన చేసిందా? ధరణిని బంగాళాఖాతంలో వేస్తామని కాంగ్రెస్ నేతలు అంటున్నారు. రైతుబంధు దుబారా అని కాంగ్రెస్ నేత ఉత్తమ్‌కుమార్‌రెడ్డి విమర్శిస్తున్నారు. రైతుబంధు దుబారానా?ధరణి తీసేస్తే రైతుబంధు డబ్బులు బ్యాంకు ఖాతాల్లోకి ఎలా వస్తాయి?రైతులకు ఇస్తున్న 24 గంటల ఉచిత విద్యుత్ దుబారా అని పీసీసీ అధ్యక్షుడు రేవంత్ అంటున్నారు. కాంగ్రెస్ గెలిస్తే రైతులకు 3 గంటల కరెంటుతో సరిపెడతారు. అభ్యర్థుల గుణగణాలను ప్రజలు దృష్టిలో ఉంచుకోవాలి. విచక్షణతో ఓటు వేసి సరైన ప్రభుత్వాన్ని ఎన్నుకోవాలి" అని కేసీఆర్ అన్నారు.

**భాజపా.. తెలంగాణను మోసం చేసింది..** నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గంలో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభలో కేసీఆర్ మాట్లాడారు. "గత పాలకులు ప్రజల కనీస అవసరాలు కూడా తీర్చలేదు. బీడీ కార్మికుల కష్టాలు స్వయంగా చూశాను. నా చిన్నతనంలో బీడీ కార్మికుల ఇళ్లల్లో పెరిగాను. దేశంలో ఏ రాష్ట్రంలోనూ బీడీ కార్మికులకు పింఛన్ ఇవ్వట్లేదు. సంక్షేమ పథకాల్లో దేశంలోనే నంబర్ వన్‌గా ఉన్నాం. కాంగ్రెస్ రైతుబంధు తీసేస్తామని అంటోంది. 24 గంటల నిరంతర విద్యుత్ అనవసరం అంటోంది. రాష్ట్రంలో అన్ని మతాల వారిని సమానంగా చూస్తున్నాం. భారాస ముమ్మాటికీ లౌకికవాద పార్టీ. మైనార్టీల సంక్షేమం కోసం పదేళ్లలో రూ.12వేల కోట్లు ఖర్చు చేశాం. ఈ పదేళ్లలో రాష్ట్రంలో ఒక్కసారి కూడా మతకల్లోలాలు జరగలేదు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత తలసరి ఆదాయంలో తెలంగాణ అగ్రస్థానంలో ఉంది. భారతీయ జనతా పార్టీ ప్రజలను విభజించేందుకు ప్రయత్నిస్తూనే ఉంటుంది. భాజపా తెలంగాణను మోసం చేసింది. దేశంలో 157 మెడికల్ కళాశాలలు మంజూరు చేస్తే.. తెలంగాణకు ఒక్క మెడికల్ కళాశాల కూడా ఇవ్వలేదు. నవోదయ పాఠశాలను ఇవ్వలేదు. తెలంగాణ కోసం ఏమీ చేయని భాజపాకు మనం ఓటు ఎందుకు వేయాలి? భాజపా నేతలు ప్రచారానికి వస్తే నిలదీయండి? కాంగ్రెస్, భాజపా.. ఈ రెండు పార్టీలు తెలంగాణకు నష్టం చేశాయే తప్ప లాభం చేయలేదు. అందుకే ప్రజలు ఆలోచించి ఓటు వేయాలి. 2024 తర్వాత భారత దేశంలో వచ్చేది సంకీర్ణ ప్రభుత్వమే. అన్ని ఎంపీ స్థానాలను మనం గెలిస్తే.. భారాస సత్తా చూపించొచ్చు" అని కేసీఆర్ అన్నారు.



# కేంద్రం ఇచ్చిన అవార్డులే కేసీఆర్ పాలనకు నిదర్శనం

హైదరాబాద్: కేసీఆర్ పాలనను మెచ్చుకుంటూ కేంద్రం నుంచి తెలంగాణ ప్రభుత్వానికి ఎన్నో అవార్డులు వచ్చాయని మంత్రి హరీశ్‌రావు అన్నారు. హైదరాబాద్‌లో 'తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్' ఆధ్వర్యంలో నిర్వహించిన 'మీట్ ది ప్రెస్' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. దేశంలోని ఇతర రాష్ట్రాలు తెలంగాణ దరిదాపుల్లో లేవని చెప్పారు. ఎన్నికల హామీల్లో ప్రకటించని కల్యాణలక్ష్మి, కేసీఆర్ కిట్, కేసీఆర్ బీమా, రైతుబంధు వంటి పథకాలను అమలు చేశామన్నారు. "పల్లె కన్నీరు పెడుతోంది అనే పాటలు పాడుకునే పరిస్థితిపోయి.. పట్టణాల నుంచే పల్లెలకు వెళ్లి సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు సైతం సౌకర్యంగా తమ పనులు చేసుకునే స్థాయిలో అభివృద్ధి చేశాం. నాటి కాంగ్రెస్ పాలనను నేటి కేసీఆర్ పాలనను బేరీజు వేసుకొని ప్రజలు ఓటెయ్యాలని కోరుతున్నాను. కేసీఆర్ విజన్ కారణంగానే విద్యుత్ సమస్య పరిష్కారమైంది. ఎన్నో రాష్ట్రాల్లో ఇప్పటికీ కోతలు అమలవుతున్నాయి. నాణ్యమైన విద్యుత్ ఇవ్వడంతో రైతులు అన్ని కాలాల్లో పంటలు పండించుకుంటున్నారు. మోటార్లు కాలిపోవడం లేదు. పక్క రాష్ట్రాలు రెండు, మూడు గంటలు కరెంటు ఇవ్వడం కూడా గగనమైపోయింది. రైతుబంధు కింద దాదాపు రూ. 72వేల కోట్ల రూపాయలు నగదు బదిలీ జరిగింది. భూగర్భ జలాలను పెంచడంతో కోటి మెట్రిక్ టన్నుల ధాన్యం పండే రాష్ట్రం మూడు కోట్ల మెట్రిక్ టన్నులు ధాన్యం పండే రాష్ట్రంగా మారింది. పంజాబ్‌ను అధిగమించింది. కర్ణాటక సహా ఇతర ప్రభుత్వాలు సైతం మన రాష్ట్రాన్ని ధాన్యం అడిగే పరిస్థితి వచ్చింది. గ్రామాల్లో దవాఖానాలు, ప్రతి జిల్లా, నగరాల్లోని ఆస్పత్రులను అభివృద్ధి చేస్తున్నాం. మాతాశిశు మరణాలు తగ్గుముఖం పట్టాయి. ఎంబీబీఎస్ సీట్లను 10వేల సీట్లకు పెంచాం. విదేశాలకు వెళ్లకుండా ఈ సౌలభ్యం తెచ్చిన ఘనత భారాస ప్రభుత్వానిది. విద్యలో గుణాత్మక మార్పు తీసుకొచ్చాం. గురుకుల పాఠశాలలను జూనియర్ కళాశాలలుగా తీర్చిదిద్దాం. ఆంగ్ల మాధ్యమంలో బోధన, కార్పొరేట్ స్థాయి వసతులను పాఠశాల్లో కల్పించేందుకు కృషి చేస్తున్నాం. ఉద్యోగ నియామకాల విషయంపై ప్రతిపక్షాలు బురదజల్లే ప్రయత్నం చేస్తున్నాయి. మన ఉద్యోగాలు మన పిల్లలకు దక్కాలనే ఉద్దేశంతో 95 శాతం ఉద్యోగాలు స్థానికులకు దక్కేలా రాష్ట్రపతి ఉత్తర్వుల సవరణ తీసుకొచ్చాం. గత ప్రభుత్వంలో 1.32 లక్షల ఉద్యోగాలు ఇచ్చాం. ఈ సారి 80వేల ఉద్యోగాలను భర్తీ చేయాలని సీఎం హామీ ఇచ్చారు. కరోనా, రాష్ట్రపతి ఉత్తర్వులు తీసుకురావడానికి కేంద్రంతో ఏడాదిన్నర పోరాటం చేయాల్సి వచ్చింది. దాదాపు 2 లక్షల ఉద్యోగాలు ప్రభుత్వ రంగంలో నియామకాలు చేశాం. ప్రైవేటు రంగంలో 24 లక్షల ఉద్యోగాలు వచ్చాయి. ఐటీ రంగంలోనే 6 లక్షల ఉద్యోగాలు వచ్చాయి. భవిష్యత్తులో జాబ్ క్యాలెండర్ అమలు చేసి ఏ ఏడాది ఉద్యోగాలు ఆ ఏడాదే భర్తీ చేస్తాం. దురదృష్టవశాత్తూ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌లో పేపర్ లీక్ జరిగింది. వెంటనే ప్రభుత్వం చర్యలు తీసుకొని బాధ్యులపై చర్యలు చేపట్టి.. దోషులను శిక్షించాం. ఐటీ రంగంలో ఒకప్పుడు బెంగళూరు సిలికాన్ వ్యాలీగా ఉండేది. ఇప్పుడు ఐటీ ఉత్పత్తుల ఎగుమతిలో రాష్ట్రం నంబర్ వన్‌గా మారింది. గూగుల్, యాపిల్, మైక్రోసాఫ్ట్ వంటి పేరుమోసిన కంపెనీలు ఇక్కడ అతి పెద్ద క్యాంపస్‌లను ఏర్పాటు చేశాయి. 10ఏళ్ల కేసీఆర్ పాలనలో ఎలాంటి కర్ఫ్యూలు లేవు. హైదరాబాద్‌ను ప్రశాంత నగరంగా మార్చాం. ఒక గ్లోబల్ సిటీగా తీర్చిదిద్దడంతో ఇటీవల గ్లోబల్ గ్రీన్‌సిటీ అవార్డు వచ్చింది. ఇతర రాష్ట్రాల్లోలా ఇక్కడ కులాలు, మతాలు, ప్రాంతాల చిచ్చులు లేవు. ప్రతి ఇంటికి సంక్షేమ ఫలాలు అందాయి. అందుకే తప్పకుండా పాజిటివ్ ఓటింగ్ జరుగుతుందని ఆశిస్తున్నాం. మళ్లీ మూడోసారి ముఖ్యమంత్రి అయ్యి కేసీఆర్ దక్షిణ భారతదేశంలోనే ఓ చరిత్ర సృష్టించబోతున్నారు. అన్ని సమస్యలను ముందుగానే పరిష్కరించి అసెంబ్లీలో ప్రశ్నించడానికి ప్రతిపక్షాలకు అవకాశం లేకుండా చేశాం. అందుకే వారు బూతులు మాట్లాడుతున్నారు. అలాంటి వారికి ప్రజలే ఓటుతో బుద్ధి చెబుతారు. తెలంగాణలో కాంగ్రెస్, భాజపా ఒక్కటయ్యాయి. మూడు ఉప ఎన్నికల్లో డిపాజిట్ కోల్పోయిన కాంగ్రెస్‌కు ఇప్పుడు భాజపా సహకరిస్తోంది. మళ్లీ భాజపా, భారాస ఒక్కటేనని బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారు. భారాస, భాజపా ఒక్కటే అన్న విషయం నిజమైతే మా ప్రభుత్వం తీసుకొచ్చిన బిల్లులను గవర్నర్ ఎందుకు ఆపుతారు. ఆమె ఆపడం వల్లే ఆర్టీసీ ఉద్యోగుల బిల్లు ఆలస్యమైంది. సత్యనారాయణ, దాసోజు శ్రవణ్‌ల పేర్లను ఎమ్మెల్సీలుగా ఎంపిక చేస్తే వాటిని ఆపేశారు. భాజపా, భారాస ఒక్కటే అయితే ఆ పార్టీ మా ఎమ్మెల్యేలను ఎందుకు కొనుగోలు చేయాలని చూస్తుంది. తెలంగాణ అడిగిన వాటిని ఇవ్వకుండా కేంద్రం ఎన్నో నిధులను ఆపేసింది. అందుకే కాంగ్రెస్ చేసే దుష్ప్రచారాన్ని నమ్మవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నాం. కాంగ్రెస్, భాజపాలు కలిసి లోయర్ సీలేరు ప్రాజెక్టు, ఏడు మండలాలు తెలంగాణకు దక్కకుండా చేశాయి. కేసీఆర్ పాలననే తెలంగాణ ప్రజలకు శ్రీరామరక్ష. పసిగుడ్డులాంటి తెలంగాణ కేసీఆర్ చేతుల్లో ఉండటమే సురక్షితం" అని హరీశ్ వివరించారు.



# కాంగ్రెస్ గెలిస్తే ఆదిలాబాద్ జిల్లాను దత్తత తీసుకుంటా

బోథ్: త్వరలో జరగనున్న ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపిస్తే ఆదిలాబాద్ జిల్లాను అభివృద్ధి పథంలో నడిపిస్తామని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదిలాబాద్ జిల్లా బోథ్‌లో నిర్వహించిన కాంగ్రెస్ విజయభేరి సభలో ఆయన మాట్లాడారు. పార్టీ నష్టపోతుందని తెలిసినా సోనియాగాంధీ ప్రత్యేక రాష్ట్రం ఇచ్చారన్నారు. ఆత్మహత్యలు చేసుకున్న విద్యార్థుల కుటుంబాలను కేసీఆర్ పరామర్శించలేదని రేవంత్ ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే 24 గంటల ఉచిత విద్యుత్ ఇస్తామని రేవంత్ హామీ ఇచ్చారు. మహాలక్ష్మి పథకం ద్వారా ప్రతి మహిళకు నెలకు రూ.2,500 ఇస్తామన్నారు. "కాంగ్రెస్ హయాంలో గ్యాస్ సిలిండర్ ధర రూ.400 ఉండేది. మోదీ, కేసీఆర్ కలిసి ప్రస్తుతం ఆ ధరను రూ.1200 చేశారు.

కేసీఆర్ వల్ల బోథ్‌కు నీళ్లు రాలేదు. ఈ నియోజకవర్గంలో ఒక్కసారి కాంగ్రెస్‌కు ఓటు వేయండి. కాంగ్రెస్ పార్టీ గెలిస్తే బోథ్‌లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేసే బాధ్యతతో పాటు ఆదిలాబాద్ జిల్లాను నేను దత్తత తీసుకుంటా. డిసెంబర్ 31లోపు బోథ్‌ను రెవెన్యూ డివిజన్ చేసే బాధ్యత నాది. సోనియా గాంధీ ప్రకటించిన ఆరు గ్యారెంటీలున అమలు చేసి తీరుతాం"అని రేవంత్‌రెడ్డి అన్నారు.

# పొన్నాల కేసీఆర్ పంచన చేరితే ఆయన గౌరవం ఏమైనా మిగిలిందా?

జనగామ: కేసీఆర్ పంచన మాజీమంత్రి పొన్నాల లక్ష్మయ్య చేరితే ఆయన గౌరవం ఏమైనా మిగిలిందా అని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి అన్నారు. బుధవారం నాడు జనగామలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మీడియాతో మాట్లాడతూ.."ఈ జన సందోహాన్ని చూస్తుంటే కాలనాగుల పని పట్టడానికి పుట్టలోనుంచి చీమలు బయటకు వచ్చినట్లుంది. జనగామలో పల్లా రాజేశ్వరరెడ్డిని ఓడించి బొంద పెట్టడానికి వచ్చిన మీకు అభినందనలు. పొన్నాల లేదని ఇక్కడ ఇబ్బంది జరుగుతదేమో అనుకున్నా...కానీ మిమ్మల్ని చూశాక నాకు ధైర్యం వచ్చింది. కన్నతల్లి లాంటి పార్టీని, కార్యకర్తలను మోసం చేసినవారికి బండకేసి కొడతామని నిరూపించారు. పల్లా రాజేశ్వర్ రెడ్డి గురించి ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి అర్ధనగ్న ప్రదర్శన చేసి చెప్పిండు. వీళ్లిద్దరి బాగోతం గడీలో ఉన్న దొరకు తెలుసు" అని రేవంత్‌రెడ్డి ఎద్దేవ చేశారు.

**ప్రగతి భవన్‌లో ప్రజలకు ప్రవేశం లేదు :** "ఈ ప్రాంతంలో మట్టికి ఒక పౌరుషం ఉంది. దొరల రాజ్యంపై పోరాటం చేసి ప్రజల పక్షాన నిలిచిన చరిత్ర ఈ ప్రాంతానిది. కష్టాల్లో ఉన్న కార్యకర్తలను మోసం చేసి పొన్నాల శత్రువు పంచన చేరాడు. అమెరికాలో మాట్లాడుకుని కేసీఆర్ పంచన చేరాడు. జనగామ ప్రజలు లక్ష కోట్లు దోచుకున్న దొంగ వైపు ఉంటారో ధర్మం వైపు ఉంటారో తేల్చుకోండి. ప్రజా ప్రభుత్వంలో పేదలను ఆదుకునేందుకు సోనియమ్మ ఆరు గ్యారంటీలను ప్రకటించారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే మాహిళలకు ప్రతీ నెల రూ.2500, రూ.500లకే గ్యాస్ సిలిండర్, రైతులకు ప్రతీ ఏటా ఎకరాకు రూ.15వేలు, రైతు కూలీలకు ప్రతీ ఏటా రూ.12వేలు, ఇల్లు కట్టుకునే ప్రతీ పేదవాడికి రూ.5లక్షలు ఆర్థికసాయం అందజేస్తాం. ప్రజల సొమ్ముతో కట్టిన ప్రగతి భవన్ లోకి కాంట్రాక్టర్లకు తప్ప ఎవరికీ ప్రవేశం లేదు. ప్రజలకు ప్రవేశం లేని ప్రగతి భవన్ ఉంటే ఏంది లేకుంటే ఏంది? కేసీఆర్ ఉంటే మీకు వచ్చే పెన్షన్ రూ.2వేలు.. కేసీఆర్ ప్రభుత్వాన్ని ఓడగొడితే రూ.4వేలు వస్తాయి. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే చేయూత పథకం ద్వారా నెలకు రూ.4వేలు పెన్షన్ అందిస్తాం" అని రేవంత్‌రెడ్డి అన్నారు.

# గూండా గిరి మాకు రాదు.. ఎవరి జాగా భూములు కబ్జా చేయలే



సిద్దిపేట: దుబ్బాక మండలం రామక్కపేట, పెద్ద చీకోడు గ్రామాల్లో బీజేపీ అభ్యర్థి, ఎమ్మెల్యే రఘునందన్ రావు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. పెద్ద చీకోడ్‌లో ఒక్కరికన్న దళిత బంధు, బీసీ బంధు రాలేదు ఎందుకు అని ప్రశ్నించారు. చీకోడులో డబుల్ బెడ్రూమ్ ఇండ్లు నచ్చిన వాళ్లకు ఇచ్చుకున్నారని ఆరోపించారు. "గూండా గిరి మాకు రాదు.. ఎవరి జాగ భూములు కబ్జా చేయలేను" అని స్పష్టం చేశారు. మంచికి మారుపేరు బీజేపీ పార్టీ, నాయకులన్నారు. పదహారు నెలల నుంచి గ్రామ పంచాయతీలకు రాష్ట్ర ప్రభుత్వం ఒక్క రూపాయి ఇవ్వలేదని మండిపడ్డారు. కరోనా పాండమిక్ పరిస్థితుల్లో రూ.50 లక్షల స్వంత ఖర్చులతో అంబులెన్స్ అందజేసినట్లు తెలిపారు. కుల సంఘాలను బీఆర్ఎస్ నాయకులు భయపట్టిస్తున్నారన్నారు. కోపన్ కార్డులు ఇవ్వాలని అసెంబ్లీలో కొట్లాడితే కోటర్ సీసాలు ఇస్తుంద్రని విమర్శించారు. చీకోడ్‌ను దత్తత తీసుకొని మంత్రి హరీశ్ రావు ఒక్క రోజు గ్రామానికి రాలే అని అన్నారు. భర్త చనిపోయిన మహిళ, 57 ఏండ్ల వారికి ఫెన్షన్ లేదన్నారు. మంత్రి హరీష్ రావు చాలా గొప్ప కళాకారుడని.. ఏ ఊరుకు పోయినా ఆ ఊరుకే నిధులు అని చెప్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మాయమాటలు, మోసగాళ్ల మాటలు నమ్మవద్దని సూచిస్తూ కమలం గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించాలని రఘునందన్‌రావు విజ్ఞప్తి చేశారు.

# రికార్డు స్థాయిలో నేషనల్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ సిస్టమ్ కంప్లైంట్స్.. 48 గంటల్లోనే క్లియర్




హైదరాబాద్: తెలంగాణలో ఎన్నికల వేల ఎలక్షన్ కమిషన్‌కు భారీగా ఫిర్యాదు వస్తున్నాయి. తెలంగాణ వ్యాప్తంగా నేషనల్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ సిస్టమ్ ఫిర్యాదులు రికార్డు స్థాయిలో నమోదు అయ్యాయి. 119 సెగ్మెంట్లలో వందల సంఖ్యలో ఫిర్యాదులు నమోదు అయ్యాయి. ఎలక్షన్ కోడ్ ఉల్లంఘిస్తున్నట్లు రాజకీయ పార్టీలు ఒకరిపై ఒకరు పరస్పర ఫిర్యాదులు చేస్తున్న పరిస్థితి. ఇప్పటి వరకు రాష్ట్ర వ్యాప్తంగా 20 వేలకుపైగా ఫిర్యాదులు వచ్చాయి. అయితే ఈ ఫిర్యాదులపై ఎలక్షన్ కమిషన్ తక్షణమే స్పందిస్తోంది.

వచ్చిన ప్రతీ కంప్లైంట్స్‌ను 24 గంటల నుంచి 48 గంటల్లో ఈసీ క్లియర్ చేసేస్తోంది. హైదరాబాద్, మేడ్చల్, రంగారెడ్డి ఒక్కో జిల్లాలో ఫిర్యాదులు 3 వేలు దాటాయి. అటు ఖమ్మం, నల్గొండ, నిజామాబాద్, సంగారెడ్డి, వరంగల్ జిల్లాల్లో 5 వందలకు పైగా ఫిర్యాదులు వచ్చాయి. వచ్చిన ఫిర్యాదుల్లో 416 పెండింగ్‌లో ఉన్నట్లు ఎలక్షన్ కమిషన్ పేర్కొంది. అధికారుల పనితీరు, అక్రమ కేసులు, అధికార పార్టీపై ఎక్కువ సంఖ్యలో ఫిర్యాదులు నమోదు అయ్యాయి.

# వాళ్లకు భయపడకండి.. ఎదురుతిరగండి



ఖమ్మం: అరాచకం, అవినీతి పాలన తరమి కొట్టాలని కాంగ్రెస్ అభ్యర్థి తుమ్మల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం 27వ డివిజన్ శ్రీనివాసనగర్‌లో తుమ్మల రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బెదిరించే వాళ్లకు భయపడకండి.. ఎదురు తిరిగి నిలబడాలని అన్నారు. దేశం కోసం ప్రాణ త్యాగం చేసిన సోనియా గాంధీ కుటుంబానికి రుణపడ్డామన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీ పథకాలతో పేదల జీవితాల్లో వెలుగులు నింపుతుందని తెలిపారు. మహిళల కష్టాలు తెలిసిన సాటి మహిళగా సోనియమ్మ మహాలక్ష్మీ పథకం రూపకల్పన చేశారన్నారు. ప్రశాంతమైన ఖమ్మం కోసం, అభివృద్ధి ఖమ్మం కోసం కాంగ్రెస్ పార్టీనే గెలిపించాలని తుమ్మల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు.

# ఎంపీ టికెట్ హామీతో నామినేషన్ ఉపసంహరించుకున్న పటేల్ రమేశ్‌రెడ్డి

సూర్యాపేట పట్టణం: సూర్యాపేట అసెంబ్లీ స్థానానికి ఆల్ ఇండియా ఫార్వార్డ్ బ్లాక్ పార్టీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన పటేల్ రమేశ్‌రెడ్డి తన నామినేషన్‌ను ఉపసంహరించుకున్నారు. కాంగ్రెస్ నుంచి బీఫాం దక్కకపోవడంతో ఆయన రెబెల్‌గా నామినేషన్ వేశారు. దాంతో దామోదర్‌రెడ్డి గెలుపు అవకాశాలను రమేశ్‌రెడ్డి ప్రభావితం చేస్తారనే ఉద్దేశంతో హస్తం పార్టీ రంగంలోకి దిగి బుజ్జగింపు ప్రయత్నాలు చేసింది. తొలుత పటేల్ రమేష్‌రెడ్డి ఇంటికి ఏఐసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు మల్లు రవి, రోహిత్ చౌదరి వెళ్లారు. ఈ క్రమంలో కొన్ని నాటకీయ పరిణామాలు చోటు చేసుకున్నాయి. నామినేషన్ ఉపసంహరించుకునేది లేదని, అవసరమైతే దామోదర్‌రెడ్డిని పోటీ నుంచి తప్పించాలని రమేశ్‌రెడ్డి వర్గీయులు డిమాండ్ చేశారు. చర్చలు జరుగుతున్న గది వైపు రాళ్లు విసిరారు. మల్లురవి, రోహిత్ చౌదరిలను బయటకు వెళ్లనివ్వకుండా తాళం వేసే ప్రయత్నం చేశారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ నేతలు కేసీ వేణుగోపాల్, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, రేవంత్‌రెడ్డితో మల్లు రవి, రోహిత్ చౌదరి చర్చించారు. అనంతరం రమేశ్‌రెడ్డికి ఎంపీ టికెట్ ఇస్తామని హామీ ఇచ్చారు. దాంతో ఆయన కాస్త చల్లబడ్డారు. నామినేషన్ ఉపసంహరణకు అంగీకరించారు. ఈ సందర్భంగా పటేల్ రమేశ్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ కన్నీరుమున్నీరుగా విలపించారు. పార్టీ కోసమే తాను ఈ నిర్ణయం తీసుకుంటున్నానని ప్రకటించారు.

**ఇబ్రహీంపట్నంలోనూ..** ఇబ్రహీంపట్నంలోనూ కాంగ్రెస్ టికెట్ దక్కకపోవడంతో దండెం రాంరెడ్డి అక్కడ రెబెల్‌గా నామినేషన్ వేశారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ ఇన్‌ఛార్జి మాణిక్‌రావు ఠాక్రే ఆయనతో మాట్లాడారు. దీంతో దండెం రాంరెడ్డి నామినేషన్ ఉపసంహరణకు అంగీకరించారు. ఇబ్రహీంపట్నం టికెట్ పార్టీ అధిష్ఠానం మల్‌రెడ్డి రంగారెడ్డికి ఖరారు చేసిన విషయం తెలిసిందే.

# రాష్ట్రమంతా పింక్ వేవ్..సీఎం కేసీఆర్ హ్యాట్రిక్ ఖాయం : ఎమ్మెల్సీ కవిత



బోధన్ : రాష్ట్రమంతా పింక్ వేవ్ కనిపిస్తోందని, మూడో సారి సీఎం కేసీఆర్ అధికారంలోకి వచ్చి దక్షిణాదిన తొలిసారి హాట్రిక్ సాధించి రికార్డు సృష్టిస్తారని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. ప్రజలు గర్వంగా కారు గుర్తుకు ఓటేసి బీఆర్ఎస్ ను గెలిపించాలన్న ఆశతో ఉన్నారని పేర్కొన్నారు. బోధన్ ప్రజా ఆశీర్వాద సభలో కవిత పాల్గొని మాట్లాడారు. సీఎం కేసీఆర్ అంటే అభివృద్ధికి గుర్తు. కేసీఆర్ అంటే ప్రేమకు పరాకాష్ట అని వ్యాఖ్యానించారు. గులాబీ జెండా ఎత్తి తెలంగాణ ఉద్యమానికి బయలుదేరినప్పుడు ఇదే కాంగ్రెస్, బీజేపీ నాయకులు ఎక్కడున్నారని ప్రశ్నించారు. అందరూ పిడికిలి ఎత్తి ఉద్యమం చేస్తున్నప్పుడు పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి బందూక్ పట్టుకొని ప్రజల మీదకి పచ్చిన విషయాన్ని మరిచిపోతారా అని అడిగారు. రైతుబంధును రైతులకు బిచ్చమేస్తున్నామని కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతున్నారని, పెన్షన్లు, బీమా వృథాగా ఇస్తున్నామని కూడా అంటున్నారు. అధికారంలో లేనప్పుడే ఇంత అహంకారంతో మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ రేపు పొరపాటున అధికారంలోకి వస్తే కనీసం ప్రజలను పట్టించుకుంటారా అన్నది ఆలోచించాలని విజ్ఞప్తి చేశారు. బీఆర్ఎస్, సీఎం కేసీఆర్ అంటే ఆత్మీయత అని, కాంగ్రెస్ పార్టీ అంటే అహంకారం అని తెలిపారు. గ్రామల్లో తెలంగాణ అభివృద్ధిపై చర్చించాలని కోరారు. బోధన్ కాంగ్రెస్ అభ్యర్థి సుదర్శన్ రెడ్డి గతంలో సాగునీటి శాఖ మంత్రిగా పనిచేసినా కూడా ఒక్క చెరువును మరమ్మత్తు చేయలేదని విమర్శించారు.

సీఎం కేసీఆర్ ఆశీర్వాదంతో బీఆర్ఎస్ ఎమ్మెల్యే షకీల్ నిజాం సాగర్ కాలువల ఆధునీకరణకు కృషి చేశారని, ఎన్నో చెరువులను బాగు చేసుకున్నామని, చివరి ఆయకట్టుకు కూడా నీళ్లు పచ్చేలా పని చేసుకున్నామని తెలిపారు. బీఆర్ఎస్ అభ్యర్థి షకీల్‌ను భారీ మెజారిటీతో గెలిపించి సీఎం కేసీఆర్ కు బోధన్‌ను బహుమానంగా ఇద్దామని పిలుపునిచ్చారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com